సోమవారం
21•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 116
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD










# శతఘ్నుల గర్జన

## ఎల్వోసీ వద్ద విరుచుకుపడిన భారత సైన్యం.. మూడు పాక్ ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం

ఆరు నుంచి పది మంది పాక్ సైనికుల మరణం ▪ అంతే సంఖ్యలో హతమైన ఉగ్రవాదులు

పాక్ మిలిటరీ పోస్టులూ ధ్వంసం ▪ భారత సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ వెల్లడి

శనివారం ఇద్దరు భారత జవాన్లను పొట్టనబెట్టుకున్న పాక్‌కు భారత్ గుణపాఠం



ఎల్వోసీలో పాక్ సైన్యానికి శతఘ్నులతో దీటుగా జవాబిస్తున్న భారత సైనికులు (ఫైల్‌ఫొటో). (ఇన్‌సెట్) మీడియాతో మాట్లాడుతున్న సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:**

నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి పాకిస్థాన్ సైన్యం సాయంతో భారత్‌లోకి చొరబాటుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదులపై భారత సైన్యం ఆదివారం ఎదురుదాడి చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకేలోని) ఉగ్ర శిబిరాల (టెర్రర్ లాంచ్ ప్యాడ్లు) పై భారత బలగాలు దాడులు చేశాయి. కుప్వారాలోని తాంగ్ధర్ సెక్టార్‌కు ఎదురుగా ఉన్న నీలం లోయలోని కనీసం నాలుగు ఉగ్రశిబిరాలతో పాటు పాక్ సైన్యానికి చెందిన పలు మిలిటరీ పోస్టులపై భారత బలగాలు శతఘ్నులతో విరుచుకుపడ్డాయి. ఈ ఘటనలో ఆరు నుంచి పది మంది పాక్ సైనికులు చనిపోయినట్టు దేశ సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ తెలిపారు. అంతే సంఖ్యలో ఉగ్రవాదులు హతమైనట్టు పేర్కొన్నారు. మృతుల సంఖ్యపై మరింత సమాచారం తెలియాల్సి ఉన్నదన్నారు. పాకిస్థాన్ సైన్యానికి చెందిన పోస్టులు కూడా భారీఎత్తున ధ్వంసమైనట్లు సమాచారం. 'భారత సరిహద్దులకు అత్యంత చేరువగా ఉగ్రవాదులు వచ్చారని ఇటీవల మాకు సమాచారం అందింది. ఈ ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడటానికి వీలుగా.. పాక్ కాల్పుల నియంత్రణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ దాడులకు తెగబడుతున్నది. ఇందులో భాగంగానే శనివారం సాయంత్రం తాంగ్ధర్ సెక్టార్‌లో పాక్ కాల్పులకు దిగింది. ఈ ఘటనలో ఇద్దరు భారత జవాన్లు అమరులయ్యారు. చొరబాట్లు జరుగుతున్న ప్రాంతాలపై దృష్టి పెట్టాం. అక్కడ ఉన్న శిబిరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరిపాం. శిబిరాలను ధ్వంసం చేసి సరిహద్దుల్లోని ఉగ్రవాదులకు మౌలిక

మిగతా 5వ పేజీలో

# నేటినుంచి స్కూళ్లు

## విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు.. అన్ని బస్‌పాస్‌లు చెల్లుబాటు

## బస్‌పాస్‌లున్న విద్యార్థులు టికెట్ తీసుకోవద్దు

- షెడ్యూల్ ప్రకారం బస్సులను నడుపాలని నిర్ణయం
- ముందస్తుగా సాయంత్రం వేళల్లోనే డ్రైవర్లకు టోకెన్లు
- గ్రేటర్ పరిధిలో డ్రైవర్లకు రూ.250 పెంచే ఆలోచన
- అధికారులతో పలుమార్లు సమీక్షించిన మంత్రి పువ్వాడ
- ఇక పూర్తిస్థాయిలో సేవలందించేందుకు ఏర్పాట్లు

**72%** తిరిగిన ఆర్టీసీ బస్సులు



ఆదివారం వనపర్తి బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దసరా సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు సోమవారం నుంచి పున: ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొంటున్నది. బస్సుల్లో పాస్‌లన్నీ చెల్లుబాటు అవుతాయని, బస్‌పాస్‌లున్న విద్యార్థులు టికెట్ తీసుకోరాదని, టికెట్ తీసుకోవాలని బలవంతం చేస్తే ఫిర్యాదుచేయాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. విద్యార్థులకోసమే బస్సులు వెళ్లే ప్రాంతాల్లో కచ్చితంగా బస్సులు నడిపించాలని నిర్ణయం తీసుకొన్నారు. విద్యాసంస్థలు తిరిగి ప్రారంభం అవుతుండటంతో.. ప్రజారవాణాపై ఆర్టీసీ సమ్మె ప్రభావం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం ఖైరతాబాద్ ఆర్టీవో ఆఫీసు నుంచి ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులతో పలుమార్లు సమీక్షించారు. రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా, జేటీసీ, డీటీసీలతో చర్చించారు. సోమవారం ఉదయం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. ఉదయం పది గంటల నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఆర్టీసీ, రవాణా అధికారులు, డిపో మేనేజర్లతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించనున్నారు. సోమవారం నుంచి విద్యాసంస్థల బస్సులు

మిగతా 2వ పేజీలో

# ఇది 'ఆణిముత్యం'

- ప్రపంచంలోనే అత్యంత పురాతనమైనది
- 8000 ఏండ్ల కిందటి నియోలిథిక్ యుగానిది
- ఈ నెల 30న అబూధాబీ మ్యూజియంలో తొలిసారి ప్రదర్శన

2



# ఫార్మాసిటీకి సాయంచేయండి

- మౌలిక వసతుల కోసం రూ.1318 కోట్ల గ్రాంట్‌ఇన్ ఎయిడ్
- సీఈటీపీకి రూ.2100 ఆర్థికసాయం అందించండి
- ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత ఫార్మా పార్కు
- ఫార్మాసిటీ ద్వారా రూ.64వేల కోట్ల పెట్టుబడులు
- 5.60 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- కేంద్ర మంత్రులు గోయల్, ప్రధాన్‌లకు మంత్రి కేటీఆర్ లేఖలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ ఫార్మాసిటీ (హెచ్‌పీసీ)కి పెద్దఎత్తున ఆర్థికసహాయం చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖల మంత్రి కే తారకరామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఫార్మాసిటీని జాతీయ పెట్టుబడి తయారీజోన్ (నిమ్జ్)గా సూత్రప్రాయంగా గుర్తించిన నేపథ్యంలో ఆ మార్గదర్శకాల ప్రకారం ఆర్థికసాయంతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. మౌలిక సదుపాయాల కోసం గ్రాంట్ రూపంలో ఆర్థిక సహాయం ప్రకటించాలని కేంద్ర పరిశ్రమలు,

మిగతా 2వ పేజీలో



# ఏడు జిల్లాల్లో భారీ వర్షం

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- అత్యధికంగా భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో 11.2 సెం.మీ. వర్షపాతం
- రాష్ట్రవ్యాప్తంగా మరో రెండ్రోజులు.. గ్రేటర్ హైదరాబాద్‌లో వచ్చే ఐదురోజులు వర్షసూచన

7








సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆదివారం ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో పోలింగ్ బూత్‌ల వివరాలు సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

# హుజూర్‌నగర్ పోలింగ్ నేడు

- ఏర్పాట్లన్నీ పూర్తి.. పటిష్ఠ పోలీస్ బందోబస్తు
- 302 పోలింగ్ కేంద్రాలు, 2,36,842 మంది ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది
- గెలుపుపై ధీమాగా టీఆర్‌ఎస్ శ్రేణులు
- ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఉత్తమ్
- ఎన్నికల సంఘానికి టీఆర్‌ఎస్ ఫిర్యాదు.. కేసు నమోదు

2

మహారాష్ట్ర, హర్యానాలో

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

18 రాష్ట్రాల్లోని 51 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలకు నేడు ఉపఎన్నికలు

5

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 73.00 | రిటైల్ లైవ్ | 95.00 |
| డ్రెస్డ్ | 138.00 | స్కిన్‌లెస్ | 157.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 370.00 | రంగారెడ్డి | 370.00 |
| మెదక్ | 370.00 | కరీంనగర్ | 373.00 |
| వరంగల్ | 373.00 | చిల్లర ధర | 4.30 |



# రోహిట్ డబుల్ సెంచరీ

- నయా ఓపెనర్ దూకుడు
- టెస్టుల్లో తొలి ద్విశతకం
- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 497/9 డిక్లేర్

8






భవనంపైనుంచి రిక్షాలో పడిపోతున్న బాలుడు.. చిన్నారిని దవాఖానకు తీసుకెళ్తున్న స్థానికులు

## బాలుడికి ప్రాణభిక్ష పెట్టిన రిక్షా!

- 35 అడుగుల ఎత్తు నుంచి పడినా.. ప్రాణాలతో బయటపడిన చిన్నారి

**టికామ్‌గఢ్:** రెండంతస్తుల భవనంపై నుంచి కిందపడిన మూడేండ్ల చిన్నారి అనూహ్య రీతిలో ప్రాణాలతో బయటపడ్డాడు. రోడ్డుపై వెళ్తున్న ఓ రిక్షా అతడి ప్రాణాలను కాపాడింది. 35 అడుగుల ఎత్తున్న బిల్డింగ్ నుంచి ప్రమాదవశాత్తూ జారిన ఆ చిన్నారి.. అదేసమయంలో రోడ్డుపై వెళ్తున్న రిక్షాలోని సీటుపై పడటంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యప్రదేశ్‌లోని టికామ్‌గఢ్‌లో ఈ ఘటన చోటు చేసుకున్నది. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ప్రమాదం గురించి బాలుడి తండ్రి మాట్లాడుతూ.. 'కుటుంబ సభ్యులతో కలిసి రెండో అంతస్తులో నా కుమారుడు ఆడుకుంటున్నాడు. మా తండ్రి, సోదరి కూడా అక్కడే ఉన్నారు. చిన్నారి ఆడుకుంటూ అలాగే బాల్కనీలోకి వెళ్లి రెయిలింగ్‌కు వేలాడటం మొదలు పెట్టాడు. అయితే ప్రమాదవశాత్తూ బ్యాలెన్స్ తప్పడంతో కిందపడిపోయాడు. అయితే అదే సమయంలో ఓ రిక్షావాలా దేవుడిలా వచ్చి నా కుమారుడిని కాపాడాడు. వెంటనే మేం బాలుడిని దవాఖానకు తీసుకెళ్లాం' అని వివరించాడు. సీటీ స్కాన్, ఎక్స్‌రే, ఇతర పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. బాలుడు క్షేమంగా ఉన్నట్టు చెప్పారు.

## ఇది 'ఆణిముత్యం'



- ప్రపంచంలోనే అత్యంత పురాతనమైనది
- 8వేల ఏండ్ల కిందటి నియోలిథిక్ యుగానిది
- ఈ నెల 30న అబూ ధాబీ మ్యూజియంలో తొలిసారి ప్రదర్శన

**అబూ ధాబీ, అక్టోబర్ 20:** ప్రపంచంలోనే అత్యంత పురాతన సహజ ముత్యం ఇటీవల బయటపడింది. ఇది సుమారు 8000 ఏండ్ల కిందటి నియోలిథిక్ యుగానికి చెందినదని పురావస్తు శాస్త్రవేత్తలు ఆదివారం తెలిపారు. యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబూ ధాబీకి సమీపంలోని మార్వా ద్వీపంలో జరిపిన తవ్వకాల్లో ఈ పురాతన సహజ ముత్యాన్ని వెలికితీశారు. ఇది లభించిన భూమి పొరలను కార్బన్ డేటెడ్ పరిజ్ఞానం ద్వారా పరిశీలించగా క్రీస్తు పూర్వం 5800-5600 నాటి నియోలిథిక్ కాలానికి చెందినదిగా నిర్ధారణ అయ్యిందని అబూ ధాబీ సాంస్కృతిక, పర్యాటకశాఖ పేర్కొన్నది. తమ దేశ ఆర్థిక, సాంస్కృతిక చరిత్రకు నాటి కాలంతో సంబంధాలున్నట్టు ఈ పురాతన ముత్యం ద్వారా తెలుస్తున్నదని ఆ శాఖ చైర్మన్ మహ్మద్ అల్-ముబారక్ తెలిపారు. దీని తోపాటు సిరామిక్స్, రాతి, షెల్ పూసలు, రాతికొనతో కూడిన బాణాలు లభించినట్టు ఆయన చెప్పారు. ఈ నెల 30న అబూ ధాబీలోని లూవ్రేలో ప్రారంభంకానున్న పారిస్‌కు చెందిన మ్యూజియంలో ప్రపంచపు అత్యంత పురాతన సహజ ముత్యాన్ని తొలిసారిగా ప్రదర్శించనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ ముత్యంతోపాటు తవ్వకాల్లో లభించిన ఇతర వస్తువులు పది వేల ఏండ్ల నాటి విలాసానికి అద్దం పడుతున్నాయని, నాడు వీటిని ఆభరణాలుగా వినియోగించి ఉంటారని ఎమిరేట్స్‌కు చెందిన పురావస్తు నిపుణులు భావిస్తున్నారు. మిసొపొటేమియా (పురాతన ఇరాక్)తో వస్తుమార్పిడి పద్ధతిలో వ్యాపారం జరిగి ఉంటుందని, ఇక్కడి దీవుల తీరాల్లో సహజంగా లభించే ముత్యాలకు బదులుగా సిరామిక్స్, ఇతర వస్తువులను మార్పిడి చేసుకునేవారని విశ్లేషించారు. 16వ శతాబ్దంలో యూఏఈ ఆర్థిక శక్తిగా ఉన్న ముత్యాల వ్యాపారం, 1930లో జపాన్ కల్చర్ ముత్యాల రాకతో కుప్పకూలిందన్నారు. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాలు చమురు పరిశ్రమలపై దృష్టిసారించి ఆర్థికంగా రాణించాయని పేర్కొన్నారు.



# హుజూర్‌నగర్ పోలింగ్ నేడు

### ఏర్పాట్లన్నీ పూర్తి.. 302 పోలింగ్ కేంద్రాలు, 2,36,842 మంది ఓటర్లు

- పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది
- పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు
- గెలుపుపై ధీమాగా టీఆర్ఎస్ శ్రేణులు
- ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఉత్తమ్
- ఎన్నికల సంఘానికి టీఆర్ఎస్ ఫిర్యాదు.. కేసు నమోదు



హుజూర్‌నగర్‌లో ఈవీఎంను పరిశీలిస్తున్న కలెక్టర్ అమయ్‌కుమార్, ఎస్పీ భాస్కరన్, ఎన్నికల పరిశీలకుడు సుచింద్రప్రతాప్‌సింగ్



హుజూర్‌నగర్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో పోలింగ్ బూత్‌ల వివరాలను సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

**హుజూర్‌నగర్/హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ ఉపఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధంచేశారు. ఓటింగ్ కోసం 302 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పోలింగ్ సామగ్రితో సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరిగేందుకు పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో 2,36,842 మంది ఓటర్లుండగా, వీరిలో పురుషులు 1,16,415 మంది, మహిళలు 1,20,427 మంది. వీరుకాక మరో 101 మంది సర్వీస్ ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 302 పోలింగ్ కేంద్రాలకుగాను అర్బన్‌లో 31, రూరల్‌లో 271 కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిలో 79 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి, వాటిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు వెబ్ క్యాస్టింగ్‌ను ఏర్పాటుచేశారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి రెండు విడుతలుగా శిక్షణ ఇచ్చారు. సమస్యాత్మక ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో బందోబస్తు కోసం 2,350 మంది పోలీస్ సిబ్బందితోపాటు టీఎస్ఎస్పీ నుంచి 3 బలగాలను, 6 సెంట్రల్ ఫోర్స్ బలగాలను ప్రత్యేకంగా రప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో తలెత్తే సమస్యలను పరిష్కరించడానికి 27 కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉపఎన్నికల నిర్వహణకు 1,241 మంది సిబ్బంది పాల్గొంటుండగా, వీరిని ఆదివారం 27 రూట్లలో 94 బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలింగ్‌కు 302 పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెటింగ్ యూనిట్లు 965, ఈవీఎంలు 372, వీవీ ప్యాట్లు 388 ఉపయోగిస్తున్నారు. ఉపఎన్నికల సిబ్బంది హుజూర్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో ఉన్న పోలింగ్ సామగ్రిని తీసుకొని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

> **ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు**
>
> ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నాం. 302 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించేందుకు పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇచ్చాం. ఓటింగ్ యంత్రాల్లో సమస్యలు తలెత్తితే బెల్ ఇంజినీర్లతో వెంటనే నివృత్తి చేసుకోవడానికి అవకాశం కల్పించాం. గ్రామాల్లో ఎన్నికల సిబ్బందికి పార్టీల నాయకులు సహకరించాలి.
>
> \- కలెక్టర్ అమయ్‌కుమార్
>
> **విధులను సక్రమంగా నిర్వహించాలి**
>
> ఎవరి విధులను వారు సక్రమంగా నిర్వహిస్తే ఎలాంటి సమస్యలు రావు. సిబ్బంది పోలింగ్ ఏజెంట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అనుమతి లేని వారిని పోలింగ్ భూత్ వద్దకు అనుమతించొద్దు. 200 మీటర్లలోకి ఓటర్లను మినహాయించి మరెవ్వరినీ పంపొద్దు.
>
> \- ఎస్పీ భాస్కరన్

### సర్వేలన్నీ టీఆర్ఎస్‌వైపే

ప్రజల మద్దతుతో హుజూర్‌నగర్‌లో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని టీఆర్ఎస్ శ్రేణులు ధీమాగా ఉన్నాయి. ఇక్కడ విజయం సాధించి ప్రతిపక్షాలకు మరోసారి చెంపపెట్టులా సమాధానం ఇవ్వాలని కార్యకర్తలు ఉవ్విళ్లూరుతున్నాయి. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో హుజూర్‌నగర్‌ను ముందుంచాలంటే టీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. 'టీఆర్ఎస్ గెలిస్తే హుజూర్‌నగర్ ప్రజలకు మేలుఅని.. కాంగ్రెస్ గెలిస్తే ఉత్తమ్ కుటుంబానికి మేలు' అని ప్రచారంచేశారు. షెడ్యూల్ విడుదలైన వెంటనే అభ్యర్థిగా సైదిరెడ్డిని ప్రకటించి టీఆర్ఎస్ ఇతర పార్టీల కంటే ముందున్నది. ఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి కలిసి నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌ను సమన్వయంచేశారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు. హుజూర్‌నగర్‌లో ఒకరోజు రోడ్‌షో నిర్వహించారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు పార్టీ నాయకులకు సలహాలు, సూచనలు అందించారు. పార్టీ అభ్యర్థి గెలుపు ఓటములపై వివిధ సర్వేల నివేదికలను క్రోడీకరించి వాటిని పార్టీ శ్రేణులకు వివరించారు. 50 శాతానికి పైగా ఓట్లు టీఆర్ఎస్ అభ్యర్థికే వస్తున్నాయంటూ అనేక సర్వేలు వెల్లడించాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ఐదున్నరేండ్లుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. నియోజకవర్గంలో అధికంగా ఉన్న గిరిజనులకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించడానికి తండాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలను కలిసి వారితో మమేకమై టీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. గతంలో కాంగ్రెస్‌కు ఓటు వేయడం ద్వారా నియోజకవర్గం ఏ విధంగా వెనుకబడింది, టీఆర్ఎస్‌ను గెలిపిస్తే ఎలాంటి లాభం ఉంటుందో స్పష్టంగా వివరించారు.

### ఉత్తమ్‌పై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల నియమావళికి విరుద్ధంగా నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌లో ఉంటున్నారని, ఆయనను అక్కడినుంచి వెంటనే పంపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేసింది. ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత స్థానికేతరులు ఎన్నికలు జరిగే నియోజకవర్గంలో ఉండకూడదనే నిబంధన ఉన్నదని, ప్రచారం గడువు ముగిసిన తర్వాత కూడా ఉత్తమ్ హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనే ఉంటున్నారని ఆదివారం టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉత్తమ్.. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో కోదాడ పట్టణంలోని ఇంటి నంబర్ 3-199లో ఉంటున్నట్టు పేర్కొన్నారని, కోదాడలోని 172 పోలింగ్ స్టేషన్‌లో ఉత్తమ్‌కు ఓటు ఉన్నదని ఫిర్యాదులో తెలిపారు. ఆయన మాత్రం అధికార యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టిస్తూ హుజూర్‌నగర్‌లో నివాసముంటున్నట్టు చెపుతున్నారని ఫిర్యాదులో వివరించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా హుజూర్‌నగర్‌లో ఆదివారం కూడా మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేశారని పేర్కొన్నారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

### ఉత్తమ్‌పై కేసు నమోదు

**హుజూర్‌నగర్‌రూరల్:** హుజూర్‌నగర్‌లో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు పీసీసీ చీఫ్, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఆదివారం మీడియా సమావేశం నిర్వహించిన ఉత్తమ్.. టీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. నాలుగేండ్లుగా అభివృద్ధి ఏమి జరుగలేదన్నారు. ఎంపీ నిధులతో హుజూర్‌నగర్‌లో ఈఎస్ఐ దవాఖాన, మట్టపల్లి నుంచి హుజూర్‌నగర్‌వరకు నాలుగులైన్ల రోడ్డు, జగయ్యపేట నుంచి మిర్యాలగూడవరకు ప్యాసింజర్ రైలును తీసుకొస్తానని చెప్పి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. దీనిపై సమాచారం అందుకున్న ఎంసీసీ హుజూర్‌నగర్ టీం అధికారి పెంటయ్య.. ఎస్సై అనిల్‌రెడ్డికి ఫిర్యాదుచేశారు. దీంతో ఉత్తమ్‌పై ఐపీసీ సెక్షన్ 188, 126 ప్రకారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

### కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే చంపుతానని బెదిరింపు.. కేసు నమోదు

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకపోతే చంపుతానని బెదిరించిన ఘటన హుజూర్‌నగర్ మండలం గోపాలపురంలో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం గ్రామానికి చెందిన పస్తం పెంటమ్మ అనే మహిళను ఆమె మరిది పస్తం కృష్ణ ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకపోతే చంపుతానని బెదిరించాడు. ప్రతిసారి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తున్నావంటూ నెట్టివేసాడు. దీంతో ఆమె చేతికి గాయమైనట్టు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఫార్మాసిటీకి సాయంచేయండి


మొదటిపేజీ తరువాయి...


వాణిజ్యశాఖల మంత్రి పీయూష్ గోయల్‌కు.. ఫార్మాసిటీకి అవసరమైన సహజవాయువును ప్రిఫరెన్షియల్ టారిఫ్ ప్రాతిపదికన కేటాయించాలని కోరుతూ పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వేర్వేరుగా లేఖలు రాశారు. హైదరాబాద్ ఫార్మాసిటీ ప్రపంచంలోనే అతి పెద్ద సమీకృత ఫార్మా పార్క్ అని మంత్రి కేటీఆర్ తన లేఖల్లో పేర్కొన్నారు. దేశంలో ఫార్మారంగ అభివృద్ధికి ఈ పార్క్ దోహదపడుతుందని, జాతీయ ప్రాధాన్యంగల ప్రాజెక్టుగా ఫార్మాసిటీని కేంద్రం గుర్తించిందని తెలిపారు. హెచ్‌పీసీకి జాతీయ అంతర్జాతీయ ఫార్మా కంపెనీల నుంచి మంచి స్పందన లభిస్తున్నదని, ఫార్మాసిటీలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక కంపెనీలు సుముఖంగా ఉన్నాయని వివరించారు. మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో ఫార్మాసిటీ అంతర్జాతీయ ఫార్మా రంగంలో భారతదేశపు నాయకత్వ స్థాయిని మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. ఫార్మాసిటీకి కేంద్రం మద్దతునివ్వాలని మంత్రి కేటీఆర్ తన లేఖల్లో కేంద్ర మంత్రులను కోరారు.

### కాలుష్యరహితంగా..

జీరో లిక్విడ్ డిశ్చార్జి పద్ధతిలో కాలుష్యరహితంగా.. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హెచ్‌పీసీ నిర్మాణమవుతున్నట్లు పీయూష్‌గోయల్‌కు రాసిన లేఖలో మంత్రి కేటీఆర్ తెలిపారు. అంతర్జాతీయ ఫార్మా యూనివర్సిటీ, లాజిస్టిక్స్ పార్క్, ట్రైనింగ్, టెస్టింగ్ పరిశోధనశాలలు, కామన్ డ్రగ్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటి సౌకర్యాలతోపాటు ఫార్మారంగంలోని స్టార్టప్‌లకు ప్రత్యేక హబ్ ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. మొత్తం 19,333 ఎకరాలకు మాస్టర్‌ప్లాన్ పూర్తయిందని, మొదటి దశలో భాగంగా 8,400 ఎకరాలకు సవివరమైన డిజైన్లు కూడా పూర్తయ్యాయని చెప్పారు. హెచ్‌పీసీకి కేంద్రం ఇప్పటికే పర్యావరణ అనుమతులు ఇచ్చిందని, తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ)ని ఏర్పాటు చేసి తొలిదశ పనులను ప్రారంభించిందని పేర్కొన్నారు. హెచ్‌పీసీ ద్వారా రూ.64 వేల కోట్ల పెట్టుబడులు రావటానికి అవకాశమున్నదని, ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5.60 లక్షల మందికి ఉద్యోగాలు దొరికే వీలున్నదని తెలిపారు. ఇంత విశేష ప్రాధాన్యమున్న ఫార్మాసిటీకి నిమ్జ్ మార్గదర్శకాల మేరకు బహిరంగ మౌలిక వసతుల కల్పన కోసం రూ.1318 కోట్ల గ్రాంట్‌ఇన్ ఎయిడ్ అందించాలని కోరారు. దీంతోపాటు అంతర్గత మౌలిక వసతుల కల్పన, కామన్ ఎఫ్లూయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ) వంటి సాంకేతిక మౌలిక వసతుల సదుపాయాల కోసం 50% ఖర్చును (సుమారు రూ.2100 కోట్లు) సహాయంగా అందించాలని పేర్కొన్నారు. ఫార్మాసిటీలో ఏర్పాటుచేయనున్న కంపెనీల అవసరాలకోసం సహజ వాయువును ప్రిఫరెన్షియల్ టారిఫ్ ప్రాతిపదికన కేటాయించాలని పెట్రోలియంశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు విజ్ఞప్తిచేశారు. ప్రస్తుతం ఫార్మా కంపెనీలు బొగ్గును ఇంధనంగా వాడుతున్నాయని, కానీ, హెచ్‌పీసీని గ్రీన్ ఇండస్ట్రియల్ కాన్సెప్ట్ (కాలుష్యరహిత పద్ధతి) ప్రకారం ఏర్పాటుచేస్తున్నందున సహజవాయువును వినియోగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇది కొంత ఖర్చుతో కూడుకున్నందున.. తక్కువ ధరకు సహజవాయువును సరఫరాచేయాలన్నారు. ఫార్మాసిటీలోని యూనిట్లకు అవసరమైన 3.4 ఎంఎంఎస్‌సీఎండీ (మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ పర్ డే)ని కేటాయించాలని మంత్రి కేటీఆర్.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.11 గంటలకు

సూర్యాస్తమయం: 5.46 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం, సప్తమి ఉదయం 6.44 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: పునర్వసు సాయంత్రం 5.31 వరకు, తదుపరి పుష్యమి, అమృతఘడియలు: మధ్యాహ్నం 3.09 నుంచి సాయంత్రం 4.44 వరకు, రాహుకాలం: ఉదయం 7.38 నుంచి 9.05 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.22 నుంచి 1.08 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.41 నుంచి 3.27 వరకు, వర్జ్యం: ఉదయం 5.41 నుంచి 7.16 వరకు, తిరిగి అర్ధరాత్రి 1.13 నుంచి 2.46 వరకు.

# నేటినుంచి స్కూళ్లు


మొదటిపేజీ తరువాయి...


ప్రజా రవాణాకు తిరిగే అవకాశాలు లేకపోవడంతో ప్రైవేట్ బస్సులు, సెవెన్ సీటర్ ఆటోలు, ఇతర వాహనాల సంఖ్యను పెంచాలని మంత్రి పువ్వాడ ఆర్టీవోలకు ఆదేశాలిచ్చారు. ఆర్టీసీ పరిధిలోని గరుడ, రాజధాని ఏసీ బస్సులు మినహా.. ప్రతి బస్సును నిర్దేశించిన రూట్లలో నడపాలని.. పల్లె వెలుగు బస్సులను యథాతథంగా పాత తరహాలోనే తిప్పాలని డిపోల్లో షెడ్యూలును ఖరారుచేశారు. తాత్కాలిక డ్రైవర్లకు ప్రతిరోజు సాయంత్రం విధులు ముగియగానే మర్నాటికి సంబంధించిన రూటు, బస్ టోకెన్‌ను అప్పగించాలని నిర్ణయించారు. దీంతో ఉదయం డిపోకు వెళ్లే డ్రైవర్లు ఆలస్యం చేయకుండా బస్సును తీసుకొని వెళ్లడానికి వీలవుతుంది. దూరప్రాంతాలకు వెళ్లే డ్రైవర్లకు ఆర్టీసీ రెగ్యులర్ డ్రైవర్ డ్యూటీల మాదిరిగానే రోజు విడిచి రోజు విధులను అప్పగించనున్నారు. సమ్మెకు ముందు నిర్వహించిన మాదిరిగానే కాలమాన పట్టికను సోమవారం నుంచి పకడ్బందీగా అమలుచేస్తారు. కొన్ని జిల్లాల్లో డిపో మేనేజర్లు బస్సుల కండిషన్లను సాకుగా చూపిస్తూ బయటకు వెళ్లనీయడంలేదని.. ఈ క్రమంలో బస్సుల కండిషన్లను పరిశీలించి, ట్రయల్‌రన్ చేసి నడిపించడానికి రవాణాశాఖ అధికారులకు ప్రత్యేక అధికారాలిచ్చారు. గరుడ, రాజధాని ఏసీ బస్సులను మాత్రం తాత్కాలిక డ్రైవర్లకు ఇవ్వరాదని, వీటిని నడుపడానికి డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఉంటుందని.. అందువల్లనే వాటిని బయటకు తీయడంలేదని మంత్రి పేర్కొన్నారు.

> **రోడ్డెక్కిన 72 శాతం ఆర్టీసీ బస్సులు**
>
> **ఆర్టీసీ** సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సత్ఫలితాలనిస్తున్నాయి. రవాణా, ఆర్టీసీ, రెవెన్యూ, పోలీసు విభాగాల సమన్వయంతో ప్రయాణికులకు నాణ్యమైన రవాణాసేవలు అందుతున్నాయి. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 72 శాతం ఆర్టీసీ బస్సులు సేవలందించినట్లు ఆర్టీసీ యంత్రాంగం వెల్లడించింది.. మొత్తం 6,437 బస్సుల్లో 4,502 ఆర్టీసీ బస్సులు, 1,935 అద్దె బస్సులు ఉన్నట్లు తెలిపారు. 4,502 ప్రైవేటు డ్రైవర్లు, 6,437 మంది ప్రైవేటు కండక్టర్లు విధులు నిర్వహించినట్లు పేర్కొన్నది. బస్సుల్లో టికెట్లు ఇవ్వటం ప్రారంభించినట్లు, టిమ్స్ ద్వారా అన్ని బస్సుల్లో టికెట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. తాత్కాలిక ఉద్యోగుల సహాయంతో ఆర్టీసీ సేవలు యథాతథంగా కొనసాగుతున్నాయని ప్రకటించింది. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో బస్సుసేవలు అందించేందుకు పూర్తి ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపింది.

### సాధారణస్థాయికి ప్రజారవాణా

రాష్ట్రంలో సగటున 70 శాతం ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నాయని, సోమవారం నుంచి 95 శాతం పైగా బస్సులు తిరిగేవిధంగా చూడాలని డిపోలకు రవాణామంత్రి ఆదేశాలిచ్చారు. సోమవారం ఉదయం నుంచి అన్ని డిపోల్లో తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లు రిపోర్ట్‌చేయాలని, ఆలస్యంచేయకుండా, సమయపాలన ప్రకారం బస్సులను గమ్యస్థానాలకు చేర్చాలని రవాణాశాఖ ఆదేశించింది. ప్రతి డిపోకు నియమించిన నోడల్ అధికారుల బృందం ఉదయం నాలుగు గంటల నుంచి టైంటేబుల్‌ను పర్యవేక్షించాలని సూచించింది. నోడల్ అధికారులకు సహాయంగా ఐదుగురు అధికారుల బృందాన్ని డిపోల్లో ఏర్పాటుచేసినట్లు రవాణాశాఖ వెల్లడించింది. అత్యవసర సేవల నిమిత్తం ప్రతి డిపోలో అదనంగా 20 మంది డ్రైవర్లు, కండక్టర్లను అందుబాటులో ఉంచుతున్నారు. మరోవైపు ప్రైవేట్ ట్రావెల్ బస్సులు, వివిధ సంస్థలకు చెందిన బస్సులకు కూడా సోమవారం నుంచి రూట్లను ఖరారు చేస్తున్నారు. ప్రైవేట్ బస్సులకు కేటాయించిన రూట్ల వివరాలను ఆర్టీవో కార్యాలయాల్లో షెడ్యూలులో ఉంచుతున్నారు. ఇప్పటికే డిపోల్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంలు యథాతథంగా కొనసాగుతాయి.

### కఠినంగా టికెట్ల విధానం అమలు

సోమవారం ఉదయం నుంచి ప్రతి ఆర్టీసీ బస్సు, అద్దె బస్సుల్లో టికెట్లు కచ్చితంగా ఇవ్వనున్నారు. తాత్కాలిక కండక్టర్లకు టికెట్ జారీ యంత్రాలను అప్పగించారు. నిర్దేశిత ధరల కంటే ఒక్క రూపాయి అదనంగా తీసుకొన్నా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎవరైనా టికెట్ చార్జీల కంటే అదనంగా వసూలుచేస్తే ఫిర్యాదు చేయడానికి డ్రైవర్‌సీటు వెనుకవైపు ఫోన్ నంబర్లు ప్రకటించారు. వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వోద్యోగులకు కూడా కండక్టర్లుగా బాధ్యతలను అప్పగించారు. ప్రభుత్వోద్యోగులైతే టికెట్లు ఇవ్వడం, పాస్‌లను అనుమతించడం కచ్చితంగా చేస్తారని భావిస్తున్నారు.

### శ్రామికులుగా ఐటీఐ విద్యార్థులు

ఐటీఐ విద్యార్థులకు శ్రామికులుగా అవకాశం కల్పించాలని రవాణాశాఖ భావిస్తున్నది. మూడురోజులకొకసారి బస్సుల చెకింగ్, ఓవరాలింగ్ వంటి పనులను శ్రామికులు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఐటీఐ విద్యార్థులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలని నిర్ణయించారు. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని డిపోల్లో ఆర్టీసీ బస్సులను నడిపించేందుకు రవాణా అధికారులు నిర్ణయం తీసుకొన్నారు. ఇక్కడ పనిచేస్తున్న తాత్కాలిక డ్రైవర్ల వేతనాలను రూ.250 పెంచాలని యోచిస్తున్నారు. ప్రస్తుతం డ్రైవర్‌కు రూ.1500 చెల్లిస్తుండగా పెంపుదలపై సోమవారం నిర్ణయం తీసుకొంటారు.

## కిడ్నాప్‌ను అడ్డుకున్న ట్రాఫిక్ జామ్

- ఏడు నిమిషాల్లోనే బాధితుడిని కాపాడిన పోలీసులు
- ఢిల్లీలో ఆసక్తికర ఘటన




దుండగులు ఉపయోగించిన కారు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** ట్రాఫిక్ జామ్ వల్ల ప్రయాణికులు పడే ఇబ్బందుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే ట్రాఫిక్ జామ్ కారణంగా ఓ కిడ్నాప్ కేసు కేవలం ఏడు నిమిషాల్లోనే సుఖాంతమైన ఘటన ఢిల్లీలోని ఉత్తమ్‌నగర్‌లో జరిగింది. ఉత్తమ్‌నగర్‌లో ఓ ముఠా.. రిజ్వాల్ అనే 21 ఏండ్ల యువకున్ని కిడ్నాప్ చేసింది. శుక్రవారం అర్ధరాత్రి వేళ తన పని ముగించుకొని కారులో ఇంటికి వెళుతున్న రిజ్వాల్‌ను నలుగురు వ్యక్తులు ఆటోలో వెంబడించి అతన్ని అడ్డుకున్నారు. కారు నుంచి రిజ్వాల్‌ను బలవంతంగా కిందకు దింపి అతని వద్ద నుంచి కారు తాళపు చెవిని లాక్కొని, అదే కారులో బంధించి ద్వారక వైపు వెళ్లారు. అయితే తన సోదరుడిని నలుగురు వ్యక్తులు అపహరించారని రిజ్వాల్ సోదరుడు పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. రిజ్వాల్ కారు విండ్ షీల్డ్‌పై 'హై ల్యాండర్' అని రాసి ఉంటుందని గుర్తులు చెప్పాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆ వివరాల ఆధారంగా ఉత్తమ్‌నగర్ సమీపంలో ప్రయాణిస్తున్న రిజ్వాల్ కారును వెంబడించారు. అయితే కారు నజఫ్‌గఢ్ వెళ్లే క్రమంలో భారీ ట్రాఫిక్ ఉండడంతో అక్కడే ఆగిపోయింది. తమను పోలీసులు వెంబడిస్తున్నారన్న విషయాన్ని గ్రహించిన ఆ ముఠా కారు నుంచి దిగి పారిపోయేందుకు యత్నించింది. అందులో ఒకరిని పోలీసులు పట్టుకొని, అరెస్ట్ చేసి రిజ్వాన్‌ను కేవలం ఏడు నిమిషాల్లోనే కాపాడారు. తప్పించుకున్న మిగతా దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

**లోకం పోకడ**




వీడికి కల్తీపాలు గాని పోశావా? మమ్మీ, మమ్మీ అంటూ నా వెంట పడుతున్నాడు!

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దన్ను

- నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ ఆలోచనలను ప్రతిబింబించేలా సీఎం కేసీఆర్ కార్యాచరణ
- కళకళలాడుతున్న గ్రామసీమలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'ప్రజల చేతుల్లోకి డబ్బు చేరేలా ప్రభుత్వాలు క్రియాశీలక కార్యక్రమాలు నిర్వహించాలి. అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది' అని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత అభిజిత్ బెనర్జీ సూచించారు. సరిగ్గా ఆయన ఆలోచనలకు దగ్గరగా సీఎం కే చంద్రశేఖర్‌రావు కార్యాచరణ ఉన్నది. తెలంగాణలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ గత ఐదేండ్లలో అనేక వినూత్న కార్యక్రమాలను ప్రారంభించి విజయవంతంగా అమలుచేస్తున్నారు. ఫలితంగా నేడు ప్రజల కొనుగోలుశక్తి పెరిగి గ్రామీణ ఆర్థికవ్యవస్థ కళకళలాడుతున్నది. ముఖ్యంగా 'మిషన్ కాకతీయ' ద్వారా చెరువుల పూడికతీతతో వ్యవసాయం పెరుగడంతోపాటు అనుబంధ రంగాలు, చేతివృత్తులు, కులవృత్తులకు పునరుజ్జీవం వచ్చింది. మత్స్యకారుల కోసం చెరువులు, రిజర్వాయర్లలో చేపల పెంపకం.. యాదవులకు గొర్రెల పంపిణీ, రైతులకు 'రైతుబంధు' కింద ఎకరానికి రూ.10 వేల చొప్పున పెట్టుబడి.. వృద్ధులకు నెలనెలా రూ.2 వేలు, వికలాంగులకు రూ.3 వేల చొప్పున ఆసరా పింఛన్లు తదితర రూపాల్లో గ్రామీణ పేద ప్రజలకు ఏటా రూ.50 వేల నగదు సాయం అందుతున్నది. దీనివల్ల ప్రజల కొనుగోలుశక్తి పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఉన్నత స్థాయిలో కొనసాగుతున్నదని నిపుణులు చెప్తున్నారు.

### సత్ఫలితాలివ్వని కేంద్ర పథకాలు

ఇదే సమయంలో గ్రామీణ ఆర్థికవ్యవస్థను మెరుగుపరిచేందుకు కేంద్రం చేసిన పెట్టుబడులు ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడంలేదు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంఎన్ఆర్ఈజీఎస్) పథకానికి కేంద్రం ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య రూ.48,397 కోట్లు విడుదల చేసింది. కానీ లబ్ధిదారులకు ఆ సొమ్ము సకాలంలో అందలేదు. ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద విడుదలచేసిన రూ.15,600 కోట్లు కూడా పంట సీజన్ సమయానికి రైతులకు అందలేదు. దీంతో విత్తనాలు, ఎరువులు, పంట పెట్టుబడికి వినియోగించాల్సిన ఆ సొమ్మును రైతులు ఇతర వస్తువుల కొనుగోలుకు వినియోగించినట్టు కొన్ని రాష్ట్రాల్లో జరిగిన అధ్యయనంలో తేలింది.



## ఛత్తీస్‌గఢ్‌లో 28 మంది మావోల లొంగుబాటు

**కొత్తగూడెం క్రైం:** ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో ఆదివారం పెద్దసంఖ్యలో మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. ఇందుకు సంబంధించి ఆదివారం దంతేవాడ జిల్లా ఎస్పీ అభిషేక్ పల్లవ్ మీడియాకు వివరాలను వెల్లడించారు. దంతేవాడ జిల్లాలోని కటేకళ్యాణ్ ఏరియా కమిటీ సభ్యుడు, పెదురాస్ ఎల్ఓఎస్ కమాండర్ హద్మ మాండవి అలియాస్ హరిరామ్ అలియాస్ మిడ్కోమ్ అలియాస్ రాజు చిక్పాల్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. హద్మతో పాటు మరో 27 మంది కమిటీ సభ్యులు సైతం లొంగిపోయినట్లు ఆయన పేర్కొన్నారు. వీరిలో నలుగురిపై రివార్డులు ఉన్నట్లు తెలిపారు. మావోయిస్టులు వీరిని ఆదర్శంగా తీసుకుని జనజీవన స్రవంతిలో కలువాలని ఆయన పిలుపునిచ్చారు.



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీప్రాంతంలోని తెలంగాణ నయాగర బొగత జలపాతం వద్ద ఆదివారం సందడి కన్పించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు స్విమ్మింగ్ పూల్‌లో స్నానాలు చేస్తూ.. సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. వాచ్ టవర్ ఎక్కి జలపాతం అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు.

- వాజేడు



యాదాద్రి కొండపైన స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

## యాదాద్రిలో భక్తుల కోలాహలం

- శ్రీవారి ఖజానాకు రూ. 16,01,866 ఆదాయం

**యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పంచనారసింహుడు కొలువుదీరిన యాదాద్రి భక్తజనులతో పులకించింది. వరుస సెలవులు రావడంతో భక్తులతో యాదాద్రి పోటెత్తింది. కుటుంబంతో కలిసి వచ్చిన భక్తులు నారసింహుడిని దర్శించాలని గంటల కొద్దీ క్యూ కట్టారు. యాదాద్రి ఆలయంలో అత్యంత ప్రీతికరంగా జరుపుకునే శ్రీ సత్యనారాయణస్వామివారి వ్రతంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. సామూహిక వ్రతాలు పెద్దఎత్తున జరిగాయి. వ్రత పూజల ద్వారా రూ. 62వేల ఆదాయం సమకూరింది. శ్రీసత్యనారాయణుడిని ఆరాధిస్తూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఏపీవిద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మస్తానయ్య యాదాద్రిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి ఖజానాకు రూ.16,01,866 ఆదాయం సమకూరింది.



# తొలివిడుతగా 23 పారిశ్రామిక పార్కులు

- జిల్లాల్లో 16,520 ఎకరాలను సేకరించిన టీఎస్ఐఐసీ
- ఇప్పటికే రూ. 1,800 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పారిశ్రామిక పార్కులను కేవలం హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకే పరిమితం చేయకుండా మధ్య, చిన్నతరహా పరిశ్రమలకు అనువైనవిధంగా ఉండేలా జిల్లాల్లోనూ వాటిని ఏర్పాటుచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. ఇందుకు అవసరమైన భూములను సేకరించి వాటిని అభివృద్ధి చేసేందుకు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) కృషిచేస్తున్నది. టీఎస్ఐపాస్ ద్వారా రాష్ర్టానికి భారీసంఖ్యలో పరిశ్రమలు వస్తున్నాయి. వీటితోపాటుగా ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు కొత్త యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాయి. టీఎస్ఐఐసీ ఏర్పాటైన నాటినుంచి ఇప్పటివరకు దాదాపు 16,520 ఎకరాలను (9,364 ఎకరాలు పట్టా భూములు, 7,155 ఎకరాల ప్రభుత్వ భూములు) సేకరించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కండ్లకల్‌లో 41ఎకరాలు, యాచారం మండలంలో 7,568 ఎకరాలు, ఇబ్రహీంపట్నంలో 35 ఎకరాలు, షాబాద్ మండలం చందన్‌వెల్లిలో 945 ఎకరాలు, సిద్దిపేట జిల్లా బండమైలారంలో 152 ఎకరాలు, బండతిమ్మారంలో 127 ఎకరాలు, నంగునూరు మండలం ముంద్రాయిలో 137 ఎకరాలు, మిట్టాయిపల్లిలో 30 ఎకరాలు, రాజగోపాల్‌పేటలో 34 ఎకరాలు, మందన్‌పల్లిలో 100 ఎకరాలు, రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరులో 100 ఎకరాలు, సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం ముంగి, ఝరాసంఘం మండలం బర్దిపూర్ గ్రామాల్లో 2,900 ఎకరాలు, జిన్నారం మండలం శివనగర్‌లో 100 ఎకరాలను సేకరించారు. వీటిలో 59 పారిశ్రామిక పార్కులను ఏర్పాటుచేయాలని, 23 పార్కులకు తొలి ప్రాధాన్యమిచ్చి పనులు చేయాలని నిర్ణయించి.. మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇప్పటికే రూ.1,800 కోట్లకుపైగా వెచ్చించారు. రాబోయే రోజుల్లో ఇంకా పెద్దఎత్తున నిధులను వెచ్చించేందుకు ప్రణాళికలను సిద్ధంచేశారు.

### జనరల్ పార్కులపైనా దృష్టి

ఒక్కో రంగానికి ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కులను ఏర్పాటుచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. జనరల్ పార్కులను కూడా నెలకొల్పుతున్నది. సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో 200 ఎకరాలు, ఇంద్రకరణ్‌లో 170 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 373 ఎకరాలు, రాకంచర్లలో 150 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 50 ఎకరాలు, రావిర్యాలలో 95 ఎకరాల్లో జనరల్ ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటుచేయనున్నారు. వీటితోపాటు జనగామ జిల్లా కళ్లెం, నల్లగొండ జిల్లా చిట్యాల, వనపర్తి జిల్లా వెలిగొండ, కామారెడ్డి జిల్లా జంగంపల్లి, సిద్దిపేట జిల్లా బెజ్జంకి, దుద్దెడ, నర్మెట్ట, మందపల్లి, తునికి బొల్లారం, మంచిర్యాల జిల్లా నెన్నెల్, సిరిసిల్ల జిల్లా నర్మాల, పెద్దూరు, జిల్లెల, జగిత్యాల జిల్లా స్తంభంపల్లి, గద్వాల, సూర్యాపేట, మెదక్ జిల్లా వడియారం, మనోహరాబాద్, పెద్దపల్లి జిల్లా అంతర్గాం, రంగారెడ్డి జిల్లా చందన్‌వెల్లి, ఇబ్రహీంపట్నం, మొండిగౌరెల్లి, కొత్తపల్లి, నాగిరెడ్డిపల్లి, మేడ్చల్ జిల్లా మాదారం, బౌరంపేట్, దుండిగల్, యాదాద్రి జిల్లా రాయరావుపేటలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయనున్నారు.

# పంటల కొనుగోళ్లు ప్రారంభం

- వరి ధాన్యం కొనుగోలుకు 2,584 కేంద్రాలు
- పెసర్లకు 14, సోయాబీన్‌కు 7 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వానకాలం సీజన్‌లో పండించిన వివిధ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సర్వం సిద్ధం చేశాయి. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురియడంతో వానకాలం సీజన్లో ప్రధానంగా వరి, పత్తి, మక్కజొన్న, సోయాబీన్, కందులు, పెసర్లు, మినుములు పెద్ద ఎత్తున మార్కెట్‌కు రానున్నాయి. దీనిని ముందుగానే అంచనావేసిన వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖలు వ్యవసాయ ఉత్పత్తులన్నింటినీ మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాయి. పంటలకు మద్దతు ధర పొందేలా తీసుకోవాల్సిన చర్యలపై మార్కెటింగ్‌శాఖ అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో రైతులు పెద్ద ఎత్తున ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తమ వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొస్తున్నారు. పండిన ప్రతి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోళ్లను పౌరసరఫరాలశాఖ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 2,584 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసింది. అవసరం మేరకు ఈ కేంద్రాలను పెంచేలా చర్యలు తీసుకొంటామని అధికారులు చెప్తున్నారు.

### జోరుగా పెసర్లు, సోయాబీన్ కొనుగోళ్లు

ప్రభుత్వం ఏర్పాటుచేసిన మద్దతు ధర కొనుగోలు కేంద్రాల్లో పెసర్లు, సోయాబీన్ కొనుగోళ్లు వారంరోజులుగా జోరుగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పెసర్లకు క్వింటాల్‌కు రూ.7050, సోయాబీన్ రూ.3,710 మద్దతు ధరగా నిర్ణయించింది. పెసర్లు 10,378 టన్నులు, సోయాబీన్ 58,608 టన్నులు మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు అనుమతిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పెసర్ల కొనుగోలుకు 14, సోయాబీన్ కొనుగోలుకు 7 కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు 5,160 మంది రైతుల నుంచి రూ.33.63 కోట్ల విలువైన 4,769 మెట్రిక్ టన్నుల పెసర్లు, 69 మంది రైతుల నుంచి రూ.0.42 కోట్ల విలువైన 113 మెట్రిక్ టన్నుల సోయాబీన్ కొనుగోలు జరిగినట్టు మార్కెటింగ్ అధికారులు వెల్లడించారు.



బాన్సువాడ మండలం కొల్లూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

## రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**బాన్సువాడ రూరల్:** రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కొల్లూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. రైతులకు సరిపడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడంతో దళారుల జాడ కనుమరుగైందన్నారు. ప్రభుత్వం ఒక్క కామారెడ్డి జిల్లాలోనే 223 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు పూర్వవైభవం కల్పించేందుకు కాళేశ్వరం నీటిని తెస్తున్నామన్నారు. రూ. 100 కోట్లతో జాకోరా, చందూర్ ఎత్తిపోతలకు అనుమతులు మంజూరయ్యాయని పోచారం వెల్లడించారు. తన స్వగ్రామం పోచారంలో నిర్వహించిన బోనాల పండుగలో పాల్గొని స్పీకర్ బోనం ఎత్తుకొన్నారు.






# ప్రతి పంటకూ మద్దతు ధర

- పొరుగు రాష్ట్రాల ధాన్యంపై నిఘా
- మద్దతు ధరల వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని రైతులు పండించిన ప్రతి పంటకూ మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. అదేసమయంలో రైతులు నాణ్యమైన సరుకును మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లో మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి నిరంజన్‌రెడ్డి మద్దతు ధరల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోని మార్కెట్లకు రాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటుచేస్తున్నట్టు ఆయన చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రతినిధులు, మిల్లర్లు తక్కువ తూకాలు వేయడం వంటివి చేయొద్దని, అక్రమాలు జరిగినట్టు తెలితే కేంద్రాన్ని రద్దుచేసి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. ధాన్యం తేమశాతంలో మార్పునకు అవకాశం ఉన్నందున.. మిల్లర్లు, ఐకేపీ బృందాలు ముందే పరిశీలించి, దశలవారీగా ధాన్యం సేకరణ చేపట్టాలని ఆయన సూచించారు.



వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులతో కలిసి మద్దతు ధరల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

### కొనుగోలు కేంద్రాల్లో వివిధ పంటల మద్దతు ధరలు

| పంట | మద్దతు ధర (క్వింటాల్‌కు) |
|---|---|
| వరి గ్రేడ్1 | రూ.1,835 |
| గ్రేడ్ 2 | రూ.1,815 |
| పెసర్లు | రూ.7,050 |
| సోయాబీన్ | రూ.3,710 |
| జొన్నలు | రూ.2,550 |
| సజ్జలు | రూ.2,000 |
| మినుములు | రూ.5,700 |
| వేరుశనగ | రూ.5,090 |
| పత్తి మీడియం | రూ.5,255 |
| పత్తి పెద్ద పింజ | రూ.5,550 |

# కేసీఆర్ కిట్లకు 40 నెలలు

- రూ.750 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
- సర్కారు దవాఖానాల్లో పెరిగిన ప్రసవాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమాజానికి ఆరోగ్యవంతమైన నవజాత శిశువులను అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న కేసీఆర్ కిట్ల పథకాన్ని ప్రారంభించి 40 నెలల 15 రోజులు పూర్తయింది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. 2017 జూన్ 3న కేసీఆర్ కిట్ల పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఈ నెల 18 (శుక్రవారం) వరకు 5,65,106 మంది బాలింతలకు కేసీఆర్ కిట్లను అందజేశారు. ఈ పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.750 కోట్లు ఖర్చుచేసింది. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకునేందుకు ఆర్థిక సాయంతోపాటు కేసీఆర్‌కిట్లను అందజేసేందుకు ఈ సొమ్మును వెచ్చించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బాలింతలకు సీఎం కేసీఆర్ 16 వస్తువులతో కూడిన కిట్లను అందజేస్తున్నారు. పలు రాష్ట్రాల ప్రతినిధులు ఈ పథకం అమలుతీరును పరిశీలించి తెలంగాణ ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ పథకం ప్రారంభానికి ముందుగా ప్రభుత్వ దవాఖానల్లో 25 శాతంగా ఉన్న ప్రసవాలు.. కేసీఆర్ కిట్ల పథకం అమలుతో 62 శాతానికి పెరిగాయి. రాష్ట్రంలో మాతా, శిశు మరణాలను నియంత్రించడమే లక్ష్యంగా అమలుచేస్తున్న కేసీఆర్ కిట్ల పథకంతో ఎంతో మంది పేద మహిళలకు లబ్ధి చేకూరింది.



### గత 40 నెలల్లో కేసీఆర్ కిట్ల పథకం అమలు తీరుతెన్నులు

| | 2017-18 | 2018-19 | 2019-20 | మొత్తం |
|---|---|---|---|---|
| గర్భిణుల ఆన్‌లైన్ నమోదు | 5,82,106 | 6,13,469 | 3,58,575 | 15,54,150 |
| అర్హులైన లబ్ధిదారులు | 4,07,474 | 4,60,102 | 2,51,003 | 11,18,579 |
| ప్రసవాలు | 4,38,731 | 4,74,693 | 2,69,197 | 11,82,621 |
| కేసీఆర్ కిట్లు అందుకున్నవారు | 2,02,183 | 2,42,275 | 1,20,648 | 5,65,106 |
| మూడున్నరనెలల ఇమ్యునైజేషన్ | 3,79,872 | 4,68,077 | 2,42,444 | 10,90,393 |
| 9 నెలల ఇమ్యునైజేషన్ | 2,03,932 | 4,53,419 | 2,47,708 | 9,05,059 |

### పిల్లల ఆరోగ్యంపై దృష్టి

చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వైద్యారోగ్య శాఖ రాష్ట్రవ్యాప్తంగా రెండున్నరేండ్లలోనే 28 ఎస్సెన్సీయూలు (సిక్ న్యూబోర్న్ కేర్ యూనిట్లు), 61ఎన్‌బీఎస్‌యూలు, 562 ఎన్‌బీసీసీలను ఏర్పాటుచేసింది. ఎస్సెన్సీయూల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఎఫ్‌బీఎన్సీ శిక్షణ అందించి దవాఖానల్లో చిన్నారులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్యం అందేలా వసతులు కల్పించారు. మాతా, శిశు సంరక్షణ కోసం ప్రభుత్వ దవాఖానల్లో అధునాతన సౌకర్యాలు కల్పించి కార్పొరేట్ తరహా వైద్యాన్ని అందిస్తున్నారు. నవజాత శిశువుల సంరక్షణకోసం అన్ని జిల్లా దవాఖానల్లో ప్రత్యేక యూనిట్లను ఏర్పాటు చేశారు.

# లక్ష్యం చేరుకున్న కాళేశ్వరం

- రోజుకు రెండు టీఎంసీల ఎత్తిపోతలకు మోటర్లు సిద్ధం
- నెలాఖరుకు రెండు లింక్‌ల మోటర్లు సిద్ధం
- కొండపోచమ్మకు తరలింపుపై దృష్టి
- 'ఎస్సారెస్పీ పునర్జీవం'లోనూ సిద్ధమైన రెండు పంప్‌హౌస్‌లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నది. రోజుకు రెండు టీఎంసీల గోదావరి జలాల ఎత్తిపోతలకు రెండు లింక్‌లు సన్నద్ధమయ్యాయి. లింక్-1, 2ల్లో రెండు మోటర్ల ట్రయల్‌రన్ ఈ నెలాఖరుకు పూర్తిచేయనుండటంతో ఇక లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్ నుంచి శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) జలాశయం వరకు రెండు టీఎంసీల నీటిని తరలించేందుకు మార్గం సుగమమైంది. ఈ నేపథ్యంలో కొండపోచమ్మ వరకు జలాలను తరలించడంపై అధికారులు దృష్టి సారించారు. మరోవైపు ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో భాగంగా రోజుకు 0.65 టీఎంసీల నీటిని ఎత్తిపోయడానికి రెండు పంప్‌హౌస్‌లు సిద్ధమయ్యాయి. ఈ ఏడాది జూన్ 21న సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టులోని లింక్ 1, 2 వ్యవస్థలు సిద్ధమవటం కీలక పరిణామం. ఒక్కో పంప్‌హౌస్‌లో అంచెలంచెలుగా మోటర్లు అమర్చుతూ, డ్రైరన్, వెట్‌రన్‌లను నిర్వహించి వినియోగంలోకి తెచ్చారు. ప్రస్తుతం లక్ష్మీ బరాజ్ ఫోర్‌షోర్‌నుంచి రోజుకు రెండు టీఎంసీలను ఎత్తిపోసేందుకుగాను లక్ష్మీ (కన్నెపల్లి) పంప్‌హౌస్‌లో 40 మెగావాట్ల సామర్థ్యంతో 11 మోటర్ల బిగింపు, ట్రయల్‌రన్ పూర్తయింది. తర్వాతి దశలో సరస్వతి (అన్నారం) బరాజ్ ఫోర్‌షోర్‌నుంచి సరస్వతి పంప్‌హౌస్ ద్వారా నీళ్లు ఎత్తిపోసే వ్యవస్థ కూడా అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ 40 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేసే 8 మోటర్లను బిగించారు. ఆ తర్వాత పార్వతి (సుందిల్ల) బరాజ్ నుంచి పార్వతి పంప్‌హౌస్ ద్వారా జలాల ఎత్తిపోత కోసం 40 మెగావాట్ల సామర్థ్యం ఉన్న 9 మోటర్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. దీంతో లింక్-1లో లక్ష్మీ పంప్‌హౌస్ నుంచి ఎల్లంపల్లి జలాశయం వరకు 2 టీఎంసీల లిఫ్టుకు మార్గం సుగమమైంది. మూడో టీఎంసీ తరలింపునకు సంబంధించిన సివిల్ పనులు పూర్తయినప్పటికీ.. ఎలక్ట్రోమెకానికల్ పనులు చేపట్టాల్సి ఉన్నది.



### నెలాఖరుకు అన్ని మోటర్లు సిద్ధం

ఎల్లంపల్లి జలాశయం తర్వాత గోదావరి జలాలను నంది (మేడారం) రిజర్వాయర్.. అటు తర్వాత నంది పంప్‌హౌస్‌లోని మోటర్ల ద్వారా ప్యాకేజీ-7 మీదుగా గాయత్రి (రామడుగు) పంప్‌హౌస్‌లోకి తరలించి.. అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా ఎస్సారెస్పీ వరదకాల్వలో పోస్తారు. తద్వారా జలాలు శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) జలాశయానికి చేరుకుంటాయి. రోజుకు ఒక టీఎంసీ వరకు నీటిని ఎత్తిపోశారు. రోజుకు రెండు టీఎంసీల నీటి తరలింపునకు అన్ని మోటర్లు సిద్ధం కావలసి ఉన్నది. ఈ నేపథ్యంలో నంది పంప్‌హౌస్‌లో 124.4 మెగావాట్ల సామర్థ్యంతో బిగించాల్సిన ఏడు మోటర్లలో ఆరు అందుబాటులోకి రాగా.. మరో మోటరు ఈ నెలాఖరుకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు సన్నాహాలుచేస్తున్నారు. గాయత్రి పంప్‌హౌస్‌లో సైతం 139 మెగావాట్ల సామర్థ్యంతో నడిచే బాహుబలి మోటర్లు ఏడింటిలో ఆరు ఇప్పటికే నడుస్తున్నాయి. మరో మోటర్ ఏర్పాటు ఈ నెలాఖరుకు సిద్ధం చేస్తున్నట్టు ఎత్తిపోతల పథకాల సలహాదారు కే పెంటారెడ్డి తెలిపారు. దీంతోపాటు శ్రీరాంసాగర్ పునర్జీవ పథకంలో భాగంగా రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట పంపుహౌస్‌లలో కూడా రోజుకు 0.65 టీఎంసీల జలాల్ని ఎత్తిపోసేందుకు మోటర్లు సిద్ధంగా ఉన్నాయి.




జారీచేయువారు: కమిషనర్, సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

## సైనికుని తమ్ముడు

నిశిరాత్రి నింగి
చీకట్ల పాములు కరుస్తున్న వేళ
గుండెనిండా ధైర్యంతో
కళ్లల్లో రేడియం పూసుకొని
బయలుదేరుతాడు..!
ఖాకీ డ్రెస్సు
ఒక చేతిలో టార్చ్
మరోచేతిలో లాఠీ
పెదవుల మధ్య విజిల్
చిల్లిగవ్వలేని జేబులో
చిరుగుల దస్తీ..
నేపాలీయో బీహారీయో
ఏ తల్లి కొడుకో
ఏమి తింటాడో
ఎక్కడుంటాడో
చిరునామా లేని వ్యక్తి
అతడు గూర్ఖా!
తోడునీడ వీడని మిత్రుడు
బతుకుపోరులో క్షతగాత్రుడు
మనసు తెరమీద
ఊరిపటం గీసుకొని
బయలుదేరుతాడు
కోరలు నూరే పిచ్చికుక్కలను
గజదొంగల గ్యాంగులను
ఈ ఏకాకి
ఎదురుకుంటాడు ముఖాముఖి!
చలిలో వానలో తుఫానుగాలిలో
గుర్ఖా ఉన్నాడులే అంటూ
గురకకొట్టే ఇళ్ళ యజమానులు
పైసా విదిల్చరు
ఆకలి కడుపుతో
భద్రతనిచ్చే అపరపోలీసు
సరిహద్దులను కాపాడే
సైనికుని తమ్ముడు..
అయినా
చీకటి పలకమీద
రెండు బొగ్గు అక్షరాలు
అతడే గూర్ఖా...

– డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్
94410 54637



వ్యక్తిని ఒక నవల ఎంత గాఢంగా, ఎంతమేరకు ప్రభావితం చేయవచ్చును? ఒకసారి చదివిన తర్వాత మరోసారి చదివేంతగా.. లేదంటే మరో రెండు మూడుసార్లు చదివేంతగా.. లేదంటే ఆ నవల గురించి అద్భుతమైన రివ్యూ రాసి దీనికి ప్రాచుర్యం కలిగించేంతగా.. లేదంటే ఆ నవల పేరునే ఆ రచయిత ఇంటిపేరుగా మార్చేంతగా ప్రభావితం చేయవచ్చు.

# దృశ్యకావ్యమైన 'అంపశయ్య'

'అంపశయ్య' నవల ఇవన్నీ సాధించింది. నవీన్ గారి ఇంటి పేరును 'అంపశయ్య'గా మార్చింది. అప్పటి నుంచి ఆయన అంపశయ్య నవీన్ అయ్యారు. ఈ నవల తెలుగు నవలా సాహిత్యంలో విశిష్టస్థానాన్ని ఆక్రమించుకున్నది. అందుకు రెండు మూడు కారణాలు కనిపిస్తాయి. ఒకటి: చైతన్య స్రవంతి శిల్పంలో అంటే కథానాయకుడి పాయింట్ ఆఫ్ వ్యూలో అతనే కథ చెప్పడం. నవల ఒకరోజు తెల్లవారు ఝామున ప్రారంభమై రాత్రికే ముగియడం. ఎందుకంటే ఈ తరహా కథనంలో రచయిత తన భావాలనే కథానాయకుడి భావాలుగా చెప్పి పాఠకుల సహానుభూతి పొందగలిగే అవకాశం ఉంటుంది. రెండు: అప్పటివరకు రాని తెలంగాణ యాసలో అత్యంత ప్రతిభావంతంగా తెలంగాణ గ్రామీణ జీవితాన్నీ, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల జీవితాల నేపథ్యంలో కథగా అల్లడం. అప్పటి కాలమాన పరిస్థితుల్లో, తెలంగాణలోని ఒక మారుమూల పల్లెలోని ఒక పేద రైతు కుటుంబం నుంచి వచ్చిన ఒక బ్రిలియంట్ విద్యార్థి యూనివర్సిటీ జీవితానికి అడ్జస్ట్ కాలేక ఏ విధంగా మానసిక క్షోభను అనుభవిస్తాడో వివరించడం కూడా ఉన్నది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పుట్టినవాళ్ళు, అప్పటికి యువకులై, ఆ సందిగ్ధ దశనే అనుభవిస్తున్న విద్యాధికులైన యువతరానికి బాగా నచ్చింది. మూడు: అంతవరకు ఉన్న సాహిత్యంలోలేని సెక్సీ భాష, సంఘటనలు, ఆధునిక సమాజంలో బతుకుతున్నామనుకున్న విద్యాధికులు కూడా మాట్లాడే బూతు మాటలు ఈ నవలలో ఉండటం మూలంగా యువతరాన్ని బాగా ఆకర్షించింది. ఇది ఒకరకంగా అప్పటివరకూ ఉన్న మిథ్యా సాహిత్యపు విలువలపైన తిరుగుబాటు నవల వంటిది.

నేను సినిమా రంగంలోకి ఒక నిర్దిష్ట ఆశయంతో మంచి సినిమాలు మాత్రమే తీయాలనే పట్టుదలతో ప్రవేశించాను. మొట్టమొద 'అమ్మా! నీకు వందనం!' అనే సినిమాతో 2013లో నా ప్రయాణం ప్రారంభించాను. ఆ సినిమా వాణిజ్యపరంగా లాభాలు సంపాదించకపోయినా సంతృప్తి కలిగించింది. గొప్ప సినిమా తీశానన్న అనుభూతి మిగిల్చింది. ఆ సినిమాకు 'భరతముని సినీ ఆర్ట్స్ అకాడెమీ' వారి 'ఉత్తమ ప్రయోగాత్మక చిత్ర దర్శకుడు' అవార్డు నాకు 2014 సంవత్సరానికి లభించింది. ఆ సినిమా అనుభవాలతో రాసిన 'నా సినిమా సెన్సార్ అయిపోయిందోచ్!' అనే నవలకు 2014 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'నంది' అవార్డు లభించింది. తర్వాత కొన్ని కమర్షియల్ అంశాలను కలిపి రామప్ప గుడిని సంరక్షించే కథాంశంతో 'ప్రణయ వీధుల్లో..' అనే సినిమా తీశాము. ఈ రెండు సినిమాలు ఆర్థికంగా నష్టాలు చవిచూడటంతో సినిమారంగం నుంచి నిష్క్రమిద్దామని అనుకున్న. ఒకసారి సినిమా దోమ కుడితే, ఆ పిచ్చి సాధారణంగా వదలదు. అందుకే, సినిమా తీయాలనే తపన నన్ను నిలువనీయలేదు. కానీ, ఎన్నో కథా చర్చలు జరిపినప్పుడు, నా నవలలనే సినిమాగా తీద్దామా అన్న ఆలోచన వచ్చింది. కానీ, అది నిలువలేదు. నవీన్ గారి పుట్టినరోజు సందర్భంగా వాగ్దేవి కాలేజీలో డిసెంబర్ 24న జరిగిన కార్యక్రమానికి నన్ను ఆహ్వానించినప్పుడు ఒక ఆలోచన మొగ్గ తొడిగింది. ఆ ఆలోచన ఫంక్షన్ రోజు నాటికి ఒక రూపం తీసుకుంది. కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, 'ఆంధ్రప్రభ'లో నా సహరచయిత నవీన్ గారి 'అంపశయ్య'ను సినిమాగా తీయవచ్చునా అనే ఆలోచన నన్ను నిలవనీయలేదు. అంత గొప్ప నవలను ఇంత వరకు ఎవరూ సినిమాగా తీసే ప్రయత్నం ఎందుకు చేయలేదని శోధించాను.

'అంపశయ్య' ఒక మనోవైజ్ఞానిక నవల. అందులో సాధారణ నవలలో లాగా సంభాషణలు, సంఘటనలు ఉండవు. నవల అంతా రవి అనే కథా నాయకుడి ఆలోచనల ద్వారానే సాగుతుంది. అటువంటి నవల నుంచి సంఘటనలు సృష్టించాలి, సంభాషణలకు స్థానం వెతకాలి. పాత్రలకు ప్రాణం పొయ్యాలంటే మామూలు విషయం కాదు. తర్వాత, ఈ సినిమాలో రొడ్డ కొట్టుడు అంశాలు అంటే ఫైట్లు, పాటలు, డ్యాన్సులు, హీరో హీరోయిన్ల మధ్యన శృంగార సన్నివేశాలు పెట్టి నవల ఫ్యాబ్రిక్‌ను చెడగొట్టలేము. కమర్షియల్‌గా విజయవంతమయ్యేది కూడా కష్టం కాబట్టి, ఈ నవలను చాలామంది ప్రముఖ దర్శకులు ముట్టుకోవడానికి కూడా భయపడ్డారు. ఈ అవరోధాలను అధిగమించవచ్చునని నాకు ధైర్యం, ఆశ కలిగింది.

2014 డిసెంబర్ 24 నాటి పుట్టిన రోజు సభలో 'అంపశయ్య' నవలను సినిమాగా తీయబోతున్నానని ప్రకటించాను. కరతాళధ్వనులు మిన్నంటాయి. కానీ చాలామంది తర్వాత నన్ను నిరుత్సాహపరిచారు. కానీ నేను వెనుతిరగలేదు. ఇదొక సాహసంగానే భావించి, 'అంపశయ్య' నవలను ఇచ్చి ఇద్దరు ముగ్గురితో స్క్రీన్ ప్లే రాయించాను. అది నవీన్ గారికి నచ్చలేదు. ఇక ఆ పనికి నేనే పూనుకున్నా. అందుకోసమని 'అంపశయ్య'ను కనీసం ఇరవై ముప్పై సార్లు చదివాను. ఒక్కో పాత్రను తీసుకుని, నవలలోని ఆ పాత్రకు సంబంధించిన ప్రతి సన్నివేశాన్ని కలిపి ఒక పుస్తకంగా బౌండ్ చేయించి అలా నాలుగైదు పాత్రలకు నాలుగైదు వేర్వేరు పుస్తకాలు తయారు చేసుకున్నా.

సినిమాలో ఆ పాత్ర నిర్వహించవలసిన అభినయాన్ని దర్శకుడు ముందే తన మనోఫలకం మీద దర్శించాలి. నటీనటుల శారీరక, మానసిక, వాచికం కలాపాన్ని కలిపి ఒక్కో పాత్రకు ఒక్కో అభినయ దృక్కోణం దర్శకులు రూపొందించుకోవలసి ఉంటుంది. అందరూ ఇలా చేస్తున్నారా అంటే చెప్పలేను. నేను మాత్రం సినిమా షూటింగు ప్రారంభానికి ముందే, ప్రీ ప్రొడక్షన్ దశలోనే వీటితో సిద్ధంగా ఉన్నాను. నా ఉద్దేశంలో, నా సినిమాలో హీరో రవి పాత్రధారి అపరాధభావనతో బాధపడుతూ ఉంటాడు. అందుకోసమని అతనికొక 'లుక్' సృష్టించాలి. అందుకే అతను కొంచెం భుజాలు వంచి, నెమ్మదిగా అడుగులు వేస్తూ, ఎదుటి వారి కళ్ళల్లోకి చూసే ధైర్యం లేనట్టుగా కింది చూపులతో మాట్లాడుతూ ఉంటాడు. ఈ పాత్ర కోసం శ్యామ్ కుమార్ అనే నటుణ్ణి ఎన్నుకున్నాము. ఎంతో అందంగా ఉండే అతన్ని రవి పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయించడానికి చాలా కష్టాలు పడ్డాము. మిగిలిన పాత్రలందరితో కలిపి ఒక వర్క్ షాప్ నిర్వహించి, వారి మనసుల్లోకి పాత్రల హావభావాలను డ్రిల్ చేశాం.



ఈ సినిమాలో అత్యద్భుత నటన ప్రదర్శించిన నటి పావని 'రతి' పాత్రలో చక్కగా ఒదిగిపోయింది. ప్రతి కోణంలోనూ, రతి పాత్రకు ప్రాణప్రతిష్ఠ చేసింది. ఇది తెలంగాణ యాసలో తీసిన తెలంగాణ సినిమా. ఈ సినిమా వెనుక గాడ్ ఫాదర్స్, సోకాల్డ్ పరిశ్రమ ప్రముఖులు లేరు. లేకపోతే పావని నటనకు ఆమెకు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు రావలిసి ఉన్నది.

ఈ సినిమాలో అత్యద్భుత నటన ప్రదర్శించిన నటి పావని 'రతి' పాత్రలో చక్కగా ఒదిగిపోయింది. ప్రతి కోణంలోనూ, రతి పాత్రకు ప్రాణ ప్రతిష్ఠ చేసింది. ఇది తెలంగాణ యాసలో తీసిన తెలంగాణ సినిమా. ఈ సినిమా వెనుక గాడ్ ఫాదర్స్, సోకాల్డ్ పరిశ్రమ ప్రముఖులు లేరు. లేకపోతే పావని నటనకు ఆమెకు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు రావలిసి ఉంది.

ముందు ప్రామిస్ చేసిన ఏ ప్రొడ్యూసరూ సినిమా తీయడానికి ముందుకు రాలేదు. మేం నిరాశలో కూరుకుపోయి ఉన్నప్పుడు కొంతమంది ఎన్నారై మిత్రులు నన్ను ఆదుకున్నారు. 'లాభాలు పెట్టిన పెట్టుబడి మొత్తం పోయినా మా మిత్రులు బాధ పడలేదు. మా సినిమాకు కలకత్తాలోని 'సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్'లో కెమెరా విద్యనభ్యసించిన రవి కుమార్ నీర్ల అద్భుతమైన పనితనాన్ని చూపించారు. సినిమా పూర్తయిన తర్వాత రమణాచారి, తనికెళ్ళ భరణి, కత్తిమహేశ్, ఆకెళ్ళ రాఘవేంద్ర, సంతోషం పత్రిక సురేశ్, చందూలాల్, అంపశయ్య నవీన్ తదితరులు చూసి ప్రశంసించారు. నవీన్ గారు.. సినిమా బాగుందనీ, నవలను చెడగొట్టలేదనీ ప్రశంసించారు.

నవలా రచయితకు పరిమితులంటూ ఉండవు. సినిమాను దృష్టిలో పెట్టుకున్నప్పుడు కొన్ని త్యాగాలు తప్పవు. కొన్ని బడ్జెట్ దృష్ట్యా, కొన్ని అసంభవాల దృష్ట్యా కొన్ని సంఘటనలను నిర్దాక్షిణ్యంగా తొలిగించవలసి ఉంటుంది. అలాగే 'అంపశయ్య' నవల ప్రారంభమే రవికి వచ్చే ఒక భయంకరమైన కలతో ప్రారంభమవుతుంది. అందు లో ఒక పెద్ద లోయలోకి తను కొట్టుకుపోతున్నట్టూ, తనతో పాటు అమ్మా, చెల్లెలూ, రతీ కొట్టుకుపోతుండగా వణికిపోతూ రవి నిద్రలో నుంచి మేల్కొంటాడు. రచయిత ఈ స్వప్న సంఘటనను సృష్టించడంలో ముఖ్యోద్దేశం, రవి ఒక ఆందోళనకు గురవుతున్నాడనీ, తన అమ్మ గురించి బాధపడుతున్నాడనీ రాబోతున్న పరీక్షల గురించీ, అటు తర్వాత ఉద్యోగం దొరుకుతుందో లేదో అనే దిగులుతో ఉన్నాడనీ, తనవల్లే రత్తి చనిపోయిందనే అపరాధ భావంతో ఉన్నాడనే సందేశాలను పాఠకులకు ఇచ్చి రవి మానసిక స్థితిని ఎస్టాబ్లిష్ చేయడమేనని నాకన్పించింది. ఆ సీను ద్వారా రచయిత చెప్పదలుచుకున్న సందేశమేమిటంటే, హీరో ఒక భయంకరమైన కల కని, వణికిపోతూ లేచాడన్నది మాత్రమే. అందుకని నేను ఆ సంఘటనను మార్చి ఒక నాలుగు రోడ్ల కూడలి మధ్యలో హీరోను నిలబెట్టి, నాలుగు వైపుల నుంచి అమ్మా, రత్తి, పరీక్షలు అంటూ అరిచే వ్యక్తి, మరొకవైపు నుంచి ఉద్యోగాలు ఉద్యోగాలు అంటూ అరుస్తున్నట్టూ, ఆ పిలుపుల గోల భరించలేక రవి ఉలిక్కిపడి లేచినట్టుగా షూట్ చేశాను. ఒక పీరియడ్ ఫిల్మ్‌గా నిర్మించాలని అప్పటి పరిస్థితులను ప్రతిబింబించే లోకేషన్ల కోసం తీవ్రంగా కష్టపడ్డాను.

అన్నీ కుదిరి సినిమా బాగా వచ్చినా, మేము భయపడట్టుగానే, మాకు థియేటర్లు దొరకనీయలేదు. విడుదలైన కొన్ని చోట్లలో సినిమా అద్భుతంగా ఉందని రివ్యూలు వచ్చాయి. 'అంపశయ్య' సినిమా తీయడమన్నది ఒక గొప్ప అందమైన అనుభవం. అది చాలా మందికి చేరలేదనే బాధ తప్ప మరే రిగ్రెట్స్ లేవు.

– డాక్టర్ ప్రభాకర్ జైనీ, 79898 25420

## చిన్ననాటి పాట

**ఆ బిడ్డ చిన్నప్పుడు**
చేతులూపుతూ నడిచేది
ఆ చిన్నకాలువే నది కావాలనుకుంది
ఆ నదే పోటెత్తే ప్రవాహం
ఆ నీటిగుంతే సముద్రం కావాలనుకుంది!

ఆ బిడ్డ చిన్నప్పుడు
అసలు తనది పసితనమనే తెలియదు,
తనకు ప్రతిదీ మనోహరమే
అన్ని ప్రాణులూ ఒకటే..

ఆ బిడ్డకి చిన్నప్పుడు
దేని గురించీ
ఓ అభిప్రాయం లేదు,
మరే అలవాట్లూ లేవు,
తలమీద లేచిఉన్న జుట్టు
ఠీవిగా కాలు మీద కాలు వేసుకునేది
ఉన్నట్టుండి గబగబా పరుగెత్తేది
ఫోటో తీసినా
ఏ భావమూ పలకని ముఖం పెట్టేది..!

ఆ బిడ్డ చిన్నప్పుడు
అన్నీ సందేహ సమయాలే
'నేను' నేనుగా ఎందుకున్నాను
నీలానో మరెలానో ఎందుకు లేను
నేను ఇక్కడే ఎందుకున్నాను
మరెక్కడో ఎందుకు లేను
అసలీ కాలం ఎప్పుడు మొదలైంది,
ఆ ఆకాశానికి చివరంచెక్కడుంటది
ఈ సూర్యుని కింద బతుకంతా మాయేనా
చూడటం వినడం వాసన పడటం అన్నీ
ఈ ప్రపంచం భ్రమలేనా..!

జనాల్నీ దైనందిన ఘటనల్నీ చూస్తే
మరో ప్రశ్న, మరో ప్రశ్న..
చెడనేది నిజంగా ఉంటదా,
ఉంటే గింటే ఆ 'చెడు' ఎవరు చేస్తరు..?
నేననే ఈ నేను ఎవరు,
రాకముందు ఈ నేను ఉనికిలో లేదు కదా
ఏదో ఒకరోజు
ఆనాటి నేను ఎవరు,
ఇకపై నేనెవరో..?
ఆ బిడ్డ చిన్నప్పుడు
అన్నమో, పప్పో, పాలకూరో
ఉడికిన కాలీఫ్లవరో
ఏదైనా బోసినోట నమల్లేక జారి
గొంతుకడ్డం పడేది
ఇప్పుడవన్నీ చక్కగా తినేస్తుంది
తినాలి కాబట్టి తినడం కాదు..

ఆ బిడ్డ చిన్నప్పుడు
అందరిలాగే తానూ
ఆ వింత శయ్యమీదే కన్ను తెరిచింది
ఇప్పుడు
అదృష్టవంతుల్లోనే కనపడే అందం
అప్పుడందరిలోనూ కనిపించేది..
అప్పుడు స్వర్గమంటే
స్పష్టమైన తియ్యటి దృశ్యం
ఇప్పుడది అంచనా మాత్రమే
అదేదీ లేదన్న ఆలోచనే
ఒక మింగుడుపడని
వణుకుపుట్టించే అంశం..

ఆ బిడ్డ చిన్నప్పుడు
ఆటంటే అమితానందం
ఈనాటికీ అదే తహతహ
మార్పంతా ఈసారి గురిమాత్రం
ఆడేతీరు మీదో దాని ఫలితం మీదో..

ఆ బిడ్డకి చిన్నప్పుడు
రుచిగా ఏ జామపండో చాక్లెట్టో కావాలి..
దోసిలి నిండా కమ్మని ద్రాక్ష పండ్లుంటేనా..
ఇప్పటికీ అంతే
తాజా పల్లిపలుకుల్ని చూస్తేనే నోరూరేది
ఇప్పటికీ అంతే..
అలా ఆ కొండ కొసకు ఎక్కాలని ఆశ
ఆపై అంతకన్నా పెద్ద కొండ కోసం
వదలని కోరిక..
అలాగే ఓ పట్టణం చూశాక
ఇంకా పెద్ద పట్టణం చుట్టాలని ఉబలాటం
ఇప్పటికీ అంతే..

ఆ చెట్టు చిటారుకొమ్మ
రేగుపండ్లు అందుకోవాలని
ఇంకా తెగని తహతహ
కానీ ఎక్కాలంటేనే
ఇతరుల ముందు ఎక్కడలేని సిగ్గు..
ఆ సిగ్గరితనమూ అలానే ఉంది
పొద్దుపొద్దున తొలి మంచు ముత్యాలను
దోసిట పట్టాలని ఎదురుచూపు
ఇప్పటికీ అది రెప్పల కిందే భద్రంగా..

ఆ బిడ్డ చిన్నప్పుడు
చెట్టుకొమ్మల మీదికి బల్లెంలా విసిరిన కర్ర
కొమ్మలకి చిక్కుకుని
ఈనాటికీ అక్కడే వేలాడుతుంది...

మూలం: పీటర్ హాండ్కే
అనువాదం: వర్ఘుల శివకుమార్

## హితైShe

**అనాదిగా అతివ జీవితమెప్పుడూ అనకొండల మధ్య సంచారమే..**
ఇంటా బయటా–రోడ్ల మీదా–పని ప్రదేశాలలో–మీడియాలో
ఆడపిల్లే బానిసకొక బానిసైన మొదటి–ఆఖరి బలి పశువు
రెక్కలు కత్తిరించి–పంజరాల్లో బంధించి
ఇనప కచ్చడాలు బిగించి స్వేచ్ఛను హరించి
కాళ్ళకి సంకెళ్లు వేసి–కళ్ళకు గంతలు కట్టించి
దేహాన్ని రవాణా చేయించి–ముఖాల్ని అమ్మేసి
ఎన్నెన్ని వంచనలు.. ఎన్ని అణిచివేతలు చూపారు
శతాబ్దాలుగా ఇదే హింస! ఇదే ఆక్రందనల పర్వం!
ఇంకానా! ఇక చాలు..!!
యుగానికో అసురుడు పుట్టిన నేల కదా!
అతని వధ కోసం ఆయుధ సృష్టి జరిగిన భూమి కదా!
ఈ కలికాలంలో మానవాసురులకు ఒక్క ఆయుధం చాలదు
త్రిశూలం–చక్రం– వజ్రాయుధం–గద
ఆగ్నేయ–పాశుపత –వరుణ–బ్రహ్మాస్త్రాలు
అన్ని కలిసిన మహాయుధం కావాలి
త్రినేత్రపు శక్తి పొందిన మహాజ్వాల కావాలి
ఆ ఆయుధశక్తే– 'షీ' టీం

ఒక్క వ్యక్తి అలజడి సమాజ ప్రశాంతతకు కొడుతోంది గండి
ఒక్క అపసవ్య ఆలోచన వందలాది గుండెలకు కలిగిస్తుంది వేదన
ఆ తలలను మొగ్గలోనే గుర్తించే hawk eye–'షీ' టీం!
అమ్మలా అలెర్ట్ చేస్తుంది! సోదరిలా వార్నింగ్ ఇస్తుంది!
గురువులా కౌన్సిలింగ్ చేస్తుంది! పెద్దలా కుటుంబానికి నివేదిస్తుంది!
సామదానభేద ఉపాయాలతో ప్రవర్తనలో పరివర్తనకు తెరలు తీస్తుంది
మితిమీరితే–శృతిమించితే కేసు, కోర్టు మెట్లు ఎక్కించి
అపసవ్యతకు అంతిమగీతం పాడుతుంది
Sheలోనే He ఉన్నాడనే సభ్యతను నేర్పి
స్త్రీ గౌరవంలోనే సమాజహితం ఉందని
వ్యక్తి చైతన్యం ద్వారానే వ్యవస్థ మార్పు సాధ్యమని
పెంపకం నుంచే ఆరోగ్య ప్రపంచం నిర్మించాలని
అవసర అవగాహనని కలిగిస్తుంది..
ఇక–మనం స్వేచ్ఛగా చూపులకు కలల్ని
ఆశలకు మెరుగుల్ని–లక్ష్యాలకు రెక్కల్ని
ఉనికికి ఆత్మగౌరవాన్ని–అస్తిత్వానికి రంగుల్ని
జీవితానికి ఆశయాల ఆకాశాన్ని అందిద్దాం..

అవును! ఇప్పుడు SHE టీం–మనందరి హితైSHE
మన ప్రగతి అభిలాSHE –మనోవికాస ప్రియాదర్SHE
నాగరిక సమాజ మహర్SHE–ప్రతి స్త్రీ – ఇప్పుడొక క్రాంతదర్SHE
Sheteam–మనకొక నిరంతర మార్గదర్SHE

– శ్రీలక్ష్మీ ఐనంపూడి, 99899 28562

# స్త్రీ మనోగతపు అక్షరాలు

**కవిత్వం** ఎవరికోసం అన్న ప్రశ్న వచ్చినప్పుడు సమాధానం వెతుక్కోవడం కష్టమే. వ్యక్తి నుంచి వ్యక్తికి అభిప్రాయం మారుతూ ఉంటుంది. స్త్రీ భావనలను అక్షరీకరించినప్పుడు ఒకలాగ, అదే ఒక పురుషుడు వ్యక్తపరిచేటప్పుడు ఇంకోలాగ ఉంటుంది. ఆడవారి ఈతిబాధలు, సమస్యలు, వారి మనోభావాలు చెప్పాల్సి వచ్చినప్పుడు సున్నితంగా ఆలోచించాల్సిందే. ఇదంతా ఎందుకంటే ఆడవారి జీవితంలో సంఘటనలకు అక్షరరూపం ఇస్తూపోతే అదే ఒకవాదంగా తయారవుతుంది. అలాంటి కొన్ని సంఘటనలను కవిత్వంగా మనముందుకు తెచ్చారు రేణుక అయోల తన **'ఎర్రమట్టి గాజులు'** కవితా సంపుటిలో. నిజానికి పుస్తకం పేరు స్త్రీ వాదాన్ని సూచించినా నిజానికి అన్ని కవితలు అదేదారి పట్టాయా అంటే కానేకాదు. తన ఎరుకలో జరిగిన అన్ని సంఘటనలు వస్తువులు స్త్రీ వాదం వైపు ఉన్నా కూడా, ఎక్కువగా అటు పోలేదు. మిగతావి కూడా ఆలోచింపజేస్తాయి.

సొంత మనుషులను కోల్పోయినప్పుడు అంత శూన్యమే గోచరిస్తుంది. అలాంటిది నిన్నటిదాకా మనతో ఉన్న తండ్రి దిగంతాల్లో కలిసిపోతే, ఒక నిశ్శబ్దం భయపెడుతుంది. ఇదిగో ఇలాగే.. **'ఇల్లు ఖాళీ లేదు/ఓ చీకటి గుహ దేహంలోకి ప్రవేశినట్టు ఉంది..'** అంటే ఎంత బాధకు గురై ఉంటుంది. ఇంకోచోట గుర్తుచేసుకుంటుంది.. **'నిన్నటివరకు నీది నాది ఒక పేగుబంధం/ ఇప్పుడది ఎముకలు/బూడిద అనుకుంటే/దుఃఖం గొంతులోనే ఉంది..'** నాన్నను పోగొట్టుకొని ఏడ్చిన క్షణాలవి.

సాధారణంగా పనిచేసే మహిళలు హ్యాండ్‌బ్యాగ్‌ను తమతో పాటుగా తీసుకెళ్తారు. అందులో లంచ్‌బాక్స్ మాత్రమే ఉందని అనుకుంటాం కానీ ఒక ప్రపంచమే ఉంటుందని తెలుసుకుంటాం. జీవితంలో జరిగిన ప్రతి అనుభవానికి నీలిరంగు హ్యాండ్ బ్యాగ్ సాక్షి.. ఎంత అద్భుతంగా వ్యక్తీకరించారో.. **'పాత నీలిరంగు హ్యాండ్‌బ్యాగ్/అటుఇటు తిరుగుతున్నా సమయాలని సందర్భాలని ఓ దగ్గర పడేసి వెళ్ళాక/కాలం నాచేతిలో పునర్జీవించింది..'**. మనం సాధారణంగా పాతవి అయినవాటిని అల్మారాలో పడేస్తాం. ఎప్పుడో ఒకప్పుడు సర్దుతున్నప్పుడు సడన్‌గా కనిపిస్తుంది. దానితో పెనవేసుకున్న జ్ఞాపకాలు ముసురుతాయి. అందుకే..' **మనసుకు దగ్గరగా ఒక రహస్యం దాచుకోవడానికి చోటు దొరికింది/ఎన్నో ఊహలని దాచిపెట్టే కాలేజీ అమ్మాయిలా ఉండేది/ఇలా లైఫ్‌లో ప్రతిచోట జరిగిన దానిని రిజిస్టర్ ఛేదిస్తుంది..'** (నీలిరంగు హ్యాండ్‌బ్యాగ్). ఇలాంటి జ్ఞాపకాలు ప్రతి ఒక్కరికి ఉంటాయి. ముందుకుసాగుతున్న కొద్ది పదచిత్రాల కవిత్వం పలుకరిస్తూపోతూనే ఉంటుంది. ఏమిలేని ఒకరోజు అంటూ అనుకున్న ప్రతిసారి సూదిలో దారం కొత్తరోజును కుట్టి చూపిస్తుంది. ఉదారంగు డిసెంబరాలు జీవితం చూపులోకి విరబూస్తాయి. నిరాశను పారదోలి జీవితంపై ఆశ ఉండాలి అనుకోవడం తప్పేమి కాదు కదా..!

ఇక **'ఎర్రమట్టి గాజులు'**లో తల్లి హృదయాన్ని ఆవిష్కరించిన తీరు అద్భుతం. కూతురును చదివించి ప్రయోజనకారిని చేయాలనే తపన. అలాగే ప్రతి ఆడపిల్ల చదువుకొని తల్లికి పేరు తీసుకురావాలి. గొప్పస్థానానికి చేరుకున్నాక అమ్మని చూడాలి. అందుకే ప్రతి ఎర్రమట్టి గాజులు తపన పడుతున్నాయి బిడ్డ కోసం.

ఎంత అభివృద్ధి చెందినా కూడా ఇప్పటికి స్త్రీని ఆచారాల పేరుతో సంకెళ్లు వేస్తూనే ఉన్నారు. ఇప్పటికి కొన్ని కుల సమూహాల్లో మహిళలను నెలసరి సమయంలో మూడురోజులు ఇంట్లోకి రానివ్వరు. ఆ మూడురోజులు మూడు యుగాలుగా గడుపుతారు అమ్మాయిలు. ఎంతో బాధాకరంగా ఆ విషయాన్ని అక్షరాల్లో వర్ణించారు. **'మూడు రోజుల హింస చెంబుడు నీళ్లలో తేలింది/బహిర్ భూమి యుద్ధం కళ్ళకి కట్టింది/నెత్తుటి వాసనకి వెంటబడే గ్రామసింహాలు /మరుగు కోసం దాక్కునే శరీరం ఎంత హింసనో కదా..'** వీటిని అరికట్టలేమా అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు ఆచారాల పేరుతో హింసాత్మకత కొనసాగుతున్న తీరుకు అద్దం పడుతుంది.(ఒక సండాసు కథ).

చుట్టూ ఘోరాలు జరుగుతున్నా వార్తలు చూసినంతవరకే మనం ఆవేశపడుతాం. దేశం నాశనమయ్యిందని ఎవరు పని చేయడం లేదని వాపోతాం. కానీ అది అప్పటివరకు మాత్రమే. రోజువారి వార్తల వానల్లో మనం మునిగినప్పుడు ఎక్కడి నుంచో వచ్చేస్తుంది అక్షరాల పడవ. అందులో ప్రయాణించి చూడాల్సిందే.. పత్రికలో వచ్చే వార్తలకు మన మనోభావాలు ఎలా ఉంటాయి 'అక్షరాల పడవ'లో బాగా చెప్పారు. **'నిన్న రాత్రి వేడెక్కిన అక్షరాలు పొద్దునే వార్తాపత్రికలో చదువుతాను /టీ ఆవిరితో ఉద్రేకపడ్డాను..'** అందుకే చివరిలో అంటారు.. **'చెట్టు విదిల్చిన జల్లులో తడిచిన అక్షరాలూ/నానిపోయి నడవలేని ఆవేదనలు/కంటి చూపుకి దూరం అయ్యాయి..'**(అక్షరాల పడవ).

అసిఫా మీద రాసిన కవిత చాలా ఆలోచించదగింది. ఈ కవిత చదువుతున్నప్పుడు మనం ఇంత క్రూర సమాజంలో బతుకుతన్నామా అనిపిస్తుంది. **'హైనాల దాష్టికాల ఆనవాళ్లు /సూర్యుడి ముఖం మీద దిగంబరంగా ఛిన్నాభిన్నంగా పడి ఉన్నాయి/ చూడటానికి ఏమి లేనట్టు తెల్లటి వస్త్రాలతో పవిత్ర దేవుళ్ళ అభయ హస్తం నీడలోడెబ్బై ఏళ్ళ స్వతంత్ర భరతంలో ఇలాటివి ఇంకా జరుగుతుండటం సిగ్గుచేటు..'**(ఆసిఫా).



స్త్రీ వాద గొంతుకతో రాసినవి కొన్ని అయితే, సున్నితత్వాన్ని రంగరించి రాసినవి మరికొన్ని. ప్రతి సందర్భాన్ని మానవీయంగా ఆకట్టుకునే శైలి, పద చిత్రాలతో ఇలా ఎన్నో అంశాలు ఈ 'ఎర్రమట్టి గాజులు'లో కనిపిస్తాయి. రేణుక అయోల కవిత్వం ఎంతటి కఠిన హృదయాన్నైనా కరిగిస్తుంది. 'ఎర్రమట్టి గాజులు' చదివితే కచ్చితంగా మనలను కదిలిస్తుంది, వెంటాడుతుంది. హింసాదౌర్జన్యాలు లేని సమాజం కోసం ఆలోచింపజేస్తుంది.

ఇవి కొన్ని కవితలు మాత్రమే. స్త్రీ వాద గొంతుకతో రాసినవి కొన్ని అయితే, సున్నితత్వాన్ని రంగరించి రాసినవి మరికొన్ని. ప్రతి సందర్భాన్ని మానవీయంగా ఆకట్టుకునే శైలి, పద చిత్రాలతో ఇలా ఎన్నో అంశాలు ఈ **'ఎర్రమట్టి గాజులు'**లో కని పిస్తాయి. రేణుక అయోల కవిత్వం ఎంతటి కఠిన హృదయాన్నైనా కరిగిస్తుంది. **'ఎర్రమట్టి గాజులు'** చదివితే కచ్చితంగా మనలను కదిలిస్తుంది, వెంటాడుతుంది. హింసా దౌర్జన్యాలు లేని సమాజం కోసం ఆలోచింపజేస్తుంది. అడుగులు వేయిస్తుంది.

– పుష్యమీ సాగర్, 90103 50317

## కొత్త పుస్తకాలు

### పసిడిమువ్వలు–పారాణి



రెండువేల సంవత్సరాల నాటి తెలుగువారి సంస్కృతి, కళలు, మత, రాజకీయ విజ్ఞానం తెలిపే యత్నమే ఈ గ్రంథం. ఈ పుస్తకం భారతదేశ సంస్కృతీ వికాసాన్ని తెలుపుతుంది.

**రచన:నటరాజ రామకృష్ణ, వెల: రూ. 90,**
**ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్-4. ఫోన్: 040-29703142**

### ఏనుగు నరసింహారెడ్డి సాహిత్యాంతరంగం



కవి, రచయిత, సాహితీ విమర్శకుడు ఏనుగు నరసింహారెడ్డి ప్రాపంచిక ధోరణిని, వ్యక్తిత్వ, సాహిత్య ప్రతిఫలనాన్ని ప్రతిబించిన పుస్తకం ఇది. రచయిత కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి నిబద్ధతతో, శాస్త్రీయంగా విశ్లేషణాత్మకంగా నరసింహారెడ్డి సాధించుకున్న సాహిత్య, సామాజిక అంతస్సారాన్ని ఈ పుస్తకం మనముందు ఉంచుతుంది=.

**రచన:కొండ్రెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, వెల: రూ.100, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాద్-36. సెల్: 9848787284**


Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

## సాంకేతికతను బూచిగా చూపే యత్నాలు

- టెక్నాలజీ ఓ వారధి.. విభజనకారి కాదు
- 'బ్రిడ్జిటల్ ఇండియా' పుస్తకావిష్కరణలో ప్రధాని మోదీ



బ్రిడ్జిటల్ ఇండియా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మోదీ. చిత్రంలో రతన్‌టాటా, చంద్రశేఖరన్

**న్యూఢిల్లీ:** సాంకేతికతను బూచిగా చూపేందుకు, భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖర్, సంస్థ ప్రధాన ఆర్థికవేత్త రూపా పురుషోత్తమ్ రచించిన 'బ్రిడ్జిటల్ ఇండియా' పుస్తకాన్ని ఆదివారం మోదీ ఢిల్లీలోని తన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు వల్ల ఎదురయ్యే ప్రమాదాలు, మేధస్సులో మానవులను రోబోలు ఎప్పుడు అధిగమిస్తాయన్న వాటిపై చర్చ అనవసరమని పేర్కొన్నారు. మానవుని లక్ష్యాలు, కృత్రిమ మేధస్సు మధ్య వారధిని ఎలా నిర్మించాలనే దానిపై చర్చలు జరుగాలని సూచించారు. సాంకేతికత అనేది ఒక వారధి అని, విభజనకారి కాదు అనే విషయాన్ని అర్థం చేసుకోవాలన్నారు. సబ్‌కాసాత్, సబ్‌కావికాస్ లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు ఆకాంక్షలు-విజయాలు, డిమాండ్-డెలివరీ, ప్రభుత్వం-పరిపాలన మధ్య సాంకేతికత ఒక వారధిని నిర్మిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రతన్‌టాటా కూడా పాల్గొన్నారు.

## న్యాయం జరుగకపోతే.. కత్తులు పడ్తాం

హత్యకు గురైన కమలేశ్ తల్లి కుసుమ్ సంచలన వ్యాఖ్యలు

**లక్నో:** తమకు న్యాయం జరుగకపోతే.. కత్తులు చేపడుతామని ఉత్తర్‌ప్రదేశ్‌లో శుక్రవారం హత్యకుగురైన కమలేశ్ తివారీ తల్లి కుసుమ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడి హత్య కుట్రలో ప్రభుత్వం పాత్ర ఉన్నదని ఆరోపించారు. సీఎం యోగి తమను కలిసే వరకు కమలేశ్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించబోమని శనివారం ఆమె పట్టుబడ్డారు. ఆదివారం లక్నోలో సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను తివారీ తల్లి, భార్య, ముగ్గురు కుమారులు కలిశారు. సుమారు 30 నిమిషాలపాటు మాట్లాడారు. ఈ హత్యపై సీబీఐ విచారణ, బాధిత కుమారుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబానికి భద్రత వంటి తొమ్మిది డిమాండ్లను ప్రస్తావించినట్లు సమాచారం. భేటీ అనంతరం కమలేశ్ తల్లి సుకుమ్ మాట్లాడుతూ సీఎం యోగితో సమావేశం బలవంతంగా జరిగిందని, చర్చల పట్ల తమకు అసంతృప్తిగా ఉందన్నారు.



నిరసనలతో హాంకాంగ్ అట్టుడుకుతున్నది. ప్రముఖ వాణిజ్య పట్టణమైన త్సిమ్ షా త్సుయ్‌లోని పలు షాపింగ్ మాల్స్, హోటళ్లపై నిరసనకారులు ఆదివారం దాడులకు పాల్పడ్డారు. అడ్డుకున్న పోలీసులపై పెట్రోల్ బాంబులు విసిరారు. దీంతో నిరసనకారులపై పోలీసులు భాష్పవాయు గోళాలు, నీటి ఫిరంగులను ప్రయోగించారు.



## బ్రెగ్జిట్‌పై కొనసాగుతున్న అనిశ్చితి!

- గడువు పెంచాలని కోరుతూ సంతకం చేయకుండా ఈయూకు లేఖను పంపిన బ్రిటన్ ప్రధాని
- మండిపడిన ప్రతిపక్షం




**లండన్:** ఐరోపా యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలిగే ప్రక్రియ అయిన 'బ్రెగ్జిట్'పై అనిశ్చితి కొనసాగుతున్నది. బ్రెగ్జిట్ గడువును అక్టోబర్ 31 నుంచి మరో మూడు నెలలు పొడిగించాలని కోరుతూ బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్.. సంతకం చేయని ఒక లేఖను ఈయూకు పంపారు. నూతన బ్రెగ్జిట్ ఒప్పందంపై శనివారం నిర్వహించిన చారిత్రక పార్లమెంట్ సమావేశంలో బ్రెగ్జిట్ ప్రక్రియను వాయిదా వేయాలని తీర్మానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని జాన్సన్ గత్యంతరం లేని పరిస్థితుల్లో గడువు పెంచాలని కోరుతూ ఈయూకు లేఖ రాశారు. అయితే, అక్టోబర్ 31 గడువుకే తాను కట్టుబడి ఉంటానని, గడువు పొడిగింపుపై ఈయూతో చర్చించబోనని ఆయన పేర్కొన్న సంగతి తెలిసిందే. '2020 జనవరి 31 వరకు గడువు పెంచాలని బ్రిటన్ పార్లమెంట్ ప్రతిపాదించింది. ఆ తేదీ కంటే ముందే ఒప్పందానికి ఆమోదం లభిస్తే, గడువుకు ముందుగానే ముగింపు పలుకాలని ప్రభుత్వం నిర్ణయించింది' అని యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డొనాల్డ్ డస్క్‌కు సంతకం చేయకుండా రాసిన లేఖలో జాన్సన్ పేర్కొన్నారు. అక్టోబర్ 31 గడువు లోపునే ఈయూ నుంచి వైదొలిగేందుకు కట్టుబడి ఉన్నట్లు జాన్సన్ అందులో పునరుద్ఘాటించారు. వచ్చేవారం పార్లమెంట్‌లో బ్రెగ్జిట్ ఒప్పందాన్ని ప్రవేశపెడుతానని పేర్కొన్నారు. గడువు పెంచాలని బ్రిటన్ నుంచి లేఖ అందిందని, ఈయూ నేతలను సంప్రదించి దీనిపై నిర్ణయం తీసుకుంటామని టస్క్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మరోవైపు, సంతకం చేయకుండా లేఖను పంపడంపై జాన్సన్ మీద ప్రతిపక్ష లేబర్‌పార్టీ మండిపడింది. ఆయన పార్లమెంట్‌ను, న్యాయస్థానాలను ధిక్కరించారని ధ్వజమెత్తింది. ఆకతాయిలాగా ఆయన ప్రవర్తన ఉందని విమర్శించింది.

## అతిథిగా కాదు.. యాత్రికునిగా

మన్మోహన్ కర్తార్‌పూర్ సందర్శనపై ఆయన సన్నిహితుల వెల్లడి

**న్యూఢిల్లీ/ఇస్లామాబాద్, అక్టోబర్ 20:** మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ పాకిస్థాన్‌లో కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికారిక హోదాలో హాజరుకాబోరని, కేవలం సామాన్య యాత్రికునిగానే అక్కడికి వెళ్తారని ఆయన సన్నిహితవర్గాలు ఆదివారం వెల్లడించాయి. ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్న తన ఆహ్వానానికి మన్మోహన్‌సింగ్ అంగీకరించారని పాక్ విదేశాంగ మంత్రి షా మహమూద్ ఖురేషీ ప్రకటించిన నేపథ్యంలో మన్మోహన్ సన్నిహితులు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. తన ఆహ్వానానికి మన్మోహన్ అంగీకరించారని, నవంబర్ 9న జరిగే కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ప్రత్యేక అతిథిగా కాకుండా సామాన్య యాత్రికునిగా హాజరవుతారని షా మహమూద్ ఖురేషీ శనివారం ముల్తాన్‌లో విలేకరులకు తెలిపినట్టు 'డాన్' వార్తాప్రతిక పేర్కొన్నది. చారిత్రక కర్తార్‌పూర్ పుణ్యక్షేత్రాన్ని సామాన్య యాత్రికునిగానే సందర్శిస్తానని పాక్ అధికారుల ఆహ్వానానికి జవాబిస్తూ రాసిన లేఖలో మన్మోహన్ పేర్కొన్నట్టు న్యూఢిల్లీలోని ఆయన సన్నిహితులు తెలిపారు. పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ నేతృత్వంలో కర్తార్‌పూర్‌కు వెళ్లే సిక్కు జాతా ప్రతినిధి బృందంలో మన్మోహన్‌సింగ్ భాగస్వామిగా ఉంటారు. వీరంతా కర్తార్‌పూర్‌లో ప్రార్థనలు నిర్వహించి అదేరోజు స్వదేశానికి తిరిగొస్తారు.



**ప్రారంభంకాని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు**

కర్తార్‌పూర్‌లోని గురుద్వారా దర్బార్ సాహిబ్‌ను సందర్శించే భక్తులకు ఆదివారం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభంకాలేదు. ఈ యాత్రకు వచ్చేవారు 20 డాలర్ల (సుమారు రూ.1,400) ఫీజు చెల్లించాలన్న ఇస్లామాబాద్ డిమాండ్ సహా పలు అంశాలపై భారత్, పాక్ మధ్య ఇప్పటికీ అంగీకారం కుదరకపోవడమే ఇందుకు కారణమని అధికారులు తెలిపారు. కాగా కర్తార్‌పూర్ కారిడార్‌ను నవంబర్ 9న పాకిస్థాన్ ప్రారంభిస్తుందని ఆ దేశ ప్రధాన మంత్రి ఇమ్రాన్‌ఖాన్ ఆదివారం ప్రకటించారు.

# నేడే పోలింగ్

- మహారాష్ట్ర, హర్యానాలో పోలింగ్‌కు సర్వం సిద్ధం
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6వరకు పోలింగ్
- ఓటేయనున్న 10.81 కోట్ల మంది
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 24న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి



మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా కేంద్రంలో పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది

**ముంబై/చండీగఢ్, అక్టోబర్ 20:** మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. మహారాష్ట్రలోని 288, హర్యానాలోని 90 సీట్లతోపాటు ఉప ఎన్నికలు జరుగనున్న 18 రాష్ట్రాల్లోని 51 అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్‌సభ సీట్లకు సోమవారం పోలింగ్ జరుగనున్నది. రెండు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 10,81,22,170 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొననున్నారు. 4,406 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 1.16 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1.62 లక్షల వీవీప్యాట్లను వినియోగిస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనున్నది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రెండు రాష్ట్రాల్లో కలిపి దాదాపు నాలుగు లక్షల మంది భద్రతా బలగాలను మోహరించారు. మహారాష్ట్ర, హర్యానాల్లో అధికారం నిలబెట్టుకోవాలని బీజేపీ భావిస్తుండగా.. అధికారం దక్కించుకొని లోక్‌సభ ఎన్నికల ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు పోరాడుతున్నాయి. ఈ నెల 24న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుంది.

**మహారాష్ట్రలో 96 వేల పోలింగ్ స్టేషన్లు**

మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలతోపాటు సతారా లోక్‌సభ స్థానానికి సోమవారం పోలింగ్ జరుగనున్నది. రాష్ట్రంలో మొత్తం 8,98,39,600 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 96,661 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 1,35,021 వీవీప్యాట్లను వినియోగించనున్నారు. అసెంబ్లీ బరిలో 235 మంది మహిళలు సహా 3,237 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధానంగా అధికార బీజేపీ-శివసేనల 'మహాయుతి', ప్రతిపక్ష కాంగ్రెస్-ఎన్సీపీల 'మహా అగాడీ' కూటముల మధ్యే పోటీ నెలకొన్నది. ప్రధాన పార్టీలకు సంబంధించి బీజేపీ 164 స్థానాల్లో, శివసేన 124 సీట్లలో పోటీ చేస్తున్నది. కాంగ్రెస్ 147, ఎన్సీపీ 121 చోట్ల బరిలోకి దిగాయి. మరోవైపు రాజ్‌ఠాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) 101 స్థానాల్లో పోటీ పడుతుండగా, బీఎస్పీ 262 స్థానాల్లో అభ్యర్థులను దింపింది. వీటితోపాటు మజ్లిస్ 51, సీపీఐ 16, సీపీఎం 8 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. 1400 మంది స్వతంత్రులు రంగంలో ఉన్నారు. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నైరుతి నాగపూర్ స్థానం నుంచి బరిలో ఉన్నారు. కాంగ్రెస్ సీఎం అభ్యర్థి అశోక్ చవాన్ సతారా జిల్లాలోని దక్షిణ కరాడ్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారు. ఇప్పటివరకు వెలువడిన సర్వేలు మళ్లీ బీజేపీకే పట్టం కడుతున్నాయి. బీజేపీ-శివసేన కూటమి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేస్తున్నాయి. సీఎం ఫడ్నవీస్ సైతం తమ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్టికల్ 370 రద్దు, రామజన్మభూమి వివాదం వంటివి కలిసి వస్తాయని దీమాగా ఉన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షమే లేదని, తమకు సవాల్ విసిరే పార్టీయే లేదని సీఎం చెప్తున్నారు. ఈ అంశంపై శివసేన విమర్శలు ఎక్కుపెట్టింది. ప్రతిపక్షం బలహీనంగా ఉన్నదని భావిస్తే ప్రధాని మోదీతో పదికిపైగా, అమిత్‌షాతో 30కిపైగా ఎన్నికల ప్రచార సభలు ఎందుకు పెట్టించారని ఆదివారం సామ్నా పత్రికలో ప్రచురితమైన ఓ వ్యాసంలో శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ప్రశ్నించారు. తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగిన శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే రాబోయే కాలంలో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేస్తారని కొనియాడారు.

**హర్యానాలో యువతే కీలకం**

హర్యానాలో 90 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్ నిర్వహించనున్నారు. ఇక్కడ నూతన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో యువతే కీలక పాత్ర పోషించనున్నది. రాష్ట్రంలో 1,82,82,570 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 89,42,668 మంది 30 ఏండ్లలోపువారే. హర్యానాలో మొత్తం 90 సీట్లకు 1,169 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో 105 మంది మహిళలున్నారు. ఈ రాష్ట్రంలో త్రిముఖ పోటీ నెలకొన్నది. బీజేపీ, కాంగ్రెస్, దుష్యంత్ చౌతాలాకు చెందిన జననాయక్ జనతాపార్టీ(జేజేపీ) హోరాహోరీ తలపడుతున్నాయి. బీజేపీ, కాంగ్రెస్, జేజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుండగా, బీఎస్పీ 87, అభయ్ సింగ్ చౌతాలాకు చెందిన ఐఎన్‌ఎల్డీ 86, ఆప్ 46, స్వరాజ్ ఇండియా 27 సీట్లలో బరిలోకి దిగాయి. రాష్ట్రంలో ప్రతిపక్షం గందరగోళంలో ఉన్నదని, తాము మరోసారి గద్దెనెక్కడం ఖాయమని సీఎం ఖట్టర్ ధీమాగా ఉన్నారు. మరోవైపు రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోవడం, ఆర్థిక పరిస్థితి దిగజారడం, రైతుల ఆత్మహత్యలు, కుంభకోణాలు, శాంతి భద్రతలు క్షీణించడం వంటివి తమకు కలిసి వస్తుందని ప్రతిపక్షాలు చెప్తున్నాయి. రాష్ట్ర జనాభాలో 25% ఉన్న జాట్ వర్గం ఈ ఎన్నికల్లో కీలకం కానుంది.

## ఎన్సీపీ నేత ధనుంజయ్‌పై కేసు నమోదు

మంత్రి పంకజపై అసభ్యకర వ్యాఖ్యలు చేసినట్లు బీజేపీ ఫిర్యాదు

**బీడ్:** మహారాష్ట్రకు చెందిన ఎన్సీపీ నేత, పర్లీ అభ్యర్థి ధనుంజయ్‌పై కేసు నమోదైంది. మంత్రి పంకజ ముండే, తమ పార్టీ అభ్యర్థినిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసినట్లు పర్లీ బీజేపీ అధ్యక్షుడు జుగల్ కిషోర్ లోహియా శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్టోబర్ 17న విదా గ్రామంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ధనుంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్‌తోపాటు మహిళా సంఘానికి దీనిపై ఫిర్యాదు చేశామన్నారు. మరోవైపు ధనుంజయ్ ముండే దీన్ని ఖండించారు. ఎన్నికల ప్రచారంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు. తనను విలన్‌గా చిత్రీకరించి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మార్పు చేసిన ప్రసంగం వీడియోను సామాజిక మాధ్యమాల్లో ఉంచారని ఆరోపించారు. ఇది పూర్తిగా నకిలీదని, ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరీక్ష ద్వారా దాని విశ్వసనీయతను నిరూపించాలని సవాల్ చేశారు. తన సోదరిపై ఎలాంటి అసభ్య వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు.

## బీహార్ బీజేపీ చీఫ్, కిషన్‌గంజ్ అభ్యర్థిపై కేసు

**కిషన్‌గంజ్:** బీహార్ బీజేపీ అధ్యక్షుడు సంజయ్ జైస్వాల్, ఆ పార్టీ కిషన్‌గంజ్ అభ్యర్థి స్వీటీ సింగ్‌పై కేసు నమోదైంది. వారిద్దరు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు అధికారుల నుంచి ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. గురువారం కిషన్‌గంజ్‌లో స్థానిక వ్యాపారులతో ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రోజు షాపులను మూసి బీజేపీకి అనుకూలంగా ఓటు వేసిన వారికి రూ.500 చెల్లిస్తానని పార్టీ అభ్యర్థి సమక్షంలో జైస్వాల్ హామీ ఇచ్చారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా ఉన్న ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా ప్రచారమైంది.



మేఘాలయలోని షెల్లా అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో భాగంగా ఓ పోలింగ్ కేంద్రానికి అటవీమార్గంలో వెళ్తున్న సిబ్బంది

## ఎన్నికలప్పుడే 'సర్జికల్ స్ట్రైక్'!

మోదీ సర్కారుపై కాంగ్రెస్ ధ్వజం

**న్యూఢిల్లీ:** మోదీ సర్కారు హయాంలో సర్జికల్ స్ట్రైక్స్ (లక్షితదాడులు) సరిగ్గా ఎన్నికల ముందరే జరుగుతుంటాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ఒక్క రోజు ముందు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత సైన్యం దాడులు నిర్వహించడంపై కాంగ్రెస్ నేత, బీహార్ మాజీ ఎంపీ అఖిలేశ్ ప్రసాద్ సింగ్ స్పందించారు. అసలైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వం ఇక సైనిక చర్యను రాజకీయం చేస్తుందని ఆయన ఆరోపించారు. అయితే కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షానవాజ్ హుస్సేన్ ఖండించారు. ఎన్నికలకు, లక్షితదాడులకు సంబంధం లేదని, మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమన్నారు.

# అట్టుడికిన బంగ్లాదేశ్



ఢాకాలో భారీ నిరసన ప్రదర్శన

- మహమ్మద్ ప్రవక్తను దూషించారంటూ నిరసనలకు దిగిన ముస్లింలు
- పోలీసుల కాల్పులు.. నలుగురు మృతి, 50 మందికి గాయాలు

**ఢాకా, అక్టోబర్ 20:** మహమ్మద్ ప్రవక్తను దూషిస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టారని ఆరోపిస్తూ.. బంగ్లాదేశ్‌లోని భోలా జిల్లాలో ఆదివారం వందలాది మంది ముస్లింలు చేపట్టిన నిరసన ప్రదర్శనలు ఉద్రిక్తతలకు దారితీశాయి. దీంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే మరణించగా, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మహమ్మద్ ప్రవక్తను దూషిస్తున్నట్టు ఉన్న ఓ పోస్టు శుక్రవారం ఫేస్‌బుక్‌లో చక్కర్లు కొట్టింది. దీనిపై ముస్లిం సంఘాలు తీవ్రంగా అసహనం వ్యక్తం చేశాయి. సదరు పోస్టు ఓ హిందువు ఫేస్‌బుక్ ఖాతా నుంచి పోస్టు చేశారని తెలుసుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, తన ఖాతా హ్యాకింగ్‌కు గురైందని సదరు వ్యక్తి పోలీసులకు తెలిపాడు. దర్యాప్తు చేపట్టిన అధికారులు ఖాతాను హ్యాక్ చేసిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.



పోలీస్ కాల్పుల్లో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులు

అయితే, దైవ దూషణ పోస్టుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొన్ని ముస్లిం సంఘాలు ఆదివారం నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. ఆందోళనకారులు విరుచుకుపడటంతో భోలా పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఆందోళనలను అడ్డుకున్న పోలీసులపై నిరసనకారులు దాడులకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు కాల్పులకు దిగడంతో నలుగురు నిరసనకారులు మృతి చెందారు. మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో పలువురు పోలీసులకు కూడా గాయాలయ్యాయని ఓ పోలీసు అధికారి తెలిపారు.

## ప్రమాదానికి గురైన సౌదీ బస్సులో 9 మంది భారతీయులు

**న్యూఢిల్లీ:** సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో బుధవారం ప్రమాదానికి గురైన బస్సులో 9 మంది భారతీయ యాత్రికులు ఉన్నట్లు భారత కాన్సులేట్ జనరల్ వెల్లడించారు. వీరిలో ఇద్దరు గాయపడ్డారని, మిగిలిన ఏడుగురి వివరాల కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. మదీనాలో బుధవారం ఒక బస్సు మరో వాహనాన్ని ఢీకొనడంతో 35 మంది విదేశీయులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఘటనలో మరో నలుగురు గాయపడ్డారు.

## బస్సులోని 30 మంది సజీవ దహనం

డీఆర్ కాంగోలో ఘోరం

**ఎమ్బాంజా-ఎన్గుంగు , అక్టోబర్ 20:** డీఆర్ కాంగోలో ఘోర ప్రమాదం జరిగింది. బస్సుకు మంటలు అంటుకోవడంతో 30 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. మరో 18 మందికి కాలిన గాయాలయ్యాయని స్థానిక రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఎన్సియాలా తెలిపారు. కిక్కిరిసిన ప్రయాణికులు, సరుకులతో కూడిన బస్సు లుపు నుంచి రాజధాని కిన్షాసాకు వెళ్తుండగా శనివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగినట్లు ఓ అధికారి చెప్పారు. బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో రోడ్డు పక్కకు దూసుకెళ్లిందని, రాపిడికి మంటలు వ్యాపించడంతో పేలిపోయిందని చెప్పారు. కాగా ప్రమాద సమయంలో బస్సులో వంద మంది వరకు ప్రయాణికులు ఉన్నారని, మంటల్లో చాలా మంది గుర్తుపట్టలేనంతగా కాలిపోయారని ఈ ఘటనలో గాయడిన ఓ మహిళ వెల్లడించారు.

## శతఘ్నుల గర్జన

మొదటిపేజీ తరువాయి...

సదుపాయాల పరంగా తీవ్ర నష్టాన్ని కలిగించాం. భవిష్యత్తులో పాక్ ఇలాంటి చర్యలకు పాల్పడితే, వాటిని తిప్పికొట్టేందుకు భారత సైన్యం వెనుకాడబోదు' అని రావత్ హెచ్చరించారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత సరిహద్దుల వెంబడి చొరబాట్లు పెద్దఎత్తున జరుగొచ్చని తమకు సమాచారం అందిందని ఆయన తెలిపారు. ఉగ్రవాద చర్యల్ని తిప్పికొట్టడానికి అవసరమైనప్పుడు రాజకీయ నాయకత్వం భారత సైన్యం వెన్నంటే ఉన్నదని తెలిపారు. కాగా, భారత సైన్యం ఆదివారం చేపట్టిన దాడుల్లో 20 నుంచి 35 మంది ఉగ్రవాదులు హతమైనట్టు ఆర్మీ వర్గాలు తెలిపాయి. మృతుల్లో జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ సంస్థలకు చెందిన ఉగ్రవాదులు కూడా ఉన్నట్టు పేర్కొన్నాయి. అలాగే, ఎల్వోసీ వెంబడి ఉన్న ఏడు ఉగ్రవాద శిబిరాలు లక్ష్యంగా భారత సైన్యం ఈ దాడుల్ని చేపట్టిందని సదరు వర్గాలు వెల్లడించాయి. శనివారం సాయంత్రం తాంగ్‌ధర్ సెక్టార్‌లో పాక్ సైన్యం జరిపిన దాడుల్లో ఇద్దరు జవాన్లు, ఓ పౌరుడు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో భారతసైన్యం వెంటనే ప్రతీకార దాడులను చేపట్టింది. భారత్‌లోకి ఉగ్రవాదులు చొరబడేందుకు తాంగ్‌ధర్ సెక్టార్‌లో పాక్ శనివారం కాల్పుల ఒప్పందాన్ని ఉల్లంఘించిందని సైన్యానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. 2016 సెప్టెంబర్‌లో భారత సైన్యం చేపట్టిన లక్షిత దాడులతో ప్రస్తుత దాడులను పోల్చలేమని అధికారిక వర్గాలు తెలిపాయి. కాల్పుల ఘటనతో ముజఫరాబాద్ జిల్లాలోని నౌసెరి సెక్టార్‌తో పాటు నీలం లోయలోని జురా సెక్టార్ తీవ్రంగా దెబ్బతిన్నట్టు ముజఫరాబాద్ డిప్యూటీ కమిషనర్ బాదర్ మునీర్ మీడియాకు తెలిపారు. కాగా, భారత సైన్యం దాడులను ఖండిస్తూ పాకిస్థాన్‌లోని భారత డిప్యూటీ హై కమిషనర్ గౌరవ్ ఆహ్లువాలియాకు పాక్ సర్కారు నోటీసులు జారీ చేసింది.



భారత బలగాల దాడిలో పీవోకేలోని నీలం వ్యాలీలో ధ్వంసమైన ఓ ఉగ్రవాద శిబిరం



భారత బలగాలు దాడిచేసిన ప్రాంతం గూగుల్ మ్యాప్

### 2,300 సార్లు తూట్లు పొడిచారు

ఈ ఏడాది అక్టోబర్‌నాటికి సుమారు 2,300 సార్లు పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. గత ఏడాది 1,629 సార్లు పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. చైనా వాస్తవాధీన రేఖకు దగ్గరగా ఉన్న లేహ్, కారకోరాన్ని కలిపే వంతెనను ప్రారంభించడానికి సోమవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్, భారత సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ లడఖ్ వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో ఉగ్ర శిబిరాలపై ఎదురు దాడి ఘటన జరుగడం గమనార్హం.

**ఎప్పటికప్పుడు వివరాలు అందించండి**

పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం ఆదివారం చేసిన ఎదురుదాడి ఘటనపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. తాంగ్‌ధర్ సెక్టార్‌లో నెలకొన్న పరిస్థితులపై సైన్యాధిపతి బిపిన్ రావత్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని రావత్‌కు రాజ్‌నాథ్ సూచించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

**తగిన సమాధానం చెప్పారు : బీజేపీ**

పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం చేసిన దాడులను జమ్ముకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్ రైనా స్వాగతించారు. భారత్‌లోకి అక్రమంగా చొరబడి జమ్ముకశ్మీర్‌లో దాడులకు పాల్పడాలని చూసిన ఉగ్రవాదులకు భారత సైన్యం సరైన సమాధానం చెప్పిందని కొనియాడారు. కాల్పుల విరమణ ఉల్లంఘన ఒప్పందానికి తూట్లు పొడుస్తూ పాక్ సైన్యం భారత జవాన్లను పొట్టనబెట్టుకుంటున్నదని మండిపడ్డారు.

ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసిన భారత సైన్యం సాహసాన్ని కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ ప్రశంసించారు. సైన్యం ధైర్యసాహసాలకు జాతి మొత్తం గర్విస్తున్నదని పేర్కొన్నారు.

**ఉగ్రశిబిరాలు లేనే లేవు: పాక్**

పీవోకేలోని నాలుగు ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం దాడులు చేపట్టిందన్న వార్తలను పాకిస్థాన్ ఖండించింది. పీవోకేలో ఉగ్రవాద శిబిరాలున్నట్టు భారత్ అసత్య ఆరోపణలు చేస్తున్నదని, అవసరమైతే పీ5 దేశాలకు(ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కలిగిన దేశాలు)చెందిన దౌత్యవేత్తలను అక్కడ పర్యటించి నిజానిజాలు వెలికితీసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని ఆ దేశ విదేశాంగ ప్రతినిధి మహమ్మద్ ఫైజల్ పేర్కొన్నారు.

**అక్కసు వెళ్లగక్కిన పాక్ మీడియా**

ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం ఆదివారం జరిపిన ఎదురుదాడులపై పాక్ మీడియా కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. పీవోకేలోని ప్రజలపై, పాక్ సైన్యంపై భారత్ హింసాత్మకంగా ప్రవర్తించిందని గగ్గోలు పెట్టింది. వాస్తవ లెక్కలను దాచిపెట్టిన పాక్ మీడియా.. ఆదివారం జరిగిన కాల్పుల ఘటనలో తమ సైన్యం నుంచి ఒక్క జవాను మాత్రమే చనిపోయినట్టు పేర్కొంది. అయితే, భారత సైన్యానికి చెందిన తొమ్మిది మంది సైనికులు చనిపోయినట్టు, పలువురు గాయపడినట్టు కాకి లెక్కలు చెప్పింది. శనివారం పాక్ చేసిన దురాగతాన్ని ప్రస్తావించకుండానే, ఉగ్రశిబిరాలపై ఆదివారం భారత్ జరిపిన ఎదురుదాడిని హింసాత్మక చర్యగా అభివర్ణించింది. ప్రపంచ సమాజం ఈ ఘటనపై మౌనం వీడాలని పెడబొబ్బలు పెట్టింది. చనిపోయిన సైనికుల మృతదేహాలను తీసుకెళ్లడానికి తెల్ల జెండాలను చూపి భారత సైనికులు పాక్‌ను అభ్యర్థించారని తన పైశాచికత్వాన్ని ప్రదర్శించింది.

# ఇంకా కుదుటపడని కశ్మీర్

- చాలా చోట్ల తెరుచుకోని దుకాణాలు
- జమ్ములో పెరిగిన విద్యార్థుల హాజరు శాతం

**శ్రీనగర్, న్యూఢిల్లీ/లండన్, అక్టోబర్ 20:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేసి ఆదివారం నాటికి 77 రోజులు కావస్తున్నా ఆ రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కశ్మీర్ లోయతోపాటు చాలా ప్రాంతాల్లో దుకాణాలు మూసే ఉన్నాయి. టీఆర్‌సీ చౌక్-బాటామలూ ప్రాంతంలో మాత్రం 'ఆదివారం మార్కెట్' సందర్భంగా భారీగా జనాలు వచ్చారు. నిత్యావసరాలను, దుస్తులను కొనుగోలు చేశారు. ప్రధాన వ్యాపార కేంద్రమైన లాల్‌చౌక్ తదితర ప్రాంతాల్లో ఉదయం కొద్ది సేపు మాత్రమే దుకాణాలను తెరిచారు. మొత్తానికి చాలా చోట్ల దుకాణాలు మూసే ఉన్నాయి. ఇక ప్రజా రవాణా కూడా మెరుగుపడలేదు. కొన్ని చోట్ల ప్రైవేట్ వాహనాలు, ఆటో రిక్షాలు తిరిగాయి. కశ్మీర్ లోయలో ఇంటర్నెట్ సదుపాయాలు అందుబాటులో లేవు. మరోవైపు జమ్ములో విద్యార్థుల హాజరుశాతం గణనీయంగా పెరిగింది. అక్కడ 100శాతం మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యారు. కానీ కశ్మీర్‌లో ఈ హాజరు 20 శాతం మాత్రమే ఉన్నది. 130 పెద్ద దవాఖానలు, 4,359 ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.



జమ్ములో ఆదివారం జవాన్ల పహారా

**లండన్‌లో భారత్ వ్యతిరేక ర్యాలీ వద్దు: మేయర్**

ఆర్టికల్ 370 రద్దును నిరసిస్తూ భారత్‌కు వ్యతిరేకంగా దీపావళి పండుగ రోజున లండన్‌లో భారీ ర్యాలీ చేపట్టాలని కొందరు భావిస్తున్నారు. ర్యాలీ కోసం పోలీసుల అనుమతిని కోరారు. దాదాపు 5వేల నుంచి 10వేల వరకు ఆందోళనకారులు ఈ ర్యాలీలో పాల్గొనే అవకాశముంది. అయితే ర్యాలీ విషయాన్ని లండన్ అసెంబ్లీ సభ్యుడు, భారత సంతతి వ్యక్తి నవీన్ షా లండన్ మేయర్ సాధిక్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన పాకిస్థాన్ సంతతి వ్యక్తి అయిన మేయర్ సాధిక్‌ఖాన్ లండన్‌లోని భారత రాయబార కార్యాలయం సమీపంలో ర్యాలీ నిర్వహించాలని ఆందోళనకారులు భావిస్తుండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని, వెంటనే దీన్ని రద్దు చేసుకోవాలని ఆందోళనకారులకు సూచించారు.



## కిక్కిరిసిన కొమురవెల్లి

**చేర్యాల, నమస్తే తెలంగాణ:** కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకొన్నట్టు ఆలయ డిప్యూటీ కమిషనర్ టంకశాల వెంకటేశ్ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే భక్తులు తరలివచ్చి ఆదివారం అభిషేకాలు, అర్చనలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టి కొండపైన ఎల్లమ్మ దేవతను దర్శించుకొన్నారు. మట్టిపాత్రల బోనం మొక్కుతీర్చుకుని, రాతిగీరల వద్ద ప్రదక్షిణలు చేసి కోడెలు కట్టారు. భక్తులకు ఏర్పాట్లను ఏఈవో రావుల సుదర్శన్, పర్యవేక్షకులు నీలశేఖర్, సిబ్బంది బత్తిని పోచయ్య, మేకల పోచయ్య, ఏఈ బ్రాహ్మండ్లపల్లి అంజయ్య, సార్ల విజయ్‌కుమార్, వెంకటాచారి, వైరాగ్యం జగదీశ్వర్, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, సార్ల కనకయ్య, మాధవి పర్యవేక్షించారు.




ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డి విసిరిన గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరించిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం నల్లగొండ జిల్లా చిట్యాల శివారులోని తన వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు నాటారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎన్‌టీవీ చైర్మన్ చౌదరి, సాగర్ సిమెంట్స్ ఎండీ ఆనంద్‌రెడ్డికి ఆయన గ్రీన్ చాలెంజ్ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని గుత్తా కోరారు. - చిట్యాల



# సైబర్.. పిల్లలకు యమడేంజర్

- గంటల తరబడి సోషల్‌మీడియాలోనే బాల్యం
- పెరుగుతున్న స్మార్ట్‌ఫోన్ల వినియోగం
- ఆరోగ్యపరంగా, మానసికంగా అనేక ఇబ్బందులు
- చిన్నారులకు తల్లిదండ్రులు సమయమివ్వాలంటున్న నిపుణులు
- 'ఇంటర్నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మంత్'గా అక్టోబర్



**క్రాంతి మల్లాది, హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

సైబర్.. బాల్యానికి యమ డేంజర్‌గా మారింది. సోషల్‌మీడియా.. మనిషి ఆలోచనలు, బంధాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మితిమీరిన వినియోగంతో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. స్మార్ట్‌ఫోన్ల అధిక వినియోగం మానసిక ఒత్తిడిని పెంచుతున్నది. ముఖ్యంగా పిల్లలు, విద్యార్థుల్లో ఆన్‌లైన్ వేదికగా జరిగే సంభాషణలు దిగులు, నిరాశ, నిస్పృహ వంటి లక్షణాలకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ నెలను 'ఇంటర్నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మంత్'గా నిర్ణయించారు. సోషల్‌మీడియా వినియోగంతో కలిగే నష్టాలపై ఈ నెలలో పిల్లలకు, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. క్లైన్‌వెల్ట్ పీట్ మార్విక్ గోవర్‌డెలర్ (కేపీఎంజీ) సంస్థ పలు పాఠశాలల్లో విద్యార్థులకు సోషల్‌మీడియాపై అవగాహన కల్పించేందుకు నడుంబిగించింది. హైదరాబాద్‌లోని చాలా పాఠశాలల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. పాఠశాలలు ఆన్‌లైన్ భద్రతపై పిల్లలను చైతన్యపర్చాలని సూచిస్తున్నది. సోషల్ మీడియా కారణంగా వచ్చే భావోద్వేగాల గురించి తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని పేర్కొంటున్నది.

### సోషల్‌మీడియాకు బానిసలుగా..

ప్రైమరీ స్కూల్ నుంచి సెకండరీ స్కూల్‌కు మారుతున్న సమయంలో పిల్లల్లో సోషల్‌మీడియా ప్రభావం అధికంగా ఉంటుందని ఇటీవల ఒక సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. సోషల్‌మీడియా ఎక్కువగా వాడే పిల్లలు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. 8 నుంచి 18 ఏండ్ల వయసులో పిల్లలు తమ గుర్తింపుపై మానసికంగా ఆందోళనకు గురవుతున్నారు. సోషల్‌మీడియాలో వచ్చే లైకులు, కామెంట్ల ఆధారంగా వ్యక్తిత్వాన్ని అంచనా వేసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా 15 శాతానికిపైగా పిల్లలు, విద్యార్థులే సోషల్‌మీడియా సైట్లను వాడుతున్నారని ఇటీవల వరల్డ్ ఇండెక్స్ నివేదికలో తేలింది. పలు అప్లికేషన్లు, ఆన్‌లైన్ గేములు, వినోదాన్ని పంచే అప్లికేషన్లకు ఆకర్షితులు కావడమే ఇందుకు కారణమని వెల్లడయింది. ఆ అప్లికేషన్లలో ఖాతాలు తెరిచేందుకు 13 ఏండ్లలోపు పిల్లలకు అనుమతి లేకున్నా.. వాటినే వాడుతున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌షాట్, వైబర్, గూగుల్ ప్లస్ వంటి అప్లికేషన్లలో ఖాతా తెరిచేందుకు 13 ఏండ్లు నిండాల్సి ఉండగా, వాట్సాప్ ఖాతా తెరిచేందుకు 16 ఏండ్ల వయసు నిండి ఉండాలి. కానీ ప్రస్తుతం ఈ నిబంధనలను ఎవరూ పాటించడంలేదు. పిల్లలు శారీరకంగా ఆటలు ఆడటానికి బదులుగా సోషల్‌మీడియాకు బానిసలవుతున్నారు. ఫలితంగా ఎదుగుదల లోపిస్తున్నది. ఎక్కువ సమయం స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ వాడకం ద్వారా ఆరోగ్యపరంగా ఇబ్బంది తలెత్తే అవకాశాలు ఉన్నాయి.

### తల్లిదండ్రుల పర్యవేక్షణతోనే పరిష్కారం



డబ్బు సంపాదనకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చే తల్లిదండ్రులు.. పిల్లలతో ఎక్కువ సమయం గడుపడం లేదు. పిల్లల్లో ఒంటరితనం పెరిగిపోతున్నది. ఈ సమయంలో సోషల్‌మీడియాలో అపరిచితులతో చనువుగా ఉంటున్నారు. వ్యక్తిగత సమాచారాన్ని కూడా పంచుకుంటున్నారు. దీంతో చాలా ఇబ్బందులను ఎదర్కోవాల్సి వస్తున్నది. పిల్లల నడవడికను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. పిల్లల పర్యవేక్షణ కోసం గూగుల్ ప్లే స్టోర్‌లో గూగుల్ ఫ్యామిలీ లింక్ అప్లికేషన్ ఉంటుంది. పిల్లల ఫోన్‌లో దానిని ఇన్‌స్టాల్ చేస్తేవారు ఫోన్‌లో ఏం చేస్తున్నారు, ఏ అప్లికేషన్‌లో, ఏ గేముల్లో ఎంత సమయం గడుపుతున్నారో తెలుసుకోవచ్చు. వాటిని నియంత్రించవచ్చు కూడా. పిల్లల అభిప్రాయాలను వినడానికి తల్లిదండ్రులు సుముఖంగా ఉండాలి. వారితో ఎక్కువ సమయం గడపాలి.

- నల్లమోతు శ్రీధర్, సైబర్ నిపుణుడు

### ఇవిగో ప్రమాద ఘంటికలు

- కొన్ని సర్వేల ప్రకారం.. ప్రపంచ జనాభాలో దాదాపు 300 కోట్లమంది సోషల్‌మీడియాను వినియోగిస్తున్నారు.
- రోజుకు సగటున 2 గంటలపాటు సోషల్‌మీడియాలోనే గడుపుతున్నారు.
- దేశంలో సోషల్‌మీడియా సైట్లను 15 శాతానికిపైగా ఉపయోగిస్తున్నది పిల్లలే.
- 2 కంటే ఎక్కువ సోషల్‌మీడియా వేదికలు ఉపయోగించేవారు 3 రెట్లు అధికంగా ఆందోళన చెందేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు చెప్తున్నారు.
- సోషల్‌మీడియా ఖాతా తెరవాలంటే కనీసం 13 ఏండ్ల వయసు ఉండాలి. కానీ, 10 ఏండ్లలోపు పిల్లల్లో మూడువంతుల మంది చిన్నారులకు సోషల్‌మీడియా ఖాతాలు ఉంటున్నాయి.
- సోషల్‌మీడియా మితిమీరిన వినియోగం వల్ల అశాంతి, నిద్రలేమి వంటివి ఏర్పడుతాయి. ఏకాగ్రత తగ్గిపోతుంది.
- రాత్రిళ్లు స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల నుంచి వెలువడే కాంతి వల్ల నిద్రనిచ్చే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోతుందని ఓ పరిశోధనలో తేలింది.
- స్మార్‌ఫోన్లో ఎక్కువసేపు ఇంటర్నెట్ వినియోగించడం వల్ల చిన్న వయసులోనే కంటి సమస్యలు, నడుములు వంగిపోవడం, ఒబెసిటీ వంటి ఇబ్బందులు వస్తున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఆదివారం హైదరాబాద్‌లో జ్యోతిప్రజ్వలన చేసి కళోల్సవమ్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళిసై

## భారతీయులంతా ఒక్కటే

కళోల్సవమ్ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

**కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ:** ప్రాంతాలను బట్టి వేషభాషలు, సంస్కృతి వేరుగా ఉన్నప్పటికీ.. భారతీయులంతా ఒక్కటేనని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. పొరుగు రాష్ట్రాలయిన కేరళ, తమిళనాడువాసులు హైదరాబాద్‌లో సోదరభావంతో కలిసిమెలిసి జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఆల్‌ఇండియా మలయాళీ అసోసియేషన్ (ఏఐఎంఏ) తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బోయిన్‌పల్లి ఎంఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన 'కళోల్సవమ్' (సాంస్కృతిక పండుగ) కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఆహారం, ఆరోగ్యం విషయంలో కేరళ తన ప్రత్యేకతను చాటుకున్నదని చెప్పారు. మలయాళీ పాయసం అంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. కిక్కిరిసిపోయిన భక్తులు దేవుడి ఊరేగింపునకు దారి ఇచ్చినట్టు.. అన్నంతో కడుపు నిండిపోయినప్పటికీ మలయాళీ పాయసం తినే వీలుంటుందని పేర్కొన్నారు. తెలంగాణలోని కేరళ సంఘాలు ఇక్కడి పేద మలయాళీల అభ్యున్నతికి పాటుపడాలని తమిళిసై పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఏ తెలంగాణ విభాగం అధ్యక్షుడు టీఎస్సీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎంకే శశికుమార్, ఉపాధ్యక్షులు సీజీ చంద్రమోహన్, కే సురేంద్రన్, జీ సురేశ్, ఏఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు ఆర్‌ఎస్ పిళ్లై, ప్రతినిధులు వినోద్ పిళ్లై, టీవీ వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మెకు మద్దతు తెలుపాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో వాహనదారులకు గులాబీ పువ్వులు అందజేస్తున్న ఆర్టీసీ కార్మికులు

## సమ్మె కొనసాగుతుంది

ఆర్టీసీ జేఏసీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికులు కొనసాగిస్తున్న సమ్మె కొనసాగుతుందని జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి స్పష్టం చేశారు. ఆర్టీసీ సమ్మె, అనుసరించాల్సిన వ్యూహాలపై ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అఖిలపక్షం, ఆర్టీసీ నేతలు సమావేశమై చర్చించారు. సమావేశం అనంతరం అశ్వత్థామరెడ్డి ఈ నెల 21 నుంచి 30 వరకు చేపట్టే కార్యాచరణను ప్రకటించారు. 21న అన్ని డిపోల ముందు కార్మికులు తమ కుటుంబసభ్యులతో కలిసి బైఠాయిస్తారు. 22న మా పొట్ట కొట్టవద్దంటూ తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లకు విజ్ఞప్తిచేస్తారు. 23న ప్రజాప్రతినిధులను కలిసి సమ్మెకు మద్దతు పలుకాలని కోరనున్నారు. 24న మహిళా కండక్టర్ల దీక్ష, 25న హైవేలు, రహదారులపై రాస్తారోకోలు, 26న ఆర్టీసీ కార్మికుల పిల్లలతో దీక్ష, 27న నిరసన, 28న హైకోర్టు విచారణ నేపథ్యంలో విరామం, 30న ఐదు లక్షల మందితో సకల జనుల సమరభేరి నిర్వహిస్తామని అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వేదికను త్వరలో ప్రకటిస్తామన్నారు.

# 'దశ-దిశ' అద్వితీయం

- రెండు ప్రాంతాల ప్రజలను ఏకంచేసిన కార్యక్రమం
- 'తెలుగు ప్రజల దశ-దిశ' గ్రంథావిష్కరణ సభలో సుప్రీంకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి




హైదరాబాద్‌లో తెలుగు ప్రజల దశ-దిశ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావు, ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, బుద్ధవనం స్పెషలాఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సీఎం సీపీఆర్వో వనం జ్వాలా నరసింహారావు, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, విద్యావేత్త చుక్కా రామయ్య, పుస్తక రచయిత రామచంద్రమూర్తి, ఏపీ ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్ తదితరులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

ప్రముఖ పాత్రికేయుడు కొండుభట్ల రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో హెచ్‌ఎంటీవీ నిర్వహించిన చరిత్రాత్మక చర్చా కార్యక్రమం 'తెలుగు ప్రజల దశ-దిశ' అపూర్వం.. అద్వితీయమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. రామచంద్రమూర్తి రచించిన 'తెలుగు ప్రజల దశ-దిశ' గ్రంథావిష్కరణ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగింది. ఈ గ్రంథాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఒక భావోద్వేగమైన అంశంపై టెలివిజన్ కేంద్రాన్ని ప్రజలమధ్యకు తీసుకెళ్లి సమావేశపర్చడం మామూలు విషయం కాదని అన్నారు. పోలీసులు, లాఠీలు, తుపాకులు అన్నీ కూడా శాంతిని నెలకొల్పలేని సందర్భంలో ఒక ప్రాంత అతిథులను మరో ప్రాంతానికి తీసుకెళ్లి చర్చాకార్యక్రమాన్ని నిర్వహించడం రామచంద్రమూర్తికి మాత్రమే సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం, వృత్తి పట్ల నిబద్ధత లేకపోతే అలాంటి సమావేశాలను ఆ పరిస్థితుల్లో అదుపుచేయడం సాధ్యం కాదని, సమాజం విడిపోతున్న సందర్భంలో చర్చల ద్వారా ప్రజలను ఒకచోట చేర్చడం సాధ్యమేనని నిరూపించింది 'దశ-దిశ' కార్యక్రమమని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నేడు పత్రికలు, మీడియా ఎంతో నేర్చుకోవాల్సి ఉన్నదని తెలిపారు. పాలకులను ప్రశ్నించాలి.. పాలకులు పౌరులకు విధేయంగా ఉండాలి.. సంభాషణల ద్వారా భావజాలాన్ని వ్యాప్తిచేయాలి. అప్పుడే ప్రజలు ఏం కోరుకొంటున్నారో తెలుస్తుందని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు.

### జర్నలిజం అంటే వ్యాపారం కాదు: హరీశ్

జర్నలిజం అంటే వ్యాపారం, ప్రచురణ, ప్రసారం మాత్రమే కాదని.. ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకురావడమని తెలంగాణ ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాను స్టూడియోనుంచి ప్రజల మధ్యకు తీసుకొచ్చి చర్చలు జరిపించారని, ఉద్యమం తీవ్రంగా కొనసాగుతున్న రోజుల్లో 'దశ-దిశ' నిర్వహించడం ద్వారా ప్రజల భావజాలం ఏమిటన్నది తెలిసిందని, తెలంగాణ ఉద్యమానికి 'దశ-దిశ' ఒక చెరిగిపోని గ్రంథమని పేర్కొన్నారు. రామచంద్రమూర్తి మంచి అనుభవమున్న సంపాదకులని మంత్రి హరీశ్ అన్నారు. రాష్ట్రాలు వేరుపడ్డప్పటికీ, మనమంతా తెలుగు జాతి బిడ్డలమని, అంతా మన మంచికే జరిగిందని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. జరుగబోయేదానిని మనం, మన పాలకులు గుర్తెరిగి కలిసి ముందుకెళ్లాలన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి పనిచేసుకొంటున్నారని, మనలో మనకు మనస్పర్ధలు ఉండకూడదని బొత్స అభిప్రాయపడ్డారు. అనంతరం బుద్ధవనం స్పెషలాఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గ్రంథకర్త రామచంద్రమూర్తి, చుక్కా రామయ్య, ఎస్ వెంకటనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, హెచ్‌ఎంటీవీ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, తెలంగాణ సీఎం సీపీఆర్వో వనం జ్వాలా నరసింహారావు, ఏపీ ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్, ప్రముఖ పాత్రికేయులు వల్లీశ్వర్, తెలకపల్లి రవి, విరాహత్ అలీ, ప్రముఖ ప్రచురణకర్త ఎమెస్కో విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు చెన్నమనేని రాజేశ్వర్‌రావు, ఉండవల్లి అరుణ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోటు వెలికితీత పనులు ముమ్మరం

- రంగంలోకి స్కూబా డైవర్స్
- నీటి అడుగులోకి వెళ్లి లంగరు బిగించేలా యత్నాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తూర్పు గోదావరి జిల్లా కచ్చులూరు వద్ద నీట మునిగిన రాయల్ వశిష్ట బోటు వెలికితీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే రెండుసార్లు ధర్మాడి సత్యం బృందం లంగరుకు బోటు చిక్కినట్టే చిక్కి జారిన విషయం తెలిసిందే. దాంతో నీటి అడుగు భాగంలోకి వెళ్లి బోటుకు లంగరు బిగించాలన్న ధర్మాడి బృందం సూచన మేరకు అధికారులు పది మంది స్కూబా డైవర్స్‌ను రంగంలోకి దింపారు. ఆదివారం ప్రమాద స్థలికి చేరుకున్న స్కూబా డైవర్స్ పని ప్రారంభించారు. కాకినాడ పోర్టు అధికారి ఆదినారాయణ అనుమతితో ఇద్దరు స్కూబా డైవర్స్ బోటు మునిగిన ప్రాంతంలో నీటి లోతుల్లోకి వెళ్లారు. బోటు మునిగిన ప్రాంతంలో నదీ గర్భం 'వి' ఆకారంలో ఉన్నట్టు గుర్తించారు.



మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గౌతపూర్‌లో ఆదివారం బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఐఆర్‌ఎస్ బలరాంనాయక్‌తో కలిసి గురుకులాల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం మోతిఘనపూర్, నేరళ్లపల్లి, చింతకుంటతండా, ఊటకుంతండాలో స్వేరోస్ విజ్ఞాన మందిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మేధావులు అందించిన విజ్ఞానాన్ని సరైన రీతిలో ఉపయోగించుకుంటే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడని పేర్కొన్నారు. - రాజాపూర్

## ఆర్మీ జవాన్ దారుణ హత్య



**నర్సంపేట, నమస్తే తెలంగాణ:** వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో ఆర్మీ జవాన్ ప్రేమ్‌కుమార్ దారుణ హత్యకు గురయ్యారు. వల్లభ్‌నగర్ ప్రాంతంలో స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు శనివారం రాత్రి హాజరయ్యారు. వేడుకల్లో మద్యం తాగిన ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణను ఆపేందుకు ప్రయత్నించగా కొందరు యువకులు అతనిపై కత్తితో దాడిచేసి పారిపోయారు. తీవ్రగాయాలైన ప్రేమ్‌కుమార్‌కు స్థానికంగా ప్రథమ చికిత్స చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఆయన భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.



క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలోని ప్రాపర్టీషోలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## వరంగల్‌కు నెలరోజుల్లో మాస్టర్‌ప్లాన్

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**సుబేదారి(వరంగల్):** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తరహాలో వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ నగరం హన్మకొండ నక్కలగుట్టలో క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రాపర్టీషో ముగింపు సమావేశంలో ఆదివారం మంత్రి మాట్లాడుతూ.. వరంగల్‌కు సరికొత్త మాస్టర్‌ప్లాన్ అమలుకు నెలరోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆమోదముద్ర పడుతుందని తెలిపారు.



హన్మకొండలో క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాపర్టీషోకు హాజరైన ఔత్సాహికులు



బంధువుల దాడితో తగలబడుతున్న సరిత అత్తగారి ఇల్లు

## అనుమానాస్పదంగా వివాహిత మృతి

- భర్తే చంపాడంటూ ఇంటికి నిప్పంటించిన బంధువులు

**సిరికొండ:** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం గోప్యానాయక్ తండా పంచాయతీ పరిధిలోని చీన్యానాయక్ తండాలో అజ్మీరా సరిత(22) అనే వివాహిత ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. చీమన్‌పల్లి పరిధిలోని చౌక్లనాయక్ తండాకు చెందిన బూక్య పడారి, నీలా దంపతుల కుమార్తె సరిత(ధరణి)కి నాలుగు నెలల క్రితం చీన్యానాయక్ తండాకు చెందిన తిరుపతితో వివాహం జరిగింది. వివాహం అనంతరం అత్తమామ గంగి, మంగ్యాతో సరితకు గొడవలు జరిగాయి. కుటుంబీకులు సరితకు సర్దిచెప్పి కాపురానికి పంపారు. ఈ క్రమంలో ఆదివారం సరిత ఇంట్లో అనుమానాస్పదంగా మృతిచెందింది. సరిత మృతికి అత్తమామలు, భర్త తిరుపతి వేధింపులే కారణమని ఆగ్రహం వ్యక్తం చేసిన బంధువులు ఇంట్లోని సామగ్రి బయటపడేసి తిరుపతి ఇంటికి నిప్పంటించారు. ఏసీపీ శ్రీనివాస్‌కుమార్ ఘటనా స్థలికి చేరొని సమీక్షించారు. సరిత మృతిపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లాకేంద్ర దవాఖానకు తరలించారు. సరిత భర్త తిరుపతి, అత్తమామ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

## గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రసవం



రైలులో ప్రసవించిన అనంతరం ఖమ్మం జిల్లా మధిర దవాఖానకు చేరిన షైజాజ్‌బీ

**మధిర, నమస్తేతెలంగాణ:** సికింద్రాబాద్ నుంచి బీహార్ వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ మహిళ ప్రసవించిన ఘటన ఆదివారం ఖమ్మం జిల్లా మధిర రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్నది. షైజాజ్‌బీ అనే గర్భిణి భర్త అబ్దుల్‌తో కలిసి గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుండగా ఖమ్మం దాటిన తర్వాత మధిరకు సమీపంలో ఆమెకు పురిటినొప్పులు ఎక్కువ కావడంతో రైలులోనే ప్రసవించింది. వెంటనే ఆమెను మధిర రైల్వేస్టేషన్‌లో దింపి స్టేషన్‌మాస్టర్ 108కు సమాచారం అందించారు. 108 ఈఎంటీ సురేశ్, పైలట్ రామారావు ఆమెకు ప్రాథమిక చికిత్స నిర్వహించి మధిర ప్రభుత్వ సివిల్ దవాఖానకు తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

## చెట్టును ఢీకొన్న కారు.. ఏడుగురికి తీవ్రగాయాలు

వనదేవతల దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం
క్షతగాత్రులంతా హైదరాబాద్ నగరవాసులు

**తాడ్వాయి (ములుగు) :** మేడారం వనదేవతల దర్శనానికి వెళ్తున్న కారు చెట్టును ఢీకొనడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. ములుగు జిల్లా తాడ్వాయి సమీపంలో 163వ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో హైదరాబాద్‌లోని లంగర్‌హౌజ్‌కు చెందిన ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. జగ్గుల గోపమ్మ, శ్రీకాంత్, రాహుల్, కృష్ణవేణి, కల్యాణి, లావణ్య, రాణి కారులో మేడారం సమ్మక్క-సారక్కల దర్శనానికి బయలుదేరారు. గోవిందరావుపేట మండలంలోని పస్రా నుంచి మేడారానికి దారి ఉన్నప్పటికీ తెలియక తాడ్వాయి మీదుగా మేడారం వెళ్తుండగా తాడ్వాయి సమీపంలో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాహుల్, లావణ్య పరిస్థితి విషమంగా ఉన్నది. క్షతగాత్రులను తాడ్వాయి ఎస్సై రవీందర్ 108 వాహనంలో దవాఖానకు తరలించారు.



కోహెడ మండల పోరెడ్డిపల్లి చెక్‌డ్యాంలో గంగమ్మకు పూజచేస్తున్న మంత్రి హరీశ్‌రావు

## పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి

సిద్దిపేట నెక్లెస్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట కోమటి చెరువు వద్ద నెక్లెస్‌రోడ్డు నిర్మాణ పనులకు, టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో మిట్టపల్లి శివారులో రూ.17.50కోట్లతో నిర్మించనున్న ఇండస్ట్రియల్ పార్కు రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మందపల్లి పారిశ్రామికవాడలో 322 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేశామని, ఇందులో 6 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. అంబికా అగర్‌బత్తి పరిశ్రమ ఏర్పాటుతో 3 వేల మంది మహిళలకు ఉపాధి లభిస్తుందని, పెన్నార్ పరిశ్రమలో 400 మందికి, డీఎక్స్‌ఎన్‌లో 900 మందికి ఉపాధి లభించనుందన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో 2017-18 యాసంగి సీజన్ మార్కెటింగ్ కమీషన్ రూ.1.85 కోట్లను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అందజేశారు. నంగునూరు మండలం అక్కెనపల్లి పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం, బస్వాపూర్ వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం వద్ద గంగమ్మతల్లికి పూజలు చేశారు.

# సాఫీగా ప్రజారవాణా

## యథావిధిగా నడుస్తున్న బస్సులు

ఇబ్బందులు లేకుండా ప్రయాణాలు
మారుమూల గ్రామాలకు సర్వీసులు ■ కనిపించని సమ్మె ప్రభావం



నిర్మల్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** ఆర్టీసీ సమ్మె ప్రభావం లేకుండా ప్రజారవాణా సాఫీగా కొనసాగుతున్నది. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ చర్యలతో ప్రయాణికులు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం కూడా బస్సు సర్వీసులు ప్రజలను గమ్యస్థానాలకు చేర్చగా, క్రమేపీ సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి.

**పల్లెపల్లెకూ వెళ్తున్న బస్సులు..**
కరీంనగర్ రీజియన్ పరిధిలో ఆదివారం 99.39 శాతం బస్సులు నడిపారు. 656 బస్సులకు 652 బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశారు. 458 ఆర్టీసీ, 194 అద్దె బస్సులు ఉన్నాయి. 503 బస్సుల్లో టిమ్స్, వంద బస్సుల్లో టికెట్ల ద్వారా చార్జీలు వసూలు చేసినట్టు ఆర్‌ఎం జీవన్‌ప్రసాద్ తెలిపారు. మెదక్ రీజియన్ పరిధిలో 524 బస్సులు ప్రయాణికులకు సేవలందించాయి. అందులో 366 ఆర్టీసీ, 158 ప్రైవేట్ బస్సులు తిరిగాయి. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల నుంచి ఆదివారం 180 నడిచాయి. ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోల్లో బస్సులు యథావిధిగా నడిచాయి. ఖమ్మం డిపోలో 103, మధిరలో 51, సత్తుపల్లి డిపోలో 103 బస్సులు నడిచాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్, ఖమ్మం, విజయవాడ, వరంగల్, మిర్యాలగూడ ప్రాంతాలకు బస్సులు వెళ్లాయి. కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం పరిధిలో 180 ఆర్టీసీ బస్సులు, 64 అద్దె బస్సులు ప్రజలకు సేవలందించాయి.

**ఉమ్మడి పాలమూరులో..**
మహబూబ్‌నగర్‌లో ఆదివారం 72 ఆర్టీసీ, 37 అద్దెబస్సులతోపాటు 20 ప్రైవేటు వాహనాలు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాయి. నారాయణపేట డిపో పరిధిలో 45 ఆర్టీసీ, 34 అద్దె బస్సులు దాదాపు 12 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాయి. వనపర్తి జిల్లాలో ఆదివారం వంద శాతం ఆర్టీసీ బస్సులు తిరిగాయి. 38 గ్రామాలకు సర్వీసులను నడిపారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆదివారం 95 బస్సు సర్వీసులు ప్రయాణికులను గమ్యస్థానాలకు తీసుకెళ్లాయి. విద్యార్థుల సౌకర్యార్థం 16 నైట్‌హాల్ట్ బస్సులు ఆయా ప్రాంతాలకు వెళ్లాయి.
✦ నిర్మల్ జిల్లాలోని నిర్మల్, భైంసా డిపో ల పరిధిలో 115 ఆర్టీసీ,76 అద్దె బస్సులు, 111 ప్రైవేటు వాహనాలు నడిపారు. సూర్యాపేట డిపో పరిధిలో 43 ఆర్టీసీ, 45 అద్దె బస్సులను నడిపారు. చిన్న చిన్న సమస్యల కారణంగా పక్కకు పెట్టిన బస్సులకు మరమ్మతులు చేసి సోమవారం నుంచి మరో పది బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు. కోదాడ డిపో పరిధి లో 44 ఆర్టీసీ, 29 అద్దె బస్సులను ఆయా రూట్లలో నడిపించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట డిపో పరిధిలో 60 ఆర్టీసీ, 15 అద్దె బస్సులు, 58 ప్రైవేట్ బస్సులు పరుగులు తీశాయి. సూపర్ లగ్జరీ బస్సు సేవలు అందుబాటులోకి రావడంతో దూర ప్రాంతాలకు వెళ్లే వారికి ఉపశమనం లభించింది.

**వరంగల్ రీజియన్‌లో..**
వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో 866 బస్సులుండగా, ఆదివారం 708 బస్సులను నడిపించారు. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులను తిప్పారు. 80 శాతం బస్సుల్లో టికెట్లు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతున్నది. నిజామాబాద్ రీజియన్ పరిధిలో ఆదివారం బస్సులు యథావిధిగా నడిచాయి. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 273 బస్సులు, కామారెడ్డి జిల్లాలో 178 బస్సులు నడిచాయి.



ఆదివారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బస్సులో వెళ్తున్న ప్రయాణికులు



గద్వాల బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



సిద్దిపేట పాత బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



జనగామలో జిల్లాస్థాయి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో ఎంపీ దయాకర్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## పకడ్బందీగా ధాన్యం, పత్తి కొనుగోళ్లు

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి

**జనగామ, నమస్తేతెలంగాణ:** జనగామ జిల్లాలో ఈసారి రికార్డుస్థాయిలో రాబోతున్న వరి ధాన్యం, పత్తి పంట ఉత్పత్తుల కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశించారు. ప్రభుత్వరంగ సంస్థల ద్వారా వానకాలం ధాన్యం, పత్తి కొనుగోళ్లపై వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ, సీసీఐ, రైస్ మిల్లులు, జిన్నింగ్ మిల్లులు, ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సమన్వయ సమితిలు, ప్రజాప్రతినిధులకు ఆదివారం జనగామలోని బీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దయవల్ల కరువుగడ్డ జనగామ జిల్లాలో దేవాదుల ప్రాజెక్టు, చెక్‌డ్యాంలు, మిషన్ కాకతీయతో జలవనరులు గణనీయంగా పెరిగి తాగు, సాగునీటి ఇబ్బందులు తొలగాయన్నారు. అంచనాకు మించి సాగు విస్తీర్ణం పెరిగి అధిక దిగుబడికి అనుగుణంగా ఐకేపీ, సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తేమ, తాలు లేకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్రానికి వచ్చిన తర్వాత సాకులు చూపి రైతులను ఇబ్బందులు పెడితే ఊరుకునేది లేదని మంత్రి హెచ్చరించారు. సదస్సులో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, జీసీసీ చైర్మన్ గాంధీనాయక్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, డీసీపీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రైతులే రాజులు



నారాయణపేట జిల్లా మక్తల్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

■ జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేస్తాం
■ ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**నారాయణపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో రైతులే రాజులుగా విరాజిల్లుతున్నారని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని మార్కెట్‌యార్డు ప్రాంగణంలో రూ.కోటి 80 లక్షల వ్యయంతో నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని ఆదివారం రాత్రి జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుపడుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ భావించి వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని తెలిపారు. నారాయణపేట జిల్లా అభివృద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేస్తామని మంత్రి చెప్పారు. కృష్ణా మండలంలో మరో మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా రైతు సంఘం సభ్యురాలు సుచరితారెడ్డి, మక్తల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుగౌడ్, మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరు వీఆర్వోలు, ఆర్‌ఐపై
## సస్పెన్షన్ వేటు

**మద్దూరు :** కల్యాణలక్ష్మి పథకాన్ని అనర్హులకు మంజూరు చేయాలని సిఫారసు చేసిన ఇద్దరు వీఆర్వోలు, ఓ ఆర్‌ఐపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో ఇటీవల మంజూరైన కల్యాణలక్ష్మి పథకం అనర్హులకు మంజూరైందని అధికారులకు ఫిర్యాదులు అందాయి. విషయం కలెక్టర్ వెంకట్రావు దృష్టికి వెళ్లగా విచా రణకు అధికారులను ఆదేశించారు. నారాయణపేట ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి గ్రామ స్థాయిలో విచారణ చేపట్టారు. అనర్హులకు కల్యాణలక్ష్మి పథకానికి సిఫారసు చేసి మంజూరయ్యేందుకు కారణమైన వీఆర్వోలు శివరాములు, బాలకృష్ణారెడ్డి, ఆర్‌ఐ మల్లేశ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## శ్రీరాంసాగర్‌కు భారీగా వరద

■ మహారాష్ట్ర నుంచి 38,216 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
■ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్న ఎస్సారెస్పీ

**మెండోరా :** మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో వస్తున్న వరద కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారుతున్నది. మూడేండ్ల తర్వాత ప్రాజెక్టు నుంచి దిగువకు వదులుతున్నారు. ఆదివారం 6 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వానకాలం సీజన్ ప్రారంభమైన జూలై, ఆగస్టు నెలల్లో ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో వరద రాలేదు. సెప్టెంబర్‌లో భారీగా ఇన్‌ఫ్లో కొనసాగడంతో క్రమేపీ జలకళ సంతరించుకొన్నది. ఎగువన మహారాష్ట్రలోని విష్ణుపురి, బాలేగావ్, అముదుర, గైక్వాడ్, బాబ్లీ ప్రాజెక్టులు నిండటంతో దిగువకు నీటిని వదిలారు. దీనికితోడు నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోని గోదావరి పరీవాహకంలో భారీగా వర్షాలు కురవడంతో ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొన్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా, ఆదివారం రాత్రికి ప్రాజెక్టు నీటిమట్టం 1091.00 అడుగులకు చేరుకొన్నది. దీంతో అధికారులు కాకతీయ కాల్వకు నీటిని వదిలారు. కాల్వకు అనుసంధానంగా ఉన్న జలవిద్యుదుత్పత్తి కేంద్రంలోని మూడు టర్బయిన్లతో 22.8 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

**లక్ష్మీ, సరస్వతి బరాజ్‌ల గేట్ల ఎత్తివేత**
**మహదేవపూర్/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్ 5 గేట్లను ఆదివారం ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మహారాష్ట్రలో కురిసిన వర్షాల కారణంగా ప్రాణహిత నది వరద గోదావరిలో చేరుతున్నది. ఉదయం 8 గంటలకు సరస్వతీ(అన్నారం)బరాజ్‌కు 23,500 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండటంతో ఆరు గేట్లు ఎత్తి 27 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. సాయంత్రం 4.50 గంటలకు 46,500 క్యూసెక్కుల ప్రవాహం రాగా 15 గేట్లు ఎత్తి 82,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బరాజ్‌లో 9.47 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఇంజినీర్లు తెలిపారు.

**కృష్ణకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లోలు**
**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ /అయిజ, నందికొండ/సూర్యాపేట రూరల్:** కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు కొనసాగుతున్నాయి. కర్ణాటకలో కురుస్తు న్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపుర, జూరాలకు వరద స్థిరంగా వస్తున్నది. జూరాలకు 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 14,235 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. జూరాల నుంచి 29,251 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 8,958 క్యూసెక్కుల వరద వస్తుండగా, శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 883 (208 టీఎంసీలు) అడుగులకు చేరుకొన్నది. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 590 అడుగులకుగాను ఆదివారం సాయంత్రానికి 588.80 (308.4658 టీఎంసీలు) అడుగులుగా ఉన్నది. ఎగువ నుంచి 15,729 క్యూసెక్కుల వరద వస్తుండగా, అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు.

**మూసీ 2 గేట్లు ఎత్తి నీటి విడుదల**
మూసీ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని 645 అడుగుల నుంచి 635 అడుగులకు తగ్గించారు. ఆదివారం 5,400 క్యూసెక్కులు రావడంతో రాత్రి 10గంటలకు 2 గేట్లను ఎత్తి 1,450 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

# ఏడు జిల్లాల్లో భారీ వర్షం

మరో నాలుగు జిల్లాల్లో ఓ మోస్తరు ■ పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
అత్యధికంగా భూపాలపల్లి జిల్లా గణపురంలో 11.2 సెం.మీ. వర్షపాతం

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తన ద్రోణుల ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలతోపాటు గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షం కురువగా ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, సూర్యాపేట జిల్లాల్లో ఓ మోస్తరు వాన పడింది. ములుగు జిల్లా మేడారంలో వరద నీటిలో నుంచి వెళ్తుండగా విద్యుదాఘాతానికి రైతు మృతిచెందాడు. అత్యధికంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో 11.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భారీగా..**
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. గణపురం మండలంలో మోరంచవాగు పొంగిపొర్లుతున్నది. మహాముత్తారం మండలంలో దౌతుపల్లి వాగు బ్రిడ్జిపై నుంచి నీరు పొంగుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఓపెన్‌కాస్టు సెక్టార్- 2లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

**ములుగులో కుండపోత..**
ములుగు జిల్లాలో కురిసిన కుండపోత వర్షంతో వాగులు పొంగిపొర్లాయి. తాడ్వాయి మండలం మేడారంలో వరద నీటిలో విద్యుత్ తీగ పడటంతో విద్యుదాఘాతానికిగురై రైతు కడారి లక్ష్మీనారాయణ మృతిచెందాడు. గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సు మళ్లీ అలుగుపోసింది. ఏటూరునాగారం మండలంలో 9.7 సెం.మీ., వెంకటాపురం (నూగూరు)లో 9.4 సెం.మీ., మంగపేటలో 8.6 సెం.మీ., గోవిందరావుపేటలో 8.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు మత్తడిపోస్తున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు సైదాపూర్, శంకరపట్నం, హుజూరాబాద్, జమ్మికుంట మండలాల పరిధిలోని వాగులు పొంగుతున్నాయి. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ధర్మారం మండలాల్లోని దాదాపు 500 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంతోపాటు వేములవాడ, వీర్నపల్లి, ఇల్లంతకుంట, గంభీరావుపేటలో అరగంటపాటు ఓ మోస్తరు వర్షం పడింది. ఖమ్మం నగరంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా కోదాడలో 2.5 సెం.మీ, చిలుకూరు 1.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు చోట్ల, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది.

**గ్రేటర్ హైదరాబాద్‌లో భారీగా..**
**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఉపరితల ఆవర్తన ద్రోణుల ప్రభావంతో గత రెండు రోజులుగా గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి గ్రేటర్‌వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. చాంద్రాయణగుట్ట, బండ్లగూడలో 4.2 సెం.మీ., చార్మినార్‌లో 4 సెం.మీ., మలక్‌పేటలో 3.7 సెం.మీ., ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, షేక్‌పేటలో 3.4 సెం.మీ., శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్‌లో 3.3 సెం.మీ., రాజేంద్రనగర్‌లో 3.0 సెం.మీ. వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

**మరో రెండ్రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు**
**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మరో రెండు రోజులు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశమున్నట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తూర్పు మధ్య అరేబియా సముద్రంలో అల్పపీడనం స్థిరంగా కొనసాగుతున్నదని, దీనికి అనుబంధంగా 4, 5 కి.మీ. ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించిందని, తూర్పు మధ్య అరేబియా సముద్రం నుంచి ఉత్తర కర్ణాటక, తెలంగాణ మీదుగా విదర్భ వరకు ఉపరితల ద్రోణి ఏర్పడినట్టు వారు పేర్కొన్నారు. కోమారిన్ ప్రాంతం నుంచి ఉత్తర కోస్తా ఆంధ్రా వరకు మరో అల్పపీడన ద్రోణి ఏర్పడింది. ఈ ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వారు తెలిపారు.

**వచ్చే ఐదు రోజులు గ్రేటర్ హైదరాబాద్‌లో..**
అరేబియా సముద్రం నుంచి కర్ణాటక, తెలంగాణ మీదుగా విదర్భా వరకు, వే ఆఫ్ బెంగాల్ నుంచి ఉత్తర కోస్తాంధ్ర వరకు రెండు వేర్వేరు ఉపరితల ఆవర్తన ద్రోణులు ఏర్పడటంతో వాటి ప్రభావంతో రాగల ఐదు రోజులు గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



గ్రేటర్ హైదరాబాద్ హాకీంపేటలోని ఓ వీధిలో ప్రవహిస్తున్న వర్షపునీరు





భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు.. ములుగు జిల్లా వెంకటాపురంలో నీట మునిగిన మిర్చి పంట



చౌట్‌పల్లిలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి

## కరంటు కష్టాలు తీర్చిన ఏకైక సీఎం కేసీఆర్

■ చౌట్‌పల్లిలో సబ్‌స్టేషన్ ప్రారంభించిన మంత్రి వేముల
■ సీఎం కేసీఆర్ నీళ్ల బాహుబలి: మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి

**కమ్మర్‌పల్లి, నమస్తే తెలంగాణ:** తెలంగాణ కరంటు కష్టాలను తీర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన దత్తత గ్రామం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లిలో రూ.1.60 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కరంటు సరిపడా ఇవ్వక ఇబ్బందులకు గురిచేశారని మంత్రి ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇచ్చేస్థాయికి వచ్చామన్నారు. సీఎం కేసీఆర్ నీళ్ల బాహుబలి అని మాజీ స్పీకర్ కేఆర్ సురేశ్‌రెడ్డి ప్రశంసించారు. సీఎంతో మాట్లాడి ఈ ప్రాంతానికి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ తేవాలని మంత్రిని కోరారు.

## బిడ్డ మరణాన్ని తట్టుకోలేక తల్లి ఆత్మహత్య

సంగారెడ్డి జిల్లా చెర్లగూడెంలో విషాదం

**సంగారెడ్డి టౌన్:** ఆర్థిక ఇబ్బందులకు తల్లీకూతురు బలయ్యారు. కంది మండలం చెర్లగూడెంకు చెందిన మాశెట్టి నాగమ్మ (40) ఆరోగ్యం క్షీణించి, ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కూతురు నాగమ్మ మరణాన్ని తట్టుకోలేని ఆమె తల్లి అలకుంట గంగమ్మ (70) శనివారం అర్ధరాత్రి అదే ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

# రాంబో రోహిత్

**తొలి టెస్టులో మయాంక్.. రెండో మ్యాచ్‌లో విరాట్.. ఇప్పుడు రోహిత్. భారత బ్యాట్స్‌మెన్ డబుల్ సెంచరీల జోరు కొనసాగుతున్నది. టాస్ నెగ్గితే బ్యాటింగ్ ఎంచుకోవడం.. ఐదు సెషన్‌ల పాటు దంచికొట్టడం.. రెండో రోజు చివర్లో ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించి టాపార్డర్‌ను దెబ్బ తీయడం. గత కొన్నేళ్లుగా సొంతగడ్డపై టీమ్‌ఇండియా గేమ్‌ప్లాన్ ఇది. దీనికి అత్యుత్తమ ఉదాహరణ తాజా సిరీస్ అని చెప్పొచ్చు. వైజాగ్, పుణెలో మాదిరే తొలి ఇన్నింగ్స్‌లో కొండంత స్కోరు చేసిన కోహ్లీ సేన.. ప్రత్యర్థి రెండు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌పై పట్టు బిగించింది. మిడిలార్డర్ నుంచి ఓపెనర్‌గా ప్రమోషన్ పొందాకే వన్డేల్లో విజృంభించి మూడు ద్విశతకాలు మాదిన హిట్‌మ్యాన్.. సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ ఓపెనర్‌గా బరిలో దిగిన తొలి సిరీస్‌లోనే డబుల్ వీరుల జాబితాలో చేరిపోయాడు.**

## ద్విశతకంతో దుమ్మురేపిన నయా ఓపెనర్

### శతక్కొట్టిన రహానే.. భారత్ తొలి ఇన్నింగ్స్ 497/9 డిక్లేర్డ్ .. దక్షిణాఫ్రికా 9/2


రహానే (115)


రోహిత్ (212)

**3** సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్ తర్వాత వన్డే, టెస్టు ఫార్మాట్స్‌లో డబుల్ సెంచరీ చేసిన మూడో భారత బ్యాట్స్‌మన్‌గా రోహిత్ నిలిచాడు.

**రాంచీ:** వరుణుడి కారణంగా తొలి రెండు రోజుల్లో రెండు సెషన్‌ల ఆట తుడిచిపెట్టుకు పోయినా.. మూడో టెస్టుపై భారత్ పట్టు బిగించింది. సూపర్ ఫామ్‌లో ఉన్న రోహిత్ శర్మ (255 బంతుల్లో 212; 28 ఫోర్లు, 6 సిక్సర్లు) టెస్టు క్రికెట్‌లో తొలి డబుల్ సెంచరీ నమోదు చేసుకోగా.. వైస్ కెప్టెన్ అజింక్య రహానే (192 బంతుల్లో 115; 17 ఫోర్లు, 1 సిక్స్) మూడేండ్ల తర్వాత సొంతగడ్డపై శతకం బాదాడు. ఫలితంగా టీమ్‌ఇండియా 116.3 ఓవర్లలో 9 వికెట్లకు 497 పరుగులు చేసి తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (51) అర్ధశతకంతో మెరిస్తే.. పేసర్ ఉమేశ్ యాదవ్ (10 బంతుల్లో 31; 5 సిక్సర్లు) సిక్సర్ల వర్షం కురిపించాడు. సఫారీ బౌలర్లలో లిండే 4, రబాడ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా వెలుతురులేమి కారణంగా ఆదివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 9 పరుగులు చేసింది. షమీ (1/0), ఉమేశ్ (1/4) ధాటికి.. ఎల్గర్ (0), డికాక్ (4) పెవిలియన్ చేరారు. చేతిలో 8 వికెట్లు ఉన్న ప్రొటీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 488 పరుగులు వెనుకబడి ఉంది. నైట్ వాచ్‌మన్ హమ్జ (0), కెప్టెన్ డుప్లెసిస్ (1) క్రీజులో ఉన్నారు.

**మూడేండ్ల తర్వాత..**

కొత్త అవతారమెత్తిన రోహిత్ శర్మ.. ఫార్మాట్ ఏదైనా ఓపెనింగ్‌లో తనకు తిరుగులేదని నిరూపించుకుంటున్నాడు. తొలి రోజే సెంచరీ పూర్తి చేసుకున్న హిట్‌మ్యాన్.. రెండో రోజు దాన్ని డబుల్ సెంచరీగా మలిచాడు. తొలి సెషన్‌లో బంతి పేసర్లకు అనుకూలిస్తున్నా.. రోహిత్ ఎక్కడా తగ్గలేదు. ఓవర్‌కో బౌండ్రీ చొప్పున కొడుతూ చూస్తుండగానే 150 మార్క్ దాటాడు. మరో ఎండ్‌లో చక్కటి క్రికెటింగ్ షాట్స్‌తో అలరించిన రహానే 169 బంతుల్లో 11వ టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 2016 అక్టోబర్‌లో న్యూజిలాండ్‌పై సెంచరీ చేసిన అనంతరం సొంతగడ్డపై జింక్స్‌కు ఇదే తొలి శతకం. ఆ తర్వాత కూడా ఈ జోడీ నిలకడ కొనసాగించడంతో భారత్‌కు తిరుగులేకుండా పోయింది. అయితే నాలుగో వికెట్‌కు 267 పరుగులు జోడించాక లిండే బౌలింగ్‌లో రహానే.. కీపర్ క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో లిండేకు ఇదే తొలి వికెట్ కాగా.. క్లాసెన్‌కు కూడా ఇదే తొలి క్యాచ్. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన జడేజా సహకారంతో రోహిత్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. రోహిత్ డబుల్ సెంచరీకి ఒక్క పరుగు దూరంతో లంచ్ విరామానికి వెళ్లాడు.


లిండే (4/133)

**సిక్సర్‌తో డబుల్**

రెండో సెషన్‌లో ఎంగ్డీ వేసిన తొలి ఓవర్‌ను రోహిత్ మెయిడెన్‌గా ఆడాడు. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ పెరిగిపోయింది. మరుసటి ఓవర్‌లో జడేజా కూడా ఒక్క పరుగు చేయలేకపోయాడు. మూడో ఓవర్ తొలి బంతిని స్క్వేర్ లెగ్ దిశగా గీత దాటించిన రోహిత్ టెస్టు కెరీర్‌లో తొలి ద్విశతకం పూర్తి చేసుకున్నాడు. దీంతో వన్డే, టెస్టుల్లో డబుల్ సెంచరీ చేసిన బ్యాట్స్‌మన్‌గా సచిన్ టెండూల్కర్, సెహ్వాగ్, క్రిస్ గేల్ సరసన చేరాడు. కాసేపటికే రబాడ బౌలింగ్ బౌండ్రీ వద్ద ఎంగ్డీకి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అయితే రోహిత్ పెవిలియన్ చేరుతున్న సమయంలో దక్షిణాఫ్రికా ఆటగాళ్లంతా అతడితో కరచాలనం చేయడం ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ దశలో సాహా (24), జడేజా నెమ్మదిగా ఆడటంతో పరుగుల వేగం మందగించింది. టీమ్ స్కోరు 400 దాటాక సాహా ఔటయ్యాడు. కొన్ని చక్కటి షాట్లు కొట్టిన జడేజా వరుసగా రెండో టెస్టులో అర్ధశతకం పూర్తి చేసుకున్న వెంటనే వెనుదిరిగాడు. ఆ తర్వాత ఉమేశ్ ధాటిగా ఆడటంతో భారత్ భారీ స్కోరు వైపు సాగింది. మబ్బులు కమ్మేయడంతో పాటు సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఆలౌట్ కాని ఘనతను కొనసాగించేందుకు భారత సారథి 497/9 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు. అదే సమయంలో అంపైర్లు టీ విరామం ప్రకటించారు.

**బౌన్స్‌తో బోల్తా**

చివరి సెషన్‌లో బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికాకు రెండో బంతికే షాక్ తగిలింది. షమీ వేసిన బంతి ఎల్గర్ గ్లోజ్‌ను ముద్దాడుతూ వెళ్లి సాహా చేతిలో పడింది. ఎక్కువ ఎత్తులో వచ్చిన బంతిని వృద్ధిమాన్ చక్కగా ఒడిసిపట్టాడు. రెండో ఓవర్‌లో డికాక్‌ను ఉమేశ్ కూడా బౌన్స్‌తోనే బోల్తా కొట్టించాడు. బ్యాటింగ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన వికెట్‌కీపర్ సాహా ఈ రెండు క్యాచ్‌లను అందుకున్న తీరు సూపర్. నైట్ వాచ్‌మన్ హమ్జతో కలిసి కెప్టెన్ డుప్లెసిస్ మరో వికెట్ పడకుండా చూసుకోగా.. వెలుతురులేమి కారణంగా టీ తర్వాత కేవలం 5 ఓవర్ల ఆట సాధ్యమైంది.

### శివాలెత్తిన ఉమేశ్..


ఉమేశ్ (31)

పుణె టెస్టులో బంతితో ప్రత్యర్థిని గడగడలాడించిన భారత పేసర్ ఉమేశ్ యాదవ్ తాజా మ్యాచ్‌లో బ్యాట్‌తో గర్జించాడు. 10 బంతుల్లో 5 సిక్సర్లతో 31 పరుగులు సాధించి టెస్టు క్రికెట్‌లో తన అత్యధిక స్కోరు నమోదు చేసుకున్నాడు. జడేజా ఔట్ కావడంతో కేజులోకి వచ్చిన ఉమేశ్.. లిండే బౌలింగ్‌లో ఎదుర్కొన్న తొలి రెండు బంతులను సిక్సర్లుగా మలిచాడు. అదే బౌలర్ తదుపరి ఓవర్‌లోనూ ఉమేశ్ విజృంభించాడు. ఐదు బంతుల వ్యవధిలో మరో మూడు భారీ సిక్సర్లు బాదాడు. అతడి సిక్సర్ల హోరును డ్రెస్సింగ్ రూమ్ నుంచి కోహ్లీ తెగ ఎంజాయ్ చేశాడు. అయితే అదే ఊపులో మరోభారీ షాట్ ఆడేందుకు యత్నించిన ఉమేశ్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఈ క్రమంలో టెస్టు క్రికెట్‌లో అత్యంత వేగంగా 30 పరుగులు (9 బంతుల్లో) చేసిన జాబితాలో స్టీఫెన్ ఫ్లెమింగ్ (10 బంతుల్లో 30 పరుగులు)ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి చేరాడు. అలాగే 10 బంతులకు పైగా ఆడిన వారిలో అత్యధిక స్ట్రయిక్ రేట్ (310.00) రికార్డు కూడా తన పేరిట రాసుకున్నాడు.

### 64 ఏండ్ల తర్వాత..

ద్వైపాక్షిక సిరీస్‌లో భారత బ్యాట్స్‌మెన్ 3 డబుల్ సెంచరీలు చేయడం 64 ఏండ్ల తర్వాత ఇదే తొలిసారి. ఈ సిరీస్ తొలి టెస్టులో మయాంక్ ద్విశతకం బాదితే.. రెండో టెస్టులో ఆ బాధ్యత కోహ్లీ భుజానెత్తుకున్నాడు. తాజా టెస్టులో రోహిత్ అదే ఫీట్ రిపీట్ చేశాడు. 1955-56 సీజన్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్ బ్యాట్స్‌మెన్ 3 డబుల్ సెంచరీలు బాదారు. వీనూ మన్కడ్ రెండు ద్విశతకాలు కొడితే.. పాలీ ఉమ్రిగర్ ఓ డబుల్ తన పేరిట రాసుకున్నాడు. ఆ తర్వాత దాదాపు ఆరున్నర దశాబ్దాల అనంతరం ఇప్పుడు సఫారీలపై మళ్లీ అలాంటి ఘనత నమోదైంది.

### స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** మయాంక్ (సి) ఎల్గర్ (బి) రబాడ 10, రోహిత్ (సి) ఎంగ్డీ (బి) రబాడ 212, పుజారా (ఎల్బీ) రబాడ 0, కోహ్లీ (ఎల్బీ) నోర్జే 12, రహానే (సి) క్లాసెన్ (బి) లిండే 115, జడేజా (సి) క్లాసెన్ (బి) లిండే 51, సాహా (బి) లిండే 24, అశ్విన్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) పీట్ 14, ఉమేశ్ (సి) క్లాసెన్ (బి) లిండే 31, నదీమ్ (నాటౌట్) 1, షమీ (నాటౌట్) 10, **ఎక్స్‌ట్రాలు:** 17, **మొత్తం:** 116.3 ఓవర్లలో 497/9 డిక్లేర్డ్. **వికెట్ల పతనం:** 1-12, 2-16, 3-394-306, 5-370, 6-417, 7-450, 8-464, 9-482, **బౌలింగ్:** రబాడ 23-7-85-3, ఎంగ్డీ 20-5-83-0, నోర్జే 24.3-5-79-1, లిండే 31-2-133-4, పీట్ 18-3-101-1.

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** ఎల్గర్ (సి) సాహా (బి) షమీ 0, డికాక్ (సి) సాహా (బి) ఉమేశ్ 4, హమ్జ (నాటౌట్) 0, డుప్లెసిస్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు:** 4, **మొత్తం:** 5 ఓవర్లలో 9/2. **వికెట్ల పతనం:** 1-4, 2-8, **బౌలింగ్:** షమీ 1-1-0-1, ఉమేశ్ 1-0-4-1, నదీమ్ 2-2-0-0, జడేజా 1-0-1-0.

### అచ్చం అతడిలానే..

**వ్యక్తిగత** మైలురాళ్లకు ఏమాత్రం ప్రాధాన్యతనివ్వని క్రికెటర్ ఎవరంటే టక్కున గుర్తొచ్చే పేరు వీరేంద్ర సెహ్వాగ్. బ్యాటింగ్ చేస్తున్నది 99 పైనా.. 199 పైనా.. 299 పైనా అనేదానితో సంబంధం లేకుండా బంతిని బలంగా బాదేందుకే యత్నించే వీరూ.. గతంలో 299 పరుగుల వద్ద నిల్చొని సిక్సర్ ద్వారా ట్రిపుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అచ్చం అదే మైండ్‌సెట్‌తో దూసుకుపోతున్న రోహిత్ శర్మ తాజా మ్యాచ్‌లో అలాంటి ఆటతీరే కనబర్చాడు. తొలి రోజు 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు సిక్సర్‌తో సెంచరీ మార్క్ దాటిన హిట్‌మ్యాన్.. రెండో రోజు 199 పరుగుల వద్ద ఎంగ్డీ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి టెస్టు క్రికెట్‌లో తొలి డబుల్ సెంచరీ నమోదు చేసుకున్నాడు. 41వ పుట్టినరోజు నాడు (ఆదివారం) సెహ్వాగ్‌కు ఇంతకు మించి శుభాకాంక్షలు చెప్పినవారు మరొకరు లేరంటే అతిశయోక్తి కాదేమో.

## మెదక్‌కు మొదటి స్థానం


మెదక్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు, జడ్పీ అధ్యక్షురాలు రోజాశర్మ

**సిద్దిపేట ఎడ్యుకేషన్:** రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో మెదక్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో మెదక్ టాప్ ప్లేస్ సాధిస్తే.. నిజామాబాద్, రంగారెడ్డి వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. అండర్-14 విభాగంలోనూ మెదక్ ముందు వరుసలో నిలిచింది. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్థిక మంత్రి హరీశ్ రావు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 28 మంది క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గ్యాదరి భిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రవికాంత్ రావు, యోగా రాష్ట్ర పరిశీలకులు కమలాకర్, జడ్పీ అధ్యక్షురాలు వేలేటి రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.

## చాంపియన్ నల్లగొండ

### ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ


విజేతగా నిలిచిన నల్లగొండ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

**నిర్మల్ అర్బన్, నమస్తే తెలంగాణ:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల వాలీబాల్ టోర్నీలో నల్లగొండ జట్టు విజేతగా నిలిచింది. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం జరిగిన తుదిపోరులో నల్లగొండ జట్టు 25-13, 25-18తో నిజామాబాద్‌ను చిత్తుచేసి టైటిల్ పట్టింది. వరంగల్ టీమ్ మూడో స్థానం దక్కించుకుంది. పోటీల అనంతరం రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు.

## క్రీడాభివృద్ధికి పెద్దపీట

### క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్


సీఐఐ డైకిన్ తెలంగాణ క్రికెట్ కప్ ఫైనల్‌కు ముందు బ్యాటింగ్ చేస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్:** సీఎం కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నదని రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సీఐఐ డైకిన్ తెలంగాణ క్రికెట్ కప్-2019 ఫైనల్ మ్యాచ్‌ను నగరంలోని విజయ్ ఆనంద్ మైదానంలో ఆదివారం ఆయన ప్రారంభించారు. సరదాగా బ్యాట్ పట్టి క్రికెట్ ఆడిన అనంతరం మాట్లాడారు. హైదరాబాద్ క్రీడల హబ్‌గా మారిందని, అంతర్జాతీయ టోర్నీలకు వేదికవుతున్నదని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కొమరయ్య, సీఐఐ ప్రతినిధులు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు. సీఐఐ క్రికెట్ కప్ గత నెల 21న ప్రారంభం కాగా, దేశవ్యాప్తంగా దాదాపు 32 కార్పొరేట్ సంస్థలకు చెందిన జట్లు పోటీ పడ్డాయి. కార్వీ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ జట్లు ఫైనల్లో తలపడ్డాయి.



## ఆసీస్ మెంటార్‌గా మైక్ హస్సీ

**సిడ్నీ:** టీ20 ప్రపంచకప్ సమీపిస్తున్న నేపథ్యంలో ఆస్ట్రేలియా జట్టు యాజమాన్యం వ్యూహాలకు పదును పెట్టింది. ఈ క్రమంలో శ్రీలంక, పాకిస్థాన్‌తో జరిగే టీ20 సిరీస్‌ల కోసం మాజీ స్టార్ బ్యాట్స్‌మెన్, మిస్టర్ క్రికెట్ మైక్ హస్సీని ఆసీస్ జట్టుకు మెంటార్‌గా నియమించింది. వన్డే ప్రపంచకప్‌నకు మాజీ కెప్టెన్ పాంటింగ్, యాషెస్ సిరీస్‌కు స్టీవ్ వా మెంటార్‌లుగా వ్యవహరించగా.. పొట్టి ఫార్మాట్‌లో జట్టుకు హస్సీ సహకరించనున్నాడు. 'నేను చాలా సంతోషిస్తున్నా. ఆసీస్ జట్టుతో మరోసారి కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నా. ఆట శైలిని, ఆటగాళ్లకు కావాల్సిన వనరులను అభివృద్ధి చేసేందుకు పెద్ద టోర్నీ (టీ20 ప్రపంచకప్)కి ముందు సరైన వ్యూహాలను అమలు చేస్తుండడం మంచి విషయం' అని హస్సీ చెప్పాడు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 1 మధ్య శ్రీలంకతో స్వదేశంలో ఆసీస్ మూడు టీ20లు ఆడనుండగా, ఆ తర్వాత నవంబర్ 3 నుంచి 8 మధ్య పాక్‌తోనూ మూడు టీ20ల్లో తలపడనుంది. అలాగే ఈ సిరీస్‌లకు బౌలింగ్ కోచ్‌గా మాజీ పేసర్ హారిస్‌ను నియమించారు.

## ఇథియోపియన్లదే హవా

### చాంపియన్లుగా నిలిచిన బెలిహూ, గెమెచూ
### ఢిల్లీ హాఫ్‌మారథాన్


బెలిహూ

**న్యూఢిల్లీ:** ఢిల్లీ హాఫ్ మారథాన్ పురుషుల పోటీలో అండమాక్ బెలిహూ, మహిళల విభాగంలో సెహే గెమెచూ మరోసారి విజేతలుగా నిలిచారు. ఆదివారం దేశ రాజధానిలో జరిగిన హాఫ్ మారథాన్ (21 కిలోమీటర్ల)లో డిఫెండింగ్ చాంపియన్లుగా బరిలోకి దిగిన ఈ ఇద్దరు ఇథియోపియా అథ్లెట్లు వ్యక్తిగత రికార్డులను సైతం మెరుగుపరుచుకున్నారు. ఈ పోటీలను కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించగా.. అమెరికా దిగ్గజ స్ప్రింటర్ కార్మెలిటా జెటర్ హాజరైంది. గత ఏడాది 59 నిమిషాల 18 సెకన్లలో లక్ష్యాన్ని చేరిన బెలిహూ.. ఇప్పుడు అంతకంటే ఎనిమిది సెకన్ల ముందే టార్గెట్‌ను అధిగమించాడు. సోలోమాన్ బెరిహూ (59:17), కిబివోట్ కాన్‌డీ (59:33) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మహిళల పోటీలో గెమెచూ సైతం గతేడాది లక్ష్యాన్ని చేరేందుకు 66:50 సెకన్ల సమయాన్ని తీసుకోగా.. ఈసారి 66 నిమిషాల్లో గమ్యాన్ని చేరింది. ఒక్క సెకను తేడాతో యెలామ్‌జెర్ఫ్ రెండో స్థానానికి పరిమితం కాగా జెనెబా ఇమెర్ (66:57) మూడో స్థానంలో నిలిచింది. భారత్ నుంచి పురుషుల విభాగంలో శ్రీను బుగత (గంట 4నిమిషాల 33సెకన్లు).. మహిళల విభాగంలో ఎల్ సురియా (1:12:49) టాప్‌లో నిలిచారు.


గెమెచూ

## తొలి కిక్ కేరళదే

### అట్టహాసంగా ఐఎస్‌ఎల్ ప్రారంభం
### హాజరైన క్రీడా, సినీ తారలు

**కొచ్చి:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఆరో సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఆదివారం ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో కేరళ బ్లాస్టర్స్ 2-1తో కోల్‌కతా జట్టు ఏటీకేను ఓడించి, పాయింట్ల ఖాతా తెరిచింది. ఐర్లాండ్‌కు చెందిన ఏటీకే ఆటగాడు కార్ల్ మెక్‌హ్యూజ్ మ్యాచ్ ఆరో నిమిషంలో వచ్చిన ఫ్రీ కిక్‌ను గోల్‌గా మలిచి జట్టును ఆధిక్యంలో నిలిపాడు. అయితే నైజీరియన్ స్ట్రైకర్, కేరళ ఆటగాడు బార్తలోమే ఓగ్బెచే 30వ నిమిషంలో వచ్చిన పెనాల్టీ కార్నర్‌ను వాడుకొని స్కోరు సమం చేశాడు. మరోసారి 45వ నిమిషంలో అద్భుతమైన షాట్‌తో గోల్ సాధించి కేరళను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఇరు జట్లు హోరాహోరీగా తలపడినా గోల్ నమోదు కాకపోవడంతో అతిథ్య కేరళ విజయం సాధించింది. అంతకు ముందు ఐఎస్‌ఎల్ ప్రారంభ వేడుకలు ఘనంగా జరిగాయి. రిలయన్స్ ఫౌండేషన్



చైర్‌పర్సన్ నీతా అంబానీ ఐఎస్‌ఎల్‌ను ప్రారంభించగా... క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, బీసీసీఐకి కాబోయే అధ్యక్షుడు, ఏటీకే జట్టు సహ యజమాని సౌరవ్ గంగూలీ, మెగాస్టార్ చిరంజీవి, బాలీవుడ్ హీరోలు అభిషేక్ బచ్చన్, జాన్ అబ్రహం తదితరులు హాజరయ్యారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఇండియన్ డ్యాన్స్ గ్రూప్‌తో కలిసి బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్, హీరోయిన్ దిశా పటానీ చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోమవారం బెంగళూరు ఎఫ్‌సీ, నార్త్ ఈస్ట్ యునైటెడ్ మధ్య మ్యాచ్ జరుగనుంది.

## 23 నుంచి రాష్ట్ర సంఘాలకు నిధులు

**న్యూఢిల్లీ:** బీసీసీఐ పరిధిలోని రాష్ట్ర క్రికెట్ సంఘాలకు తీపికబురు వచ్చింది. ఈ నెల 23న జరిగే బీసీసీఐ వార్షిక సాధారణ సమావేశంలో సౌరవ్ గంగూలీ నేతృత్వంలోని కొత్త పాలకవర్గం కొలువుదీరాక రాష్ట్రాల సంఘాలకు పూర్తిస్థాయి వార్షిక నిధుల మంజూరు కానున్నాయి. ఏడాదికి ఒక్కో సంఘం రూ.35 కోట్ల వరకు పొందనుంది. లోధా కమిటీ సిఫారసుల మేరకు బీసీసీఐ రాజ్యాంగంలో సవరణలు జరిగినప్పటి నుంచి (మూడేండ్లు) రాష్ట్రాలకు నిధులు అందడం లేదు. దీంతో స్టేడియాల అభివృద్ధి సహా మరిన్ని పనులు నిలిచిపోగా, కొన్ని సంఘాలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల మొత్తంతో అభివృద్ధి పనులు చేపడుతున్నాయి. 'మూడేండ్లుగా కొన్ని సంఘాలకు నిధులు అందడం లేదు. ఇప్పుడు ఆ సంఘాలు రూ.105 కోట్లతో పాటు వడ్డీ కూడా రావాల్సి ఉంది' అని ఓ బీసీసీఐ సీనియర్ అధికారి చెప్పారు.

## సెమీస్‌లో కర్ణాటక, గుజరాత్

### రాణించిన కేఎల్ రాహుల్.. విజయ్ హజారే ట్రోఫీ


రాహుల్ (90)

**బెంగళూరు:** వరుస విజయాలతో సత్తాచాటిన కర్ణాటక, గుజరాత్ జట్లు దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ సెమీఫైనల్లో అడుగుపెట్టాయి. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌ల్లో కర్ణాటక 8వికెట్ల తేడాతో పుదుచ్చెరిపై విజయం సాధించగా, గుజరాత్ 6 వికెట్ల తేడాతో ఢిల్లీని చిత్తుచేసింది. కర్ణాటక బౌలర్లు ప్రవీణ్ దూబే (3/44), అభిమన్యు మిథున్ (2/35) చెలరేగడంతో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పుదుచ్చెరి టాపార్డర్ ఘోరంగా విఫలమై 41 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయినా.. సాగర్ త్రివేది (54), మరిముత్తు (58) అర్ధశతకాలతో రాణించడంతో 50 ఓవర్లలో 207 పరుగులు చేయగలిగింది. లక్ష్యఛేదనలో టీమ్‌ఇండియా బ్యాట్స్‌మన్ లోకేశ్ రాహుల్ (90) విజృంభించాడు. అతడితో పాటు మరో ఓపెనర్ పడిక్కల్ (50), రోహన్ కదమ్ (50నాటౌట్) హాఫ్ సెంచరీలు బాదడంతో కర్ణాటక 41 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి టార్గెట్‌ను ఛేదించింది. వర్షం కారణంగా 49ఓవర్లకు కుదించిన మరో క్వార్టర్స్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 223 పరుగులు చేసింది. స్టార్ ఓపెనర్ శిఖర్ ధావన్ (0) డకౌటై తీవ్రంగా నిరాశ పరిచినా.. కెప్టెన్ ధృవ్ షోరే (91) అద్భుతంగా ఆడాడు. లక్ష్యఛేదనలో గుజరాత్‌కు ఓపెనర్లు కెప్టెన్ పార్థివ్ పటేల్ (76), ప్రియాంక్ పంచల్ (80) అదరగొట్టడంతో ఆ జట్టు 37.5 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి గెలుపొందింది.

## కృష్ణ ప్రియకు కాంస్యం



**కైరో (ఈజిప్ట్):** తెలంగాణ యువ షట్లర్ కుదరవల్లి శ్రీకృష్ణ ప్రియ ఈజిప్ట్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో కాంస్య పతకం చేజిక్కించుకుంది. మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్‌గా బరిలోదిగిన కృష్ణ ప్రియ సెమీఫైనల్లో 16-21, 11-21తో రెండో సీడ్ జోర్డాన్ హర్ట్ (వేల్స్) చేతిలో ఓడి కాంస్యం కైవసం చేసుకుంది. అంతకుముందు తొలిరౌండ్‌లో కృష్ణ ప్రియ 21-6, 21-6తో సోహల్లాలి అబ్దెల్మాగిడ్ (ఈజిప్ట్)పై ఏకపక్ష విజయం సాధించింది. ఆ తర్వాత రెండో రౌండ్‌లోనూ 21-10, 21-13తో యాస్మిన్ చిబా (అల్జీరియా)ను ఓడించి క్వార్టర్స్‌కు చేరింది. క్వార్టర్స్‌లో కృష్ణ ప్రియ 21-10, 21-19 తేడా మూడో సీడ్ దొరియాస్ అజోక్ అడేసొకన్ (నైజీరియా)పై గెలిచి సెమీఫైనల్లో అడుగు పెట్టింది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత అన్‌సీడెడ్ ద్వయం కుహూ గార్గ్-ధ్రువ్ రావత్ టైటిల్‌ను దక్కించుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో గార్గ్-రావత్ జంట 21-16, 22-20తో మన దేశానికే చెందిన మూడో సీడ్ ఉత్కర్ష్-కరిష్మా జోడీపై నెగ్గింది.

## ఎస్బీఐ రూ.466 కోట్ల నిరర్థక ఆస్తుల వేలం

**నవంబర్ 7న నిర్వహించనున్న బ్యాంక్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)..11 మొండి బకాయిలకు సంబంధించిన ఆస్తులను వేలం వేయడానికి సిద్ధమవుతున్నది. రూ.466.49 కోట్ల రుణాలను తిరిగి వసూలు చేయడానికి వచ్చే నెల 7న ఈ-వేలం పద్ధతిన ఈ ఆస్తులను వేలం వేయబోతున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. రెగ్యులేటరీ మార్గదర్శకాలకు లోబడి నిర్వహిస్తున్న ఈ వేలంలో ఏఆర్‌సీఎస్/బ్యాంకులు/ఎన్‌బీఎఫ్‌సీఎస్, ఎఫ్ఐఎస్‌లు బిడ్డింగ్‌లు దాఖలు చేయవచ్చునని సూచించింది. ఈ నెల 12నే ఇందుకు సంబంధించిన ఆస్తులను బహిరంగంగా ప్రదర్శించింది. విక్రయించనున్న వాటిలో భాటియా గ్లోబల్ ట్రేడింగ్(బీజీటీఎల్) బకాయిపడిన రూ.177.02 కోట్లు, భాటియా కోక్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ రూ.104.15 కోట్లు, భాటియా కోల్ వాషరీస్ రూ.12.58 కోట్లు, ఏషియన్ నేచురల్ రిసోర్స్(ఇండియా)లిమిటెడ్ రూ.2.18 కోట్లు, మహారాష్ట్ర స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.40.51 కోట్లు, అన్నల్ స్టీల్ లిమిటెడ్ రూ.37.70 కోట్లు, విధాత మెటల్స్ రూ.36.98 కోట్ల రుణాల కింద తాకట్టుపెట్టిన ఆస్తులు ఉన్నాయి. 'స్విస్ చాలెంజ్ మెథడ్'లో జరుగనున్న ఈ వేలంపాటలో అత్యధిక బిడ్డింగ్ దాఖలు చేసిన సంస్థే విజేత.




## అమ్మకానికి ఎయిర్ ఇండియా!

**వచ్చే నెలలో మరో దఫా బిడ్డింగ్‌లను ఆహ్వానిస్తున్న కేంద్రం**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను వదిలించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటి వరకు ఫలించలేదు. వచ్చే నెలలో మరో దఫా ప్రణాళికను ప్రకటించబోతున్నది. సంస్థలో తనకున్న 100 శాతం వాటా ను విక్రయించడానికి నవంబర్‌లో బిడ్డింగ్‌లను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే పలు సంస్థలు ఆసక్తి చూపాయన్నారు. రూ.58 వేల కోట్ల స్థాయి రుణ సంక్షోభంలో ఉన్న సంస్థ..ప్రస్తుతం రోజువారి ఇంధనం కొనుగోలు చేయడానికి ఆపసోపాలు పడుతున్నది. ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థలైన ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు కొన్ని విమానాశ్రయాల్లో ఇంధన సరఫరాను నిలిపివేశాయి కూడా. గతవారంలో పౌరవిమానయాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఖరోలా మాట్లాడుతూ..ఈ నెల 22న ఎయిర్ ఇండియా బోర్డు సమావేశమై, కంపెనీ ఆర్థిక స్థితిగతులపై ప్రత్యేకంగా చర్చించనున్నట్లు చెప్పారు. అంతకుముందు ఈ నెల మొదట్లో ఎయిర్ ఇండియా మేనేజ్‌మెంట్ కూడా ప్రైవేటీకరణకు సంబంధించి చర్చించింది. ఈ ప్రైవేటీకరణపై సంస్థ ఉద్యోగ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఉద్యోగాలు పోతాయనే భయం వారిలో నెలకొన్నది. ప్రత్యేక పర్పస్ వెహికల్, ఎయిర్ ఇండియా అసెట్ హోల్డింగ్ లిమిటెడ్(ఏఐఏహెచ్ఎల్)కి చెందిన బాండ్లను జారీ చేయడం ద్వారా సేకరించనున్న నిధుల్లో రూ.30 వేల కోట్లను ఎయిర్ ఇండియా అప్పు తీర్చడానికి ప్రత్యేక ప్రణాళికను తెరపైకి తీసుకొచ్చింది. ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్, ఎయిర్‌లైన్ అల్లైడ్ సర్వీసెస్ లిమిటెడ్, ఎయిర్ ఇండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్(ఏఐఈఎస్ఎల్), హోటల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(హెచ్‌సీఐ)లకు వర్కింగ్ క్యాపిటల్ నిమిత్తం రుణాలు ఇవ్వడానికి ఏఐఏహెచ్ఎల్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 16 నుంచి ఇప్పటి వరకు బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.21,985 కోట్ల నిధులను సేకరించింది.

## కొత్త క్షేత్రాల్లోనూ ఉత్పత్తి

**వచ్చే ఏడాదిలో గ్యాస్ వెలికితీత ప్రారంభిస్తాం.. కేజీ-డీ6 బ్లాక్‌పై రిలయన్స్ విశ్వాసం**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లోని డీ6 బ్లాక్‌లోగల కొత్త గ్యాస్ క్షేత్రం నుంచి వచ్చే ఏడాది ఉత్పత్తి రాగలదన్న విశ్వాసాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వ్యక్తం చేసింది. ఓవైపు ప్రస్తుత క్షేత్రాల్లో ఉత్పత్తి అంతకంతకూ పడిపోతున్నా.. మరోవైపు వచ్చే ఏడాది మధ్య నుంచి మాత్రం కొత్త గ్యాస్ క్షేత్రం నుంచి ఉత్పత్తి వస్తుందన్న ఆశాభావాన్ని ఆర్ఐఎల్ కనబరిచింది. ఆ దిశగానే కృషి చేస్తున్నామని ఇటీవల ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను ప్రకటించిన ఆర్థిక ఫలితాల అనంతరం జరిగిన ఓ కార్యక్రమంలో మదుపరులకు స్పష్టం చేసింది. కేజీ-డీ6 బ్లాక్‌లో ఉత్పత్తి అడుగంటిన క్షేత్రాలను తిరిగి ఉత్పత్తిలోకి తీసుకురావడానికి 2017 జూన్‌లో రిలయన్స్, బ్రిటన్‌కు చెందిన దాని భాగస్వామి బ్రిటీష్ పెట్రోలియం (బీపీ) రూ.40 వేల కోట్ల పెట్టుబడితో ఓ ప్రణాళికను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆర్-క్లస్టర్, శాటిలైట్ క్లస్టర్, ఎంజే ఫీల్డ్‌ల్లో తిరిగి ఉత్పత్తిని సాధించడానికి చర్యలు మొదలైయ్యాయి. ఈ క్రమంలోనే ఆర్-క్లస్టర్‌లో ఉత్పత్తిని మొదట ప్రారంభించేందుకు ఆర్ఐఎల్, బీపీ ప్రయత్నిస్తున్నాయి. 2020-22 మధ్య రోజుకు 30-35 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తామన్న ధీమాను కనబరుస్తున్నాయి. 2021 లో శాటిలైట్ క్లస్టర్‌లో ఉత్పత్తిని ప్రారంభిస్తామంటున్న రిలయన్స్.. 2022 జనవరి-మార్చిలో ఎంజే ఫీల్డ్ అందుబాటులోకి రాగలదని అంటున్నది. కేజీ-డీ6 బ్లాక్‌లో ఇప్పటిదాకా 19 గ్యాస్ క్షేత్రాలను రిలయన్స్ కనుగొన్నది. ఇందులో డీ-1, డీ3లు చాలా పెద్దవి. 2009 ఏప్రిల్ నుంచే ఇవి ఉత్పత్తిలోకి వచ్చాయి.

## రీట్స్, ఇన్విట్స్ ఆకర్షణీయం

- భారీగా మ్యూచువల్స్ ఫండ్స్ పెట్టుబడులు
- ఈ ఏడాదిలో రూ.9 వేల కోట్లుగా నమోదు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (రీట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (ఇన్విట్స్)ల్లో మ్యూచువల్ ఫండ్స్ పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ ఏడాది ఆరంభం నుంచి సెప్టెంబర్ ఆఖరు వరకు దాదాపు రూ.9,000 కోట్ల పెట్టుబడులను మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు వీటిలో మదుపు చేశాయి. రీట్స్‌లో రూ.451 కోట్లు, ఇన్విట్స్‌లో రూ.8,528 కోట్లు పెట్టినట్లు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కాగా, రీట్స్‌లో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు జనవరిలో కేవలం రూ.7 కోట్లుగానే ఉండగా, సెప్టెంబర్‌లో రూ.69 కోట్లకు పెరిగాయి. అలాగే ఇన్విట్స్‌లోనూ రూ.611 కోట్ల నుంచి రూ.1,034 కోట్లకు చేరాయి. భారతీయ రీట్స్, ఇన్విట్స్‌ల్లో పెట్టుబడులు పెట్టడానికి చాలామంది విదేశీ మదుపరులు ఆసక్తి కనబరుస్తున్నారని ఇటీవలి అమెరికా పర్యటన అనంతరం సెబీ చైర్మన్ అజయ్ త్యాగీ వెల్లడించిన విషయం తెలిసిందే. అమెరికాలో తాను కలిసిన విదేశీ మదుపరులు రీట్స్, ఇన్విట్స్ గురించి ఆరా తీసినట్లు చెప్పారు. 2014లో తొలిసారి రీట్స్, ఇన్విట్స్ మార్గదర్శకాలను సెబీ జారీ చేసిన సంగతి విదితమే.

# కార్పొరేట్ల ఫలితాలే కీలకం

### మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్న అంతర్జాతీయ అంశాలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:**

గతవారంలో మూడు శాతం రిటర్నులను పంచిన దేశీయ స్టాక్ మార్కెట్లు ఈవారంలోనూ జోరు కొనసాగనున్నదని దలాల్ స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. కార్పొరేట్ల ఆశాజనక ఫలితాలకు తోడు దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయన్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులతోపాటు దేశీయ ఇన్వెస్టర్లు కూడా భారీగా నిధులను కుమ్మరించడం, ఐఆర్‌సీటీసీ వాటా విక్రయానికి వచ్చిన అపూర్వ స్పందన, బ్రెగ్జిట్ ఒప్పందం త్వరలో కొలిక్కిరానున్నట్లు బ్రిటన్ ప్రకటించడం మార్కెట్లు దూసుకుపోయే అవకాశం ఉన్నదని సామ్‌కో సెక్యూరిటీ అండ్ స్టాక్ నోట్ ఫౌండర్, సీఈవో జిమ్మిట్ మోదీ తెలిపారు. వరుసగా రెండువారాలపాటు కొనసాగిన ర్యాలీ అక్టోబర్ 4తో ముగిసినవారంలో నష్టాలను మూటగట్టుకున్నది. కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు, ప్రభుత్వరంగ బ్యాంకులను బలోపేతం చేయడానికి భారీ స్థాయిలో నిధులను కేటాయించనుండటం, ఎఫ్‌పీఐలు, దేశీయ పెట్టుబడిదారులు కూడా భారీ స్థాయిలో నిధులను జారవిడ్చడంతో మార్కెట్ల పతనానికి బ్రేక్ పడిందని, ఇక ముందు మరింత పుంజుకునే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఒకవేళ ఎలాంటి ఇబ్బందికర వార్త వెలువడితే తప్పా..సూచీలు మరింత దూసుకుపోతాయన్న నమ్మకాన్ని వ్యక్తంచేసిన ఆయన..క్రిసిమస్ నాటికి జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ నూతన మైలురాయిని తాకే అవకశం ఉన్నదన్నారు. గతవారంలో ఆటో, ఎఫ్ఎంసీజీ, బ్యాంక్, ఇంధనం, ఇన్‌ఫ్రా, మెటల్, ఫార్మా రంగ షేర్లు 3.5 శాతం నుంచి 8 శాతం వరకు బలపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 4 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 3 శాతం ఎగబాకాయి. గతవారం రిలయన్స్ ఇండస్ట్రీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌ల ఆర్థిక ఫలితాలు మదుపరులను ఆకట్టుకోనున్నాయి. వీటిలో ఆర్ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీలు అంచనాలకుమించి ఫలితాలను ప్రకటించాయి. ఈవారంలో 300 కంపెనీలకు పైగా తమ జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికిగాను ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నాయి. గతవారంలో సెన్సెక్స్ 1,171.30 పాయింట్లు లేదా 3.07 శాతం లాభపడింది.

### నేడు మార్కెట్లకు సెలవు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో సోమవారం స్టాక్ మార్కెట్లు సెలవు పాటించనున్నాయి. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలతోపాటు బులియన్, కమోడిటీ, ఇతర మార్కెట్లు కూడా మూసివేసివుంచనున్నారు. మంగళవారం ఉదయం యథావిధిగా మార్కెట్లు ప్రారంభంకానున్నాయి. దీంతో ఈవారంలో ట్రేడింగ్ నాలుగు రోజులకు పరిమితం కానున్నది.



### ఈ వారం ఆర్థిక ఫలితాలు ప్రకటించబోయే సంస్థలు

| | |
|---|---|
| అక్టోబర్ 21న: | యాక్సిస్ బ్యాంక్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, అల్ట్రాటెక్ సిమెంట్, హిందుస్థాన్ జింక్ |
| 22న: | బజాజ్ ఫిన్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, మహీంద్రా ఫైనాన్షియల్, ఓరియంటల్ బ్యాంక్ |
| 23న: | లార్సెన్ అండ్ టుబ్రో, బజాజ్ ఆటో, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, హీరో మోటోకార్ప్, ఇండియన్ బ్యాంక్, హ్యావెల్స్, బయోకాన్, |
| 24న: | ఐటీసీ, మారుతి సుజుకీ, టాటా స్టీల్, బంధన్ బ్యాంక్, రిలయన్స్ నిప్పన్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, యునైటెడ్ స్పిరిట్స్, రేమండ్, పీఎన్‌బీ హౌజింగ్ ఫైనాన్స్ |
| 25న: | స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టాటా మోటర్స్, టాటా కాఫీ, అరవింద్, రిలయన్స్ క్యాపిటల్ |
| 26న: | ఐసీఐసీఐ బ్యాంక్, ఫైజర్ |

### దూసుకుపోయిన బ్లూచిప్ సంస్థలు

గతవారంలో బ్లూచిప్ సంస్థలు దూసుకుపోయాయి. టాప్-10 కంపెనీల్లో తొమ్మిదింటి మార్కెట్ విలువ రూ.1.47 లక్షల కోట్ల మేర పెరిగింది. వీటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్‌లు అత్యధికంగా లాభపడ్డాయి. ఇన్ఫోసిస్ మాత్రం భారీగా నష్టపోగా, మిగతా తొమ్మిది సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ పెరిగింది. వీటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.39,876.44 కోట్లు అధికమై రూ.8,97,179.47 కోట్లకు చేరుకున్నది. అలాగే టీసీఎస్ రూ.26,379.27 కోట్లు అధికమవగా, హెచ్‌యూఎల్ రూ.21,962 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.16,767 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ రూ.14,728 కోట్లు, ఎస్బీఐ రూ.13,521 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.6,046 కోట్లు, కొటక్ మహీంద్రా బ్యాంక్ రూ.5,223.93 కోట్లు, ఐటీసీ రూ.2,948.75 కోట్ల మేర ఎం-క్యాప్ ఎగబాకింది. ఇన్ఫోసిస్ మాత్రం రూ.20,594.70 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కోల్పోయి రూ.3,29,751.88 కోట్లకు జారుకున్నది.

## కొనసాగుతున్న ఎఫ్‌పీఐల జోరు

**అక్టోబర్‌లో ఇప్పటి వరకు రూ.5 వేల కోట్ల పెట్టుబడి**

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల జోరు కొనసాగుతున్నది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ)లు తాజాగా ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు రూ.5,072 కోట్ల నిధులను ఈక్విటీ, డెబిట్ మార్కెట్లలో గుమ్మరించారు. దేశీయంగా డిమాండ్‌ను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వీరిని ఆకట్టుకున్నాయి. అంతక్రితం నెలలోనూ ఎఫ్‌పీఐలు రూ.6,557.8 కోట్ల పెట్టుబడులు పెట్టారు. జూలై, ఆగస్టు నెలల్లో వరుసగా పెట్టుబడులను ఉపసంహరించుకున్న ఎఫ్‌పీఐలు..ఆ తర్వాత భారీగా కుమ్మరిస్తున్నారు. డిపాజిటరీ వద్ద ఉన్న తాజా సమాచారం ప్రకారం ఈ నెల 1-18 మధ్యకాలంలో ఈక్విటీ మార్కెట్లలోకి రూ.4,970 కోట్లను, డెబిట్ మార్కెట్లోకి రూ.102 కోట్లను చొప్పించారు. మొత్తంగా రూ.5,072 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు అయింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యం పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో వినిమయం పెరుగనున్నదని, అలాగే కార్పొరేట్ ట్యాక్స్‌ని తగ్గించడం, ప్రభుత్వరంగ బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి తీసుకుంటున్న చర్యలు, వ్యూహాత్మక వాటాల విక్రయం, ఎఫ్‌పీఐల్లో మార్గదర్శకాలను మార్పులు తీసుకురావడం ఇందుకు కారణమని మార్కెట్ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రకటించిన కార్పొరేట్ల ఫలితాలు విశ్లేషకులు అంచనాలుమించి నమోదు చేసుకోవడం, బ్రెగ్జిట్ ఒప్పందం కొలిక్కిరావడంతో విదేశీ పెట్టుబడిదారులకు నమ్మకం మరింత పెరిగింది.

### తెలుగులో హెచ్‌డీఎఫ్‌సీ సేవలు

**ముంబై, అక్టోబర్ 20:** ప్రాంతీయంగా రుణాలు తీసుకునేవారిని దృష్టిలో పెట్టుకొని హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ ఒకేసారి ఆరు భాషల్లో తన వెబ్‌సైట్ సేవలను ఆరంభించింది. వీటిలో తెలుగుతోపాటు హిందీ, మరాఠీ, తమిళం, మలయాళం, కన్నడ భాషలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ల వాడకం భారీగా పెరుగుతుండటం, ప్రాంతీయ భాషల్లో సేవలు పొందే వారి సంఖ్య పెరుగుతుండటం, ముఖ్యంగా చిన్న స్థాయి నగరాల్లో వీరు అధికంగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఈ నూతన సేవలకు శ్రీకారం చుట్టినట్లు సంస్థ ఎండీ రేణుసుద్ కర్నాడ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డిజిటల్ ఇండియా పథకంలో భాగంగా.. వినియోగదారులకు అన్నిరకాల సేవలను ప్రాంతీయ భాషల్లో అందించడానికి బ్యాంక్ డిజిటల్ బాట పట్టిందని, తద్వారా మరింత మంది ఖాతాదారులకు చేరువయ్యే అవకాశం ఉందన్నారు. పీఎంఏవై-క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీం(సీఎల్ఎస్ఎస్) కింద తొలిసారి గృహాలను కొనుగోలు చేసిన 1.1 లక్షల మందికి రూ.2,345 కోట్ల రుణాల్లో సబ్సిడీని సంస్థ ఇచ్చింది.

## మా వృద్ధిపైనే ఆధారం

- ప్రపంచ జీడీపీ చోదక శక్తులు భారత్, చైనాలే
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటు.. భారత్, చైనా దేశాల వృద్ధిపైనే ఆధారపడి ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) మాదిరిగా వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) ఉండబోదని, అంతర్జాతీయ ఆర్థిక మందగమనం ఉన్నా.. తప్పక భారత్, చైనాల జీడీపీ మెరుగు పడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చైనా కంటే కూడా భారత్ వృద్ధిరేటు ఆకర్షణీయంగా ఉంటుందన్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు. దీని అనుకూల ప్రభావం గ్లోబల్ ఎకానమీపైనా పడుతుందని చెప్పారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న నిర్మలా సీతారామన్.. శనివారం వాషింగ్టన్‌లో అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో పాల్గొన్న విషయం తెలిసిందే. 'భారత్, చైనాల వృద్ధిరేటు అంతర్జాతీయ జీడీపీని ప్రతిబింబిస్తుంది. మా రెండు దేశాల జీడీపీ బాగుంటే.. ప్రపంచ జీడీపీ కూడా బాగున్నట్లే. తగ్గితే.. గ్లోబల్ ఎకానమీపైనా ఆ ప్రభావం ఉంటుంది' అని ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. మరోవైపు అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం వల్ల ప్రపంచ జీడీపీ దాదాపు ఒక శాతం మేర పడిపోయే వీలుందని ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థిక వేత్త గీతా గోపీనాథ్ ఆందోళన వ్యక్తం చేశారు.

### ప్రణాళికల్ని సిద్ధం చేస్తాం

గ్లోబల్ మార్కెట్‌లో చైనాకు ప్రత్యామ్నాయం భారతేనని నిర్మలా సీతారామన్ అన్నారు. అంతర్జాతీయ సంస్థల కోసం ఓ ప్రణాళికను సిద్ధం చేస్తామని, పెట్టుబడుల్లో చైనాను మించి భారతే తమ గమ్యస్థానమని అనుకునేలా ఈ బ్లూప్రింట్ ఉంటుందని తెలిపారు. భారత్‌లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, అన్ని రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ మదుపరులు ముందుకురావాలని మరోసారి మంత్రి పిలుపునిచ్చారు. 'చైనాను వీడి వెళ్లే ప్రతీ అమెరికా, ఐరోపా, బ్రిటన్ తదితర దేశాల కంపెనీలు.. భారత్‌లోనే ఎందుకు పెట్టుబడులు పెట్టాలి? అన్నదాన్ని వివరిస్తూ ఓ బ్లూప్రింట్‌ను తీసుకొస్తాం' అని సమావేశం అనంతరం భారతీయ విలేకరుల బృందంతో మాట్లాడుతూ అన్నారు. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ఆసియా దేశాల్లో చైనాకు ప్రత్యామ్నాయంగా ఓ వ్యాపార, పారిశ్రామిక హబ్ కోసం అంతర్జాతీయ కంపెనీలు చూస్తున్నాయని చెప్పారు.

### బలోపేతం కావాలి

ప్రస్తుత అంతర్జాతీయ ఆందోళనకర పరిస్థితులు.. బహుళ సహకార వ్యవస్థల బలోపేతానికి పిలుపునిస్తున్నాయని నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. ఇప్పుడున్న విపత్కర సమయంలో ఆయా దేశాల ప్రభుత్వాల చర్యలకుతోడు అంతర్జాతీయ స్థాయిలో సహకారం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, ఫేస్‌బుక్ ప్రతిపాదిత క్రిప్టోకరెన్సీ లిబ్రాపై అడిగిన ప్రశ్నకుగాను క్రిప్టోకరెన్సీల విషయంలో చాలా దేశాలు జాగ్రత్తగా ఉంటున్నాయని తెలిపారు. భారత్‌లో క్రిప్టోకరెన్సీల వాడకంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్ వైపు నుంచి ఈ అంశంలో ఆర్బీఐదే తుది నిర్ణయమని వ్యాఖ్యానించారు.

# ఖర్చులకు పైసల్లేవ్!

### పీఎంసీ బ్యాంక్ డిపాజిటర్లకు పుట్టెడు కష్టాలు ■ ఖాతాల్లో నగదున్నా.. తీసుకోలేని దుస్థితి

### గత నెల రోజులుగా ఇదే పరిస్థితి ■ ఆర్బీఐ ఆంక్షలపై కస్టమర్ల ఆగ్రహం

PMC BANK

**న్యూఢిల్లీ/ముంబై, అక్టోబర్ 20:** పంజాబ్ అండ్ మహారాష్ట్ర సహకార (పీఎంసీ) బ్యాంక్ డిపాజిటర్ల కష్టాలు అన్నీఇన్నీ కావు. అక్రమార్కుల అవినీతికి అమాయక ఖాతాదారులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. అందుబాటులోనే తమ సొమ్మున్నా.. అవసరాలకు అది అందని దుస్థితిని చవిచూస్తున్నారిప్పుడు లక్షలాది మంది పీఎంసీ కస్టమర్లు. పీఎంసీ బ్యాంక్ కుంభకోణం నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆంక్షలు తెచ్చిన విషయం తెలిసిందే. ఇవి అమల్లోకి వచ్చి దాదాపు నెల రోజులు అవుతుండగా, తమ కష్టార్జితం కోసం ఖాతాదారులు ఆందోళనలు చేస్తున్న సంగతీ విదితమే. ఇప్పటికే నలుగురు చనిపోగా, ఆర్బీఐ ఆంక్షల్ని ఎత్తివేసి.. తమ సొమ్మును తమకు ఇప్పించాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు. ఏమిటి మాకీ పరిస్థితి అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పీఎంసీ బ్యాంక్ శాఖల వద్ద రోజూ ఆందోళనలు, నిరసనల్నీ చేపడుతున్నారు. పీఎంసీ బ్యాంక్‌ను 1984లో స్థాపించారు. ఆంధ్రప్రదేశ్‌సహా మొత్తం దేశవ్యాప్తంగా ఏడు రాష్ర్టాల్లో ఈ బ్యాంక్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. 137 శాఖలున్న ఈ బ్యాంక్.. దేశంలోని టాప్-10 సహకార బ్యాంకుల్లో ఒకటి. ముంబై ప్రధాన కేంద్రంగా నడుస్తున్న ఈ బ్యాంక్‌లో దాదాపు రూ.11 వేల కోట్ల డిపాజిట్లున్నాయి. సుమారు 10 లక్షల ఖాతాదారులున్నారు. నిర్మాణ రంగ సంస్థ హెచ్‌డీఐఎల్‌తో పీఎంసీ బ్యాంక్ పెద్దలు కుమ్మక్కైయ్యారన్న కోణంలో దర్యాప్తు జరుగుతుండగా, దీనివల్ల గడిచిన 11 ఏండ్లలో బ్యాంక్‌కు రూ.4,355.46 కోట్ల నష్టం వాటిల్లినట్లు ముంబై ఆర్థిక నేరాల విభాగం పోలీసులు చెబుతున్నారు. పీఎంసీ నుంచి హెచ్‌డీఐఎల్, ఆ గ్రూప్ సంస్థలు 44 రుణాలను పొందాయి. ఈ సంక్షోభానికి మూల కారణమైన హెడీఐఎల్.. బ్యాంక్‌కు రూ.6,500 కోట్లు బకాయి పడింది. మొత్తం రూ.8,880 కోట్ల బ్యాంక్ రుణాల్లో ఇది 73 శాతానికి సమానం కావడం గమనార్హం. ఈ కేసులో హెచ్‌డీఐఎల్ ప్రమోటర్లైన వాధవాన్లతోపాటు బ్యాంక్ మాజీ చైర్మన్, ఎండీలను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. హెచ్‌డీఐఎల్‌కు చెందిన ఆస్తులనూ జప్తు చేసింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2017-18)తో పోల్చితే గత ఆర్థిక సంవత్సరం (2018-19) బ్యాంక్ మొండి బకాయిలు రెండింతలకుపైగా పెరిగాయని గుర్తించిన ఆర్బీఐ.. నిబంధనల ఉల్లంఘన, నియంత్రణ లోపాల దృష్ట్యా బ్యాంక్‌పై గత నెల 24న ఆంక్షలు విధించిన సంగతి విదితమే. ఆరు నెలలపాటు ఇవి కొనసాగనుండగా, తొలుత వెయ్యి రూపాయలనే ఉపసంహరించుకోవాలని డిపాజిటర్లకు స్పష్టం చేసింది. ఆ తర్వాత దీన్ని రూ.10 వేలకు పెంచిన ఆర్బీఐ.. ఇప్పుడు రూ.40 వేలుగా నిర్ణయించింది.



ఇక్కడ కనిపిస్తున్నది 73 ఏండ్ల శశి కుమార్ నియోటియా. ఈమధ్యే గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. అంతేగాక తన కిడ్నీల్లో ఒకటి కూతురుకు దానమిచ్చారు. ఈయన తన డబ్బు మొత్తాన్ని పీఎంసీ బ్యాంక్ లోనే పెట్టగా, ఇప్పుడు కనీస వైద్య అవసరాలకూ వాటిని తీసుకోలేని స్థితిలో ఉన్నామంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆదుకోవాలని కోరుతున్నారు.



వీరు.. హరీశ్ మల్కానీ (69), రాణీ మల్కానీ దంపతులు. ఇరువురూ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులే. పీఎంసీ బ్యాంక్‌లోనే వీరి సొమ్మంతా ఉన్నది. బ్యాంక్ నుంచి వచ్చే వడ్డీతో శేష జీవితాన్ని సంతోషంగా సాగిస్తున్నారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కనీస ఖర్చులకూ ఇతరులపై ఆధారపడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈయన ఆల్విన్ డిసౌజా. 20 ఏండ్ల క్రితం చూపు కోల్పోయారు. పీఎంసీ బ్యాంక్ డిపాజిటర్లలో ఒకరు. బ్యాంక్ వడ్డీపై ఆధారపడి జీవిస్తున్నారు. పక్కనే ఉన్నవారు డిసౌజా తల్లి. ఈమె వయసు 85 సంవత్సరాలు. బ్యాంక్ బాగోతం కారణంగా ఇప్పుడీ తల్లీకొడుకులు తీవ్ర అవస్తలను ఎదుర్కొంటున్నారు. మా పరిస్థితి ఏమిటని రోదిస్తున్నారు.

### ఒక్కొక్కరిదీ ఒక్కో బాధ

పీఎంసీ ఖాతాదారుల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో బాధ. పిల్లల స్కూల్ ఫీజులను చెల్లించలేని దుస్థితిలో కొందరుంటే, బ్యాంక్ రుణాల ఈఎంఐలను కట్టలేని పరిస్థితిలో మరికొందరు. కనీస వైద్య ఖర్చులను భరించలేని దీనస్థితిలో ఇంకొందరు. పిల్లల పెండ్లిండ్ల కోసం.. తల్లిదండ్రుల వైద్య అవసరాల కోసం.. సొంతింటి కలల సాకారం కోసం.. ఇలా ఎందరో కలలు.. కల్లలయ్యాయిప్పుడు. ఇక జీవితమంతా కష్టపడి సంపాదించిన సొమ్మును శేష జీవిత అవసరాలార్థం ఈ బ్యాంక్‌లో దాచుకున్నవారి పరిస్థితి మరీ ఘోరం.

## ప్రకటనల్లో స్పష్టత ఉండాలి

**బీమా సంస్థలకు ఐఆర్‌డీఏఐ సూచన**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** బీమా పథకాలపై తప్పుడు ప్రచారం చేసే బీమా సంస్థలకు నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ఇన్సూరెన్స్ పథకాలకు సంబంధించి నిజాయితీగా ఉండాలి తప్పా.. తప్పుదారి పట్టించేదిగా ఉండకూడదని, కల్పిత భద్రత భావాన్ని తెలియజేయని విధంగా ఉండాలని బీమా సంస్థలకు సూచించింది. పలువురు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఐఆర్‌డీఏఐ ఈ నూతన సర్క్యూలర్‌ను జారీ చేసింది. దేశంలో ఉన్న అన్ని బీమా రంగ సంస్థలు తమ ప్రకటనలు చాలా స్పష్టంగా ఉండాలని, ముఖ్యంగా ఖాతాదారులకు అన్నింటా అర్థమయ్యే విధంగా ఉండాలి తప్పా మోసం చేసే విధంగా ఉండకూడదని ఈ సర్క్యూలర్‌లో ఆదేశించింది. పథకానికి సంబంధించి మెటీరియల్, డిజైనింగ్(పేపర్ సైజ్, కలర్, ఫాంట్ టైప్-సైజ్, టోన్, వాల్యూమ్)లో మొత్తం అవసరమైన సమాచారాన్ని పొందుపరుచాలని సూచించింది. తప్పనిసరిగా ఉంచాల్సిన సమాచారాన్ని అదే భాషల్లో మొత్తం ప్రకటనలో ఖచ్చితంగా ఉంచాల్సిందేనని గట్టిగా హెచ్చరించింది.

## వచ్చే ఏడాదిపైనే సీవీల ఆశలు

**మహీంద్రా అండ్ మహీంద్రా సీఈవో వినోద్ సహాయ్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** ఆర్థిక మాంద్యం దెబ్బకు కుదేలైన కమర్షియల్ వాహన(సీవీ) పరిశ్రమ ఈ ఏడాది కోలుకునే అవకాశాలు కనిపించడం లేదు. బీఎస్-6 ప్రమాణాలకు తగ్గట్టుగా వాహనాలను తయారు చేయడంతో వచ్చే ఏడాది ధరలు అధికమవనున్నప్పటికీ వచ్చే తిరిగి కొలుకునే అవకాశాలున్నాయని మహీంద్రా అండ్ మహీంద్రా సీఈవో వినోద్ సహాయ్ తెలిపారు. ఐదేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన వృద్ధిని తిరిగి పుంజుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇందుకు దోహదం చేయనున్నాయని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఆరు నుంచి ఏడు నెలలకాలంలో అంతంత మాత్రంగానే ఉండనున్న కమర్షియల్ వాహన రంగం..వచ్చే ఏడాది మాత్రం రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోనున్నదని ఆయన అంచనావేస్తున్నారు. ఈ ఏడాది మాత్రం ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోవడం ఖాయమన్న ఆయన..ఉద్దీపన ప్యాకేజీలు అత్యధికంగా ఉంటే భవిష్యత్తులో అన్ని పరిస్థితులు సద్దుమణిగే అవకాశం ఉంటుందన్నారు. కాలుష్యాన్ని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బీఎస్-6 మార్గదర్శకాలు మొత్తం ఆటోమొబైల్ ఇండస్ట్రీపై ప్రతికూల ప్రభావం పడుతున్నదన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో దేశవ్యాప్తంగా కమర్షియల్ వాహన విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 22.95 శాతం తగ్గి 3,75,480 యూనిట్లకు పడిపోయాయని భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం తాజాగా వెల్లడించింది.

# తెలంగాణ సంస్కృతికి పట్టం

- తెలంగాణ కళలను అద్భుతంగా తెరకెక్కించారు
- 'తుపాకిరాముడు' ప్రీరిలీజ్ వేడుకలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు
- 25న విడుదల కానున్న సినిమా



తుపాకిరాముడు ప్రీరిలీజ్ వేడుకలో పాటలు, ట్రైలర్ సీడీని విడుదల చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, చిత్రంలో మంత్రి ఈటల, ఎమ్మెల్యే రసమయి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బిత్తిరి సత్తి, దిల్‌రాజు తదితరులు

**సినిమా డెస్క్:** తెలంగాణ పల్లెలు, కళలు, సంప్రదాయాలను, బతుకమ్మ పండుగను అద్భుతంగా చూపించిన సందేశాత్మక చిత్రం 'తుపాకిరాముడు' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రశంసించారు. బిత్తిరి సత్తి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని రసమయి ఫిల్మ్స్ పతాకంపై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్మించారు. టీ ప్రభాకర్ దర్శకత్వం వహించారు. ఈ నెల 25న విడుదలకానున్న ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై పాటలను, ట్రైలర్‌ను విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిర్మాత, దర్శకుడు, నటీనటులంతా తెలంగాణవారే ఉన్న ఈ చక్కటి చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు ఆదరించాలని, వంద రోజులు ఆడాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తీసిన సినిమా తర్వాత రసమయి బాలకిషన్ 'తుపాకిరాముడు'తో ముందుకొచ్చారని, ఈ సినిమాతో ఆయన సాహసోపేత ప్రయత్నం చేశారని అన్నారు. యావత్ తెలుగు ప్రజలకు బిత్తిరి సత్తిగా చిరపరిచితుడైన చేవెళ్ల రవి ఈ సినిమాతో మరింత పేరుతెచ్చుకోవాలని, అద్భుతమైన నటుడిగా ఎదగాలని కోరుకుంటున్నానని మంత్రి హరీశ్ తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రసమయి బాలకిషన్ చక్కటి సృజనాత్మకత కలిగిన కళాకారుడన్నారు. ఈ సినిమా విజయవంతమై ఆయనకు మంచిపేరు రావాలని ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తీసిన అనేక సినిమాల్ని అక్కున చేర్చుకున్నట్లుగానే 'తుపాకిరాముడు'ను ప్రేక్షకులు ఆదరించాలన్నారు.

**కళలపట్ల మక్కువతో తీసిన సినిమా: మంత్రి తలసాని**

సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. కళలపట్ల ఉన్న మక్కువతో రసమయి బాలకిషన్ ఎన్నో కష్టాలకోర్చి ఈ సినిమా తీశారని చెప్పారు. తెలుగు చిత్రసీమలో పెద్దదిక్కుగా నిలిచిన దిల్ రాజు ఈ సినిమా విడుదలకు ముందుకురావడమే కాకుండా థియేటర్లను కూడా కేటాయించడం సంతోషకరమన్నారు. పైసావసూల్ ఆలోచనతో కాకుండా సామాజిక బాధ్యతను చాటుకుంటూ రసమయి బాలకిషన్ ఈ చిత్రాన్ని నిర్మించారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కొనియాడారు. చిత్ర నిర్మాత రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. ఈ సినిమా రూపకల్పనలో ఎన్ శంకర్ తనకు ప్రేరణనిచ్చారని, ఆయన రూపొందించిన 'శ్రీరాములయ్య' లాంటి గొప్ప సినిమా తీయాలన్న తన కల 'తుపాకిరాముడు'తో నెరవేరిందని తెలిపారు. ఎమ్మెల్యేగా తీరికలేకుండా ఉండే నీవు ఈ సినిమా తీయగలవా? అని చాలామంది తనను ప్రశ్నించారని, నియోజకవర్గ ప్రజల అభిమానంతో ఈ సినిమా చేయగలిగానని చెప్పారు. ఎదుటివాడి సంతోషాన్ని కోరుకునే తుపాకిరాముడి కథే ఇదని, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా తీసిన ఈ చిత్రాన్ని భుజాన వేసుకొని విడుదలచేస్తున్న దిల్‌రాజు తనకెంతో బలాన్నిచ్చారని పేర్కొన్నారు.

**సినిమా ప్రోమో అద్భుతం: దర్శకుడు ఎన్ శంకర్**

దర్శకుడు ఎన్ శంకర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఆలోచన, అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ చేరాయన్న విషయాన్ని ఈ సినిమా ప్రోమోల్లో అద్భుతంగా చూపించారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎంతో మంది స్థానిక కళాకారులు చిత్రసీమలో అగ్రస్థానానికి చేరుకున్నారని, తెలంగాణ వచ్చిన తర్వాత కూడా తెలుగు సినిమా ఎదుగుతున్నదని దిల్‌రాజు పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు టీ ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇది తెలంగాణ సంస్కృతిపై తీసిన సినిమా అన్నారు. ఈ సినిమాతో రసమయి బాలకిషన్ తనను హీరోను చేశారని బిత్తిరి సత్తి చెప్పారు. 2003లో తాను 'దిల్' సినిమా ఆడిషన్‌కు హాజరయ్యానని, ఇప్పుడు తాను నటించిన సినిమాను దిల్‌రాజు విడుదల చేయడం అదృష్టంగా భావిస్తున్నానని బిత్తిరిసత్తి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలె యాదయ్య, 'తుపాకిరాముడు' యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఒక్క రాత్రిలోనే రూ.8.1 కోట్లు ఖర్చు!

### రతుల్‌పురి విలాస జీవితం.. చార్జిషీట్‌లో ఈడీ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ మేనల్లుడు రతుల్‌పురి అమెరికాలోని నైట్‌క్లబ్‌లో ఒక్క రాత్రిలోనే సుమారు రూ.8.1 కోట్లు ఖర్చు చేసినట్లు ఈడీ తెలిపింది. రూ.8,000 కోట్ల బ్యాంకు రుణాల మనీ ల్యాండరింగ్ కేసులో రతుల్‌తోపాటు, ఆయన సన్నిహితులు, మోసర్ బేర్ లిమిటెడ్‌పై గత గురువారం దాఖలు చేసిన చార్జిషీట్‌లో ఈడీ వెల్లడించింది. 'లావాదేవీల నిర్ధారణ పూర్తయింది. రతుల్‌పురి అమెరికాలోని ఒక నైట్‌క్లబ్‌లో ఒక్క రాత్రిలోనే సుమారు రూ.8.1 కోట్లు ఖర్చుచేశారు' అని ఈడీ తెలిపింది. 2011 నవంబర్, 2016 అక్టోబర్ మధ్య కాలంలో రతుల్ వ్యక్తిగత ఖర్చు సుమారు రూ.31 కోట్లు అని పేర్కొంది. ఆగస్టు 20న అరెస్టయిన రతుల్‌పురి ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు.




## ఆధునికత జోడిస్తే అధిక ఉత్పాదకత

- గొల్లకురుమ యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- గొర్రెల ఫామ్స్ నిర్వహణపై రాష్ట్రస్థాయి సదస్సులో వక్తలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆధునిక పద్ధతుల్లో గొర్రెల పెంపకాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉన్నదని వక్తలు పిలుపునిచ్చారు. సంప్రదాయ పద్ధతికి ఆధునికతను జోడించడం ద్వారా ఉత్పాదకత పెంచవచ్చని సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) ఆధ్వర్యంలో గొల్లకురుమ యువత, ఉద్యోగులకు ఆధునిక పద్ధతిలో గొర్రెల ఫామ్స్ నిర్వహణపై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. జీఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ అధ్యక్షత వహించగా.. వక్తలు మాట్లాడుతూ.. గొర్రెల ఫామ్స్ నిర్వహణలో మెళకువలు పాటించి గొల్లకురుమ యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సదస్సులో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ బీనవేణి రామయ్య షెఫర్డ్, శాస్త్రవేత్త కర్రె మల్లేశ్, డాక్టర్ అశోక్‌కుమార్ , పశువైద్య సంఘం ప్రతినిధి డాక్టర్ బాబు, వెటర్నరీ డాక్టర్లు, గొర్రెల పెంపకందార్ల సంఘం గౌరవాధ్యక్షుడు కిల్లె గోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు రావుల జంగయ్య, విశ్రాంత ఆచార్యులు మురళీధర్‌యాదవ్, రాష్ట్ర నాయకులు కల్లూరి మల్లేశ్, బొల్లం అశోక్, లింగయ్య, బండారు వెంకటేశ్వర్లు, పరికి మధుకర్ పాల్గొన్నారు.







# పరిష్కార మార్గం చూపించింది

ఎముకల క్యాన్సర్‌తో చిన్నారులు తనువు చాలిస్తున్నారు. ఇప్పటి వరకు దీనికి సరైన చికిత్స అందుబాటులో లేకపోవడంతో ఎంతోమందిని ఈ మహమ్మారి పొట్టన పెట్టుకుంటున్నది. బోన్ క్యాన్సర్ వస్తే అవయవాలన్నీ దెబ్బ తింటాయి. దీనిని నయం చేయడం చాలా కష్టం. ఓ భారతీయ పరిశోధకురాలు దీనిని నిర్మూలించేందుకు చేసిన ప్రయోగాలు ఫలితాన్నిచ్చాయి. రోగాన్ని నయం చేయడానికి నూతన చికిత్సా విధానాన్ని కనుగొన్నది.



భారతదేశానికి చెందిన డాక్టర్ స్వాతిశ్రీవాస్తవ అరుదైన ఘనత సాధించింది. ఇజ్రాయెల్‌లోని వైజ్మాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ప్రొఫెసర్ యోసేఫ్ యార్డెన్‌తో కలిసి చిన్నారుల్లో వచ్చే ఎముకల క్యాన్సర్ వ్యాప్తి చెందకుండా నివారించడానికి పరిశోధనలు జరిపింది. ఫలితంగా నూతన చికిత్సా విధానాన్ని కనుగొన్నది. ఆమె ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూర్కే నుంచి పిహెచ్‌డి పూర్తి చేసింది. ప్రస్తుతం వీజ్మాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పోస్ట్ డాక్టరేట్ చేస్తున్నది. ఎవింగ్ సర్కోమా (ఎముకల క్యాన్సర్)గా చెబుతారు. వ్యాధి సోకిన వారిలో కణాల అభివృద్ధి ఉండదు. దీనివల్ల అవయవాల్లో కణితులు ఏర్పడుతాయి. వాటిని నిరోధించడం చాలా కష్టం. ఇప్పటి వరకూ దీనిని నయం చేయడానికి సరైన చికిత్స అందుబాటులో లేదు. ఎవింగ్ సర్కోమా పరమాణు స్థాయిలో పరస్పర చర్యలపై పరిశోధన చేసింది. అందుకోసం ఎలుకలపై ఆమె బృందం చేసిన ప్రయోగాలు జరిపింది. అవి మంచి సత్ఫలితాలనిచ్చాయి. 'గ్లూకోకార్టియిడ్స్'గా పిలిచే స్టెరాయిడ్ హార్మోన్ల కోసం గ్రాహకాలపై ప్రత్యేకంగా పరిశోధనలు జరిపారు. ఈ గ్రాహకాలు కణాల పెరుగుదలకు సహకరిస్తున్నట్లు వీరి అధ్యయనంలో తేలింది. దీనిని బట్టి చిన్నారుల్లో వచ్చే బోన్ క్యాన్సర్ వ్యాప్తిని నిరోధించవచ్చని స్వాతి శ్రీవాస్తవ శాస్త్రవేత్తల బృందం తెలుసుకున్నది. దీనిద్వారా ఎంతోమంది బోన్‌క్యాన్సర్ బాధితులను కాపాడవచ్చని వారు చెబుతున్నారు.

# కనుబొమ్మలు వాస్తే..



కాలేజీ అమ్మాయిల నుంచి ఆఫీసుకు వెళ్లే మహిళల వరకు కనుబొమ్మలను మంచి ఆకారంలో తీర్చి దిద్దుతారు. అందుకు థ్రెడింగ్, ప్లకింగ్, వ్యాక్సింగ్ చేయడం వల్ల కనుబొమ్మల ప్రదేశంలో వాపు, దురద, మంట అధికంగా ఉంటుంది. నొప్పి బాధ నుంచి విముక్తి పొందేందుకు ఇలా చేయండి.

- సున్నితమైన చర్మం ఉన్నవారికి ఈ బాధ ఎక్కువగా ఉంటుంది. థ్రెడింగ్‌ను సరైన పద్ధతిలో చేయకపోయినా, చేయడం రాకపోయినా చర్మం నలిగి నొప్పికి దారితీస్తుంది. అలాంటి సమయంలో మాత్రమే చర్మం ఎర్రగా మారుతుంది.
- పొడిచర్మం ఉన్నవారికి కూడా థ్రెడింగ్ చేసేటప్పుడు నొప్పికి కలుగుతుంది. ఈ రకమైన చర్మంపై థ్రెడింగ్ వల్ల ఎరుపు, దద్దుర్లు వస్తాయి.
- పొడిచర్మంతోపాటు జిడ్డుచర్మం కూడా ప్రమాదమే. జిడ్డుగల చర్మంపై చిన్న జుట్టును తొలిగించడం అంత సులభం కాదు. అందువల్ల చర్మంపై జుట్టును తొలిగించడం కష్టమవుతుంది.
- థ్రెడింగ్ చేయాలన్నా అనుభవం ఉండాలి. లేదంటే థ్రెడింగ్ సమయంలో వెంట్రుకలకు బదులుగా చర్మాన్ని కట్ చేస్తారు. దీంతో నొప్పి అధికంగా ఉంటుంది.

### నివారణ

**టోనర్ :** ఇందులో కూలింగ్ ఎఫెక్ట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇది చర్మంలో చికాకు, మంటను తగ్గిస్తుంది. పత్తిపై కొద్దిగా టోనర్ వేసి ప్రభావిత ప్రదేశంలో అప్లై చేయాలి. థ్రెడింగ్ తర్వాత తెరుచుకున్న చర్మ రంధ్రాలను టోనర్ మూసివేస్తుంది.
**కలబంద :** ఇందులో చర్మ శీతలీకరణ లక్షణాలు ఉన్నాయి. ఇది చర్మం ఎరుపు, మంట, వాపు, మొటిమలను నయం చేస్తుంది. థ్రెడింగ్ చేసిన వెంటనే కలబందను అప్లై చేయాలి.
**దోసకాయ :** దీన్ని రెండు ముక్కలుగా కట్ చేసుకొని కనుబొమ్మలపై 15 నిమిషాల పాటు ఉంచాలి. ఆ తర్వాత థ్రెడింగ్ చేస్తే నొప్పి లేకుండా చేస్తుంది. దీంతోపాటు వాపు రాకుండా చూసుకుంటుంది.

### జాగ్రత్తలు

- థ్రెడింగ్ చేసిన వెంటనే ఎండలోకి వెళ్లకూడదు. థ్రెడింగ్ తర్వాత ఫేషియల్స్, బ్లీచ్ చేయించుకోవాలి. వేడి వాతావరణంలో ఉండకూడదు. ముఖానికి ఆవిరి పట్టకూడదు.

# సేంద్రియ పద్ధతిలో బ్యూటీపార్లర్ విజయం!

దాదాపు ఇరవైయేండ్ల నుంచి చర్మానికి, తల వెంట్రుకలకు ఆరోగ్యకరమైన ప్రాడక్ట్స్ అందిస్తూ మంచి పేరు తెచ్చుకున్నది. ఈ ఉత్పత్తులన్నీ సహజమైనవి. చర్మవ్యాధి నిపుణులు సైతం ఆమె ఉత్పత్తులను సిఫార్సు చేస్తున్నారు. ఈ ప్రాడక్ట్స్‌ను ఎలా తయారు చేస్తున్నారంటే..




బెంగళూరుకు చెందిన బిందు మెహ్రోత్రాకు 19 ఏండ్లకే పెండ్లి అయింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బిఎ పట్టా పొందింది. అత్తమామలు రియల్ ఎస్టేట్ చేసేవారు. బిందు కూడా ఆ పనిలో భాగస్వామురాలైంది. పని అంతగా కలిసిరాకపోవడంతో, బొమ్మలు తయారు చేస్తుండేది. ఆ తర్వాత బ్యూటీపార్లర్ పెట్టాలనుకున్నది. బిందు చిన్నతంలో తల్లి తయారు చేసిన సున్నిపిండి, పెరుగు, గడ్డులోని తెల్లసొనతో ఫేస్‌ప్యాక్‌గా వేసుకొనేది. దాంతో చర్మం మృదువుగా కాంతివంతంగా ఉండేది. ఇప్పుడు మార్కెట్లలో రసాయనాలతో కూడిన క్రీములు, హెయిర్‌ఆయిల్ వాడడం వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారని భావించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని బిందు ఆరునెలలపాటు బ్యూటీకోర్స్ నేర్చుకున్నది. ఒకరి వద్ద పనిచేయడం ఇష్టం లేక సొంతంగా 1999లో జేపినగర్‌లో పార్లర్ మొదలుపెట్టింది. మూడేండ్ల తర్వాత జయానగర్‌కు మార్చింది. ప్రొడక్ట్స్‌ను తయారు చేసేందుకు పండ్ల తొక్కలను టెర్రస్ మీద ఎండబెట్టి వాటిని పల్వరైజింగ్ మెషిన్‌తో పొడిచేస్తుంది. హెయిర్ ఆయిల్‌కు ఆమ్ల, నీమ్ పౌడర్, మెంతులను ఉపయోగిస్తున్నది. చర్మానికి అలోవెరా, బాదం సేంద్రియ పద్ధతిలో ప్రొడక్ట్స్ తయారు చేస్తున్నది. 'బిందూస్' పేరుతో ప్రొడక్ట్స్‌ను ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నది. ప్రొడక్ట్స్ ప్రాధాన్యం గురించి ప్రజలకు తెలిపింది. కస్టమర్లు పెరిగారు. వారి నుంచి మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. రసాయనాలు కలుపకుండా ప్రొడక్ట్స్ తయారు చయడంతో ఎక్కువరోజులు నిల్వ ఉండవేమో అన్న సందేహం ఆమెను కలచివేసింది. దీనికోసం పీన్యాలోని 'పెస్ట్ కంట్రోల్ ఇండియా ఆటోక్లేవ్ యూనిట్'కు వెళ్లింది. ఆయుర్వేద మందులు కూడా ఈ పద్ధతిలో క్రిమిరహితం చేయబడుతున్నాయని, అది ఉత్పత్తిని ప్రభావితం చేయకుండా బ్యాక్టీరియాను మాత్రమే చంపుతుందని బిందుకు హామీ ఇచ్చారు. ఈ ప్రొడక్ట్స్ అన్నీ సహజమైనవి కాబట్టి చర్మవ్యాధి నిపుణులు కూడా సిఫార్సు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 21 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



కళ్యాణపు శ్రావ్య.. ఈ పేరు వినగానే చాలామంది అందాల పోటీల్లో పాల్గొన్న అమ్మాయి అని మాత్రమే గుర్తు పడతారు. కానీ, ఆ పోటీలకు ముందే ఆమె వ్యాపారరంగంలో రాణించాలనే ఉద్దేశంతో ఆర్గానిక్ లిప్‌స్టిక్‌లను తయారు చేసి గుర్తింపు తెచ్చుకుంది. చిన్నతనం నుండి సమాజానికి ఏదో చేయాలనే ఆరాటం కలిగిన ఆమె అనుకోకుండా మోడలింగ్‌లోకి ప్రవేశించింది. ఆ రంగంలో మిస్ వరల్డ్ కెనడా టైటిల్‌ను గెలుచుకుంది. ఇటు వ్యాపారం, అటు మోడలింగ్ ద్వారా వచ్చిన ఆదాయంలో కొంతమొత్తాన్ని సామాజిక సేవకు కూడా వినియోగిస్తూ అందరి మన్ననలూ అందుకుంటున్నది. చదువు, వ్యాపారం, సేవ ఇలా మూడు రంగాల్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న కెనడాలో స్థిరపడిన మన తెలంగాణ అమ్మాయి కళ్యాణపు శ్రావ్య సక్సెస్‌మంత్ర.

# ఆర్గానిక్ లిప్‌స్టిక్ వ్యాపారి కళ్యాణపు శ్రావ్య

శ్రావ్య పుట్టింది ఖమ్మం జిల్లా. ఆమె తండ్రి రవికుమార్ ఒకప్పుడు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో వ్యవసాయ అధికారిగా పనిచేశారు. వ్యవసాయాధికారి కావడంతో వారి జీవితమంతా పైరు, పంటల చుట్టే తిరిగింది. రవికుమార్ తన ఉద్యోగ రీత్యా శ్రావ్యకు పదేండ్ల వయసు వచ్చేవరకు ఆదిలాబాద్‌లోనే ఆమె ప్రాథమికవిద్యను పూర్తి చేశారు. ఆ తరువాత వారి కుటుంబం కెనడాకు వలస వెళ్లింది. చిన్నతనం నుంచే సాంస్కృతిక, సామాజిక రంగాల పట్ల ఆసక్తి కలిగిన శ్రావ్య సాంస్కృతిక కార్యక్రమాలు, సోషల్ గ్రూప్‌లు, ఇతర సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. దీంతో తక్కువ సమయంలోనే ఆమెకు కెనడాలో చక్కటి గుర్తింపు వచ్చింది. అక్కడి యూనివర్సిటీ ఆఫ్ ఆల్బెర్టాలో బీటెక్ పూర్తి చేసింది. ఆ తరువాత కెమికల్ ఇంజినీరింగ్ కూడా చేసింది. కెనడాలోనే జరిగిన 'మిస్‌నార్తన్ ఆల్బెర్టా వరల్డ్ 2017' పోటీల్లో పాల్గొని విజయం సాధించింది. దాంతో ఆమెలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది.

### ఆర్గానిక్ లిప్‌స్టిక్

శ్రావ్య చిన్నప్పటినుంచి సమాజానికి భిన్నంగా ఉండాలనే మనస్తత్వం ఉంది. అందుకే చిన్నతనంలో అనేక రకాల ప్రయోగాలు చేసేది. అలా పాఠశాల స్థాయిలోనే స్కూల్ స్నేహితురాలితో కలిపి వంద శాతం ఆర్గానిక్ లిప్‌స్టిక్‌లను తయారు చేయాలనుకుంది. 'మనం వాడే సౌందర్య ఉత్పత్తుల్లోని చాలా పదార్థాలు పర్యావరణానికి హానిచేసేవే. అందుకే కొబ్బరి, ఆలివ్ నూనెలు, రంగు కోసం కొన్నిరకాల క్లేలు, వాసనకోసం పండ్లు.. వంటి సహజంగా దొరికే పదార్థాల మేళవింపుతో లిప్‌స్టిక్‌లు తయారుచేయాలనుకున్నా. చదువుకుంటూ ప్రయోగాలు చేయాలి కాబట్టి సరైన ఫార్ములా రావడానికి రెండేండ్లు పట్టింది. వీటిని సెలెస్టి లిప్‌స్టిక్స్ పేరుతో ఆన్‌లైన్‌లో అమ్ముతున్నారు. వారి ఉత్పత్తులకు ఉత్తర అమెరికాలో వినియోగదారులు ఎక్కువ. వినియోగదారుల నుండి విశ్వాసం పెరిగిన తర్వాత మరిన్ని కొత్త బ్రాండ్లను పరిచయం చేయాలనుకుంది. అలా బ్రాంజర్, బ్లష్, ఐక్రీం.. వంటి ఆరు రకాల ఉత్పత్తులను వంద శాతం సేంద్రియంగా తయారు చేయడం చూసింది.

### అవాంతరాలు అధిగమించి..

శ్రావ్య 'కెమికల్ ఇంజినీరింగ్' చదివింది. లిప్‌స్టిక్స్ తయారీ మొదలుపెట్టినప్పుడు ఓవైపు చదువు, మరోవైపు ప్రయోగాలతో సమయం సరిపోయేది కాదు. దానికోసం ఆమె దాదాపు 200 నుంచి 500 ఫార్ములాలు కనిపెట్టింది. కష్టపడి ఓ లిప్‌స్టిక్ తయారుచేస్తే వాసన బాగుండేది కాదు. లేదా విరిగిపోయేది. ఇలా అనేక అవాంతరాలు ఎదుర్కొంది. అయితే వాటన్నింటినీ అధికమించి లోపాల్ని దిద్దుకుంటూ ఉత్పత్తిని బయటకు తీసుకొచ్చింది. ఇందుకోసం అమ్మ, మామయ్య హోమియోపతి డాక్టర్ కావడంతో ఆయనతోనూ మాట్లాడి ఆయుర్వేదిక్ పుస్తకాలు చదివింది. అన్ని జాగ్రత్తలూ తీసుకుని మార్కెట్‌లోకి తన లిప్‌స్టిక్‌ను ప్రవేశపెట్టింది.



### సేవకోసం కొంత

చిన్నతనం నుండి సామాజిక అంశాల పట్ల ఆసక్తి ఉన్న శ్రావ్య తను సంపాదించిన దానిలో సమాజానికి కొంత ఇవ్వాలని నేర్చుకుంది. మొదటి ఏడాది తనకు వచ్చిన ఆదాయంలో కొంత మొత్తంతో 200 మంది పిల్లలకు ఉచిత ఆరోగ్యపరీక్షలు చేయించింది. రక్తహీనత బారిన పడకుండా మందుల తయారీ సంస్థలతో మాట్లాడి విటమిన్, ఐరన్ మాత్రలు ఇప్పించింది. రెండో ఏడాది ముంబయికి చెందిన నలభైమంది అంధ విద్యార్థులకు బ్రెయిలీ కిట్స్ అందించింది. మేక్ ఏ విష్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేసింది. కుకీస్‌తో పాటు ఇతర ఆహారపదార్థాలు వండి ఇంటింటికీ వెళ్లి అమ్మి నాలుగువేల డాలర్లు సేకరించింది. కొన్నాళ్లక్రితం కెనడాలో లిబరల్స్ పార్టీ శ్రావ్య గురించి తెలుసుకుని ఎంపీగా పోటీచేయమంటూ ఆహ్వానించింది. చదువు వల్ల ఆ ఆలోచనను విరమించుకున్నానంటున్నది. సమాజానికి ఎక్కువ సేవ చేయాలంటే.. రాజకీయాలే సరైన మార్గమని, ఆ దిశగా భవిష్యత్తులో ఆలోచిస్తానని అంటున్నదామె.

### పిల్లలు, మహిళలకోసం..

శ్రావ్యది స్వతంత్ర ఆలోచనా స్వభావం. అందుకే మహిళలపై జరిగే దాడులు, ఇతరాత్ర విషయా ల్లో వెంటనే స్పందించేది. ప్రపంచవ్యాప్తంగా మహిళల మీద జరిగే దాడులు, వారిపై వివక్ష పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నది. 'మనందరం కోరుకునే బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలంటే.. మహిళల ఆర్థిక స్వావలంబన ముఖ్యం' అంటారా మె. అలాగే ఆడపిల్లలు ఎంత పెద్ద చదువులు చదివినా.. సొంతకాళ్ల మీద నిలబడినప్పుడు.. వచ్చే ఆర్థిక ఆత్మవిశ్వాసమే వేరు. ఇతరులపై ఆధారపడే తత్వం తగ్గుతుంది. అందుకే శ్రావ్య ఒకవైపు చదువుకుంటూనే 'సెలెస్టి' అనే లిప్‌స్టిక్ కంపెనీలో సహభాగస్వామి అయ్యింది. చదువు, కంపెనీతోపాటు.. తనకు తోచిన సామాజిక సేవలోను పాలుపంచుకోవడం శ్రావ్య ప్రత్యేకత. కెనడాలోని కొన్ని క్లబ్బులకు వెళ్లి.. పిల్లలు, మహిళలను ఉత్సాహపరుస్తూ ఉంటుంది. శ్రావ్య కెనడాలో ఉండికూడా తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని పల్లెల్లో వైద్యశిబిరాలను నిర్వహిస్తుండడం విశేషం. హాజరైన పిల్లలకు వైద్యపరీక్షలు చేసి.. తగిన మందులను ఉచితంగా పంపిణీ చేస్తూ అందరి మన్నన అందుకుంది.



### మిస్ వరల్డ్ కెనడా

రెండేండ్ల క్రితం కెనడాలో జరిగిన 'మిస్ వరల్డ్ కెనడా' పోటీల్లో పాల్గొని శ్రావ్య ప్రజల ఓటింగ్ ద్వారా మిస్ వరల్డ్ కెనడా టైటిల్‌ను సొంతం చేసుకుంది. అనుకోకుండా పోటీల్లో పాల్గొన్నా అక్కడితో ఆగిపోలేదామె. చదువు, వ్యాపారం, సేవ అన్నింటినీ సమన్వయం చేసుకుంటున్నది. మిస్ కెనడా పోటీల గురించి చెల్లి మయూఖ చెప్పినా మొదట ఆసక్తి చూపలేదు. కారణం తను సమాజానికి ఏదో చేయాలనుకుంటున్నానని, మోడలింగ్ రంగం దానికి పూర్తి బిన్నం అని అమె అనుకుంది. అయితే అది కేవలం అందాల పోటీ మాత్రమే కాదని, దాని ద్వారా వచ్చే పేరుతో సమాజానికి మనం అనుకున్న పనులు చేయగలమని, ముఖ్యంగా ఈ రంగంలో ఉన్న వారు కూడా సామాజిక సేవ చేయొచ్చని కుటుంబసభ్యులు చెప్పడంతో దరఖాస్తు చేసింది. ఆమె గురించిన ఆ వివరాల్ని పోటీ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో పెట్టడంతో పీపుల్స్ చాయిస్‌లో భాగంగా మిస్ కెనడా టైటిల్‌ను అందుకుంది.

# బాత్రూమ్‌లో ఉంచకూడని వస్తువులు



**టూత్‌బ్రష్‌లు :** ప్రతిఒక్కరూ టూత్‌బ్రష్‌లను బాత్రూంలోనే పెట్టుకుంటారు. బాత్రూమ్‌లో పెట్టిన బ్రష్‌ను వాడడంతో అనారోగ్యానికి గురవుతారు. టూత్‌బ్రష్ కవర్ వాడడం వల్ల బ్యాక్టీరియా పెరగడానికి అనువుగా ఉంటుంది.
**గర్భనిరోధక మాత్రలు :** వాతావరణంలో కలిగే వేడి తేమ వల్ల బాత్‌రూంలో గర్భనిరోధక మాత్రలు, జలుబు, జ్వరాలకు వాడే ఇతర మాత్రలైన ఐబ్రూఫెన్, క్యాప్సూల్స్ ఉంచడం వల్ల వాటి పని సామర్థ్యం తగ్గుతుంది. అవి ఎక్స్పైరీ డేటుకు ముందే పాడయ్యేలా చేస్తుంది. వాటిని స్టవ్, సింక్, వేడి వస్తువులకు దూరంగా పెట్టండి.
**అదనపు రేజర్ బ్లేడ్లు :** తేమ వాతావరణం మెటల్ బ్లేడ్లను ఆక్సీకరణం అయ్యేలా చేసి వాడకానికి ముందే తుప్పు పట్టేలా చేస్తుంది. ఎయిర్ టైట్ ప్యాకేజీలో మూయబడి ఉంటే తప్ప, సేవింగ్ వస్తువులను కొత్త ప్రదేశంలో ఉంచండి.
**మేకప్ బ్రష్‌లు :** మేకప్ సామానులను బాత్రూంలో ఉంచుకోవడానికి సులభంగా ఉంటుంది. బయట తెరిచి పెట్టిన మేకప్ బ్రష్‌లపై టాయిలెట్ ఫ్లష్ చేసినప్పుడు హానికారక క్రిములు చేరుతాయి. గాలిలోని తేమ బ్యాక్టీరియా ఎదగడానికి సాయపడి నిజానికి బ్రష్‌ల మీదే పెరుగుతాయి. వీటిని బెడ్‌రూంలో పెట్టుకోవడమే మంచిది.
**పర్‌ఫ్యూమ్ :** ఇష్టమైన పర్‌ఫ్యూమ్‌లను బాత్‌రూంలో ఎక్కువకాలం ఉంచితే చెడ్డవాసన వస్తుంది. ఆవిరి కక్కే షవర్ స్నానాల వల్ల పెరిగే ఉష్ణోగ్రత వల్ల పర్‌ఫ్యూమ్ పుల్లగా మారుతుంది. వాటిని బెడ్‌రూంలోని అలమరలో పెట్టుకోండి. అది కూడా ఎండ పడని చోట ఎంచుకోవాలి.
**బంగారం :** రేజర్ బ్లేడ్లలాగానే మీకెంతో ఇష్టమైన నగలు కూడా తేమ వల్ల పాడవుతాయి. చవకగా దొరికే గిల్టు నగలు, మెటల్ సీలలైతే తుప్పుపడుతాయి. నిజమైన వెండి, ఇంకో గదిలో మూసి ఉంచిన నగల పెట్టెలోకన్నా త్వరగా రంగు వెలిసిపోతుంది.

# శభాష్ ఆఫీసర్

ఆ జిల్లాలోని గ్రామీణ ప్రజలకు ఎలా బతకాలో తెలియదు. సమాజంతో అసలు సంబంధమే ఉండదు. ఎన్నికలు, ఓటు హక్కు పౌష్ఠికాహారం వంటి అనేక అంశాలపై అవగాహనే లేదు. అటువంటి గ్రామాల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నది ఓ మహిళా అధికారిణి. అందుకోసం వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ఆయా అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ శభాష్ అనిపించుకుంటున్నది.



అసోంలోని హైలకండి జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా కీర్తి జల్లి ఇటీవల బాధ్యతలు స్వీకరించింది. అక్కడి మారుమూల గ్రామాల్లో వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నది. పౌష్ఠికాహారంపై అవగాహన లేక కొందరు మహిళలు, చిన్నారులు రక్తహీనతతో తనువు చాలిస్తున్నారు. ఎన్నికలు, ఓటు హక్కు గురించి అక్కడి ప్రజలకు అసలు పరిచయమే లేదు. సామాజిక అంశాలపై అవగాహన లేకపోవడంతో అక్కడి జనాలు వెనుకబడిపోతున్నారు. అటువంటి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నది. హైలకండి జిల్లా అసోం రాజధాని గౌహతికి 310 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. జిల్లాలో 75 శాతం అక్షరాస్యత ఉన్నా చాలా ఏండ్లనుంచి ఓటుహక్కు వినియోగించుకోవడం లేదు. ఈ ప్రాంతానికి తొలి మహిళా డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టింది కీర్తి. అక్కడి ప్రజల్లో ఓటుపై అవగాహన కల్పించేందుకు 'సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్'(స్వీప్) పేరుతో ప్రత్యేక ప్రచారాన్ని చేపట్టింది. హైలకండి జిల్లాలోని గ్రామాలకు చెందిన మహిళలు, చిన్నారులకు పౌష్ఠికాహారాన్ని అందిస్తూ వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నది. నెలసరిపై ఉండే అపోహలను తొలగిస్తూనే వారికి ఓటుహక్కును గురించి వివరిస్తున్నది. మహిళలు ధరించే గాజులపై ఎన్నికల తేదీని ముద్రించి వారికి పంపిణీ చేసింది. ఓటింగ్ శాతం పెంచేందుకు కీర్తి చేసిన ప్రయత్నాలు ఆమెకు మంచిపేరుతోపాటు అవార్డులు తెచ్చిపెట్టాయి. ఓటింగ్ శాతం పెంచినందుకుగాను అప్పటి భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా కీర్తి అవార్డు అందుకున్నది.

II.
నమస్తే తెలంగాణ
నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 21 అక్టోబర్ 2019



# నోబెల్ అవార్డ్స్-2019

**ప్రపంచంలోనే అత్యున్నత పురస్కారం నోబెల్. విశ్వ మానవాళికి ఉపయోగపడే వినూత్న ఆవిష్కరణలు, వివిధ రంగాల్లో విశేష కృషిచేసినవారికి ఈ బహుమతిని ప్రతి యేటా ప్రకటిస్తారు. ప్రముఖ శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ వీలునామా ప్రకారం 1901లో ప్రారంభమైన ఈ అవార్డుల ప్రదానం ఇప్పటికీ కొనసాగుతున్నది. తొలినాళ్లలో ఐదు రంగాల్లోనే నోబెల్‌ను అందించేవారు. సరిగ్గా 58 ఏండ్ల అనంతరం నోబెల్ గౌరవార్థం ఆర్థికరంగంలో కృషిచేసినవారికి ఈ అత్యున్నత పురస్కారాన్ని అందించడం స్విస్ బ్యాంకు ప్రారంభించింది. ఈ ఏడాది ప్రకటించిన విజేతలు, ఆయా రంగాల్లో వారి సేవల వివరాలు నిపుణ పాఠకుల కోసం...**

- భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం, సాహిత్యం, వైద్య, ఆర్థిక రంగాల్లో, ప్రపంచ శాంతికి విశేష కృషి చేసినవారికి, తమ పరిశోధనల ద్వారా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి మానవ సమాజానికి ఉపయోగపడిన శాస్త్రవేత్తలు, వ్యక్తులకు ప్రతి యేటా నోబెల్ బహుమతులు అందిస్తారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ మరణించిన ఐదేండ్ల తర్వాత అంటే 1901లో ఈ అవార్డుల బహూకరణ ప్రారంభమైంది. 1969 వరకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, సాహిత్యం, మెడిసిన్, శాంతి రంగాల్లో మాత్రమే స్వీడిష్ అకాడమీ అవార్డులు ప్రకటించేది. అయితే నోబెల్ గౌరవార్థం 1969 నుంచి అర్థశాస్త్రంలో విశేష కృషి చేసినవారికి బ్యాంక్ స్వీడన్ నోబెల్ బహుమతి ప్రకటిస్తున్నది. నోబెల్ బహుమతి స్థాపకుడు, ప్రఖ్యాత సైంటిస్ట్ అయిన ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజైన డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. నోబెల్ ఫౌండేషన్ నిబంధనల ప్రకారం నామినేషన్ల తుది జాబితాలో ఎవరెవరున్నారనే వివరాలను 50 ఏండ్ల వరకు వెల్లడించకూడదు.
- ప్రతి ఏడాది నోబెల్ బహుమతులు అక్టోబర్ మొదటి సోమవారం నుంచి మళ్లీ సోమవారం వరకు (శని, ఆదివారాలు మినహా) రోజుకు ఒకటి చొప్పున ఆరు రంగాల్లో ఎంపికైన వారిని అవార్డు విజేతలుగా ప్రకటిస్తారు. అంటే సోమవారం వైద్యం (2019, అక్టోబర్ 7), మంగళవారం ఫిజిక్స్ (అక్టోబర్ 8), బుధవారం కెమిస్ట్రీ (అక్టోబర్ 9), గురువారం సాహిత్యం (అక్టోబర్ 10), శుక్రవారం శాంతి బహుమతి (అక్టోబర్ 11), సోమవారం అర్థశాస్త్రం (అక్టోబర్ 14)లలో నోబెల్‌కు ఎంపికైన వారిని ప్రకటించారు.




## భారతీయులకు నోబెల్

- నోబెల్ ప్రారంభమైన 12 ఏండ్ల తర్వాత ఈ అత్యున్నత పురస్కారం భారతీయులకు దక్కింది. 1913లో సాహిత్యంలో నోబెల్ అందుకున్న రవీంద్రనాథ్ ఠాగూర్.. ఈ అవార్డు లభించిన మొదటి భారతీయుడిగా నిలిచారు. తర్వాత రసాయన శాస్త్రంలో సీవీ రామన్ (1930), వైద్యశాస్త్రంలో హరగోవింద్ ఖొరానా (1968), శాంతి బహుమతికి మదర్ థెరిసా (1979), భౌతికశాస్త్రంలో సుబ్రమణ్య చంద్రశేఖర్ (1983), అర్థశాస్త్రంలో అమర్త్యసేన్ (1998), రసాయన శాస్త్రంలో వెంకట్రామన్ రామకృష్ణన్ (2009), 2014లో కైలాష్ సత్యార్థి నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు.

## వైద్యరంగంలో..

- జీవకణాలు ఆక్సిజన్‌ను ఏ విధంగా గుర్తించి, స్వీకరిస్తాయనే అంశం (హైపోక్సియా)పై పరిశోధన చేసిన విలియమ్ జీ కెలిన్ జూనియర్, సర్ పీటర్ జే రాట్‌క్లిఫ్, గ్రెగ్ ఎల్ సెమెన్జాలకు నోబెల్ పురస్కారం లభించింది. శరీరంలోని ఆక్సిజన్ స్థాయిలను ఎలా గుర్తిస్తాయో, ఆ స్థాయిలకు అనుగుణంగా తమ పనితీరును ఎలా మార్చుకుంటాయనే విషయంపై వీరు పరిశోధనలు చేశారు. ఇవి రక్తహీనత, క్యాన్సర్ తదితర వ్యాధుల చికిత్సలో ఉపయోగపడతాయి.
- విలియమ్ కెలిన్ హార్వర్డ్ హ్యూస్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో, గ్రెగ్ సెమెన్జా జాన్ హాప్కిన్స్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెల్ ఇంజినీరింగ్‌లో పరిశోధకులుగా, పీటర్ రాట్‌క్లిఫ్ ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్‌లో శాస్త్రవేత్తగా సేవలు అందిస్తున్నారు. వీరికి సంయుక్తగా 9.18 లక్షల అమెరికన్ డాలర్ల (రూ. 6.51 కోట్లు) నగదు బహుమతిని అందిస్తారు.
- గతేడాది వైద్యరంగంలో జేమ్స్ పీ అలిసన్ (అమెరికా), తసుకు హోంజో (జపాన్)లు నోబెల్ అందుకున్నారు.

## ఫిజిక్స్

- విశ్వ పరిణామక్రమంపై పరిశోధనలు చేసిన జేమ్స్ పీబుల్స్, సుదూరంగా ఉన్న సూర్యుడి లాంటి నక్షత్రం చుట్టూ తిరుగుతున్న గ్రహాన్ని కనిపెట్టిన మిచెల్ మేయర్, డిడియర్ క్యులోజ్‌లకు ఈ ఏడాది నోబెల్ బహుమతి లభించింది.
- కెనడాలో జన్మించిన అమెరికన్ పీబుల్స్ మహావిస్ఫోటనం (బిగ్‌బ్యాంగ్) అనంతరం విశ్వం ఎలా రూపాంతరం చెందింది, విశ్వంలో భూమి స్థానం గురించి పరిశోధనలు చేశారు. బిగ్ బ్యాంగ్ తర్వాత వెలువడిన ఉష్ణమైన కాస్మిక్ మైక్రోవేవ్ బ్యాక్‌గ్రౌండ్ (సీఎంబీ) రేడియేషన్ ఉనికి నిజమేనని తేల్చారు. సీఎంబీని అధ్యయనం చేయడంద్వారా విశ్వం వయస్సు, ఆకృతి, విశ్వంలోని వస్తువులను శాస్త్రవేత్తలు అంచనావేయగలుగుతున్నారు.
- 84 ఏండ్ల పీబుల్స్ ప్రస్తుతం న్యూజెర్సీ (అమెరికా)లోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో సేవలందిస్తున్నారు.
- రేడియల్ వెలాసిటీ టెక్నిక్‌తో భూమికి 50 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న నక్షత్రం చుట్టూ '51 పెగాసి బి' అనే గ్రహం తిరుగుతున్నదని స్విట్జర్లాండ్‌కు చెందిన మిచెల్ మేయర్, క్యులోజ్‌లు 1995లో కనుగొన్నారు. ప్రస్తుతం వీరిద్దరు స్విట్జర్లాండ్‌లోని జెనీవా విశ్వవిద్యాలయంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు.
- 2018లో లేజర్ ఫిజిక్స్ రంగంలో ఆవిష్కరణలకు ఆర్థర్ అస్కిన్ (అమెరికా), గెరార్డ్ మౌరౌ (ఫ్రాన్స్), డోనా స్ట్రిక్‌లాండ్ (కెనడా)లు నోబెల్ అందుకున్నారు.

## కెమిస్ట్రీ

- మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర పోర్టబుల్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాహనాల్లో విరివిగా ఉపయోగించే లిథియం-అయాన్ బ్యాటరీల అభివృద్ధికి కృషిచేసిన జాన్ బీ గుడ్‌ఎనఫ్, ఎం స్టాన్లీ విటింగ్‌హామ్, అకీరా యోషినోలకు రసాయన శాస్త్రంలో నోబెల్ లభించింది.
- బ్రిటన్‌కు చెందిన 77 ఏండ్ల స్టాన్లీ విటింగ్‌హామ్ అధిక శక్తినిచ్చే 'టైటానియం డైసల్ఫైడ్' అనే మెటీరియల్‌ను కనుగొన్నారు. ప్రస్తుతం ఆయన అమెరికాలోని బింగాంప్టన్ వర్సిటీలో పని చేస్తున్నారు.
- జర్మనీలో పుట్టిన అమెరికన్ జాన్ బీ గుడ్‌ఎనఫ్‌కు ప్రస్తుతం 97 ఏండ్లు. ఆయన ప్రస్తుతం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. నోబెల్ పురస్కార చరిత్రలో అత్యధిక వయస్సులో ఈ అవార్డుకు ఎంపికైన వ్యక్తిగా రికార్డుల్లో నిలిచారు. ఆయన రూపొందించిన క్యాథోడ్‌ను ప్రాతిపదికగా చేసుకుని జపాన్‌కు చెందిన శాస్త్రవేత్త అకీరా యోషినో వాణిజ్యపరంగా అనువైన తొలి లిథియం-అయాన్ బ్యాటరీని రూపొందించారు. అకీరా ప్రస్తుతం మీజో విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు.
- గతేడాది రసాయన శాస్త్రంలో ఫ్రాన్సిస్ ఆర్నాల్డ్, జార్జ్ పీ స్మిత్ (అమెరికా), గ్రెగరీ వింటర్ (బ్రిటన్)లకు నోబెల్ లభించింది.

## సాహిత్యం

- సాహిత్యంలో 2018, 19కి సంబంధించిన పురస్కారాలను నోబెల్ కమిటీ ప్రకటించింది. 2018కి గాను పోలెండ్ రచయిత్రి ఓల్గా టోకార్క్యుజుక్, 2019కిగాను ఆస్ట్రియాకు చెందిన నవల, నాటక రచయిత పీటర్ హండ్కేకి లభించింది.
- సరిహద్దులు దాటడం జీవితంలో ఒక భాగం అని చెబుతూ ప్రముఖ పర్యావరణవేత్త, స్త్రీవాది, నవలా రచయిత్రి ఓల్గా టోకార్క్యుజుక్ రాసిన ఒక కల్పిత కథనమైన 'ద బుక్స్ ఆఫ్ జాకోబ్' అనే నవల ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యింది. పోలిష్ భాషలో రాసే ఓల్గా 1962, జనవరి 29 పోలెండ్‌లోని వెస్టన్ టౌన్‌లో జన్మించారు. ఆమె మొదటి నవల 'ద జర్నీ ఆఫ్ ద పీపుల్ ఆఫ్ ద బుక్' కాగా, ఫ్లైట్స్, ద బుక్స్ ఆఫ్ జాకోబ్ వంటి పుస్తకాలు రాశారు.
- ఇప్పటివరకు 14 మంది మహిళలు మాత్రమే నోబెల్ అందుకున్నారు. ఓల్గా 15వ మహిళ కావడం విశేషం.
- నాటక రచయిత, నవలాకారుడు అయిన పీటర్ హండ్కే పూర్తి స్వచ్ఛమైన జర్మన్ భాషా రచయితల్లో ఒకరు. ఆయన 1942, డిసెంబర్ 6న ఆస్ట్రియాలో జన్మించారు. 1966లో 'ద హార్నెట్' అనే నవలతో ఆయన సంచలనం సృష్టించారు. తన తల్లి ఆత్మహత్యపై ఆయన రాసిన 'ఏ సారో బియాండ్ డ్రీమ్స్' అనే రచన అత్యంత ప్రజాదరణ పొందింది. దీన్ని 1971లో రాయగా, 1975లో వెలువడింది. ఆయన రాసిన సంభాషణలు లేని నాటకం 'ద అవర్ వియ్ న్యూ నథింగ్ ఆఫ్ ఈచ్ అదర్' ప్రసిద్ధి చెందగా, కవితా సంకలనం అయిన 'షార్ట్ లెటర్, లాంగ్ ఫేర్‌వెల్', ద ఇన్నర్‌వరల్డ్ ఆఫ్ ద ఔటర్ వరల్డ్ ఆయన ప్రముఖ రచనలు.
- లైంగిక దాడి ఆరోపణలతో గతేడాది సాహిత్యంలో నోబెల్ ప్రకటించలేదు. ప్రపంచ యుద్ధాల సమయంలో ఆరేండ్లు మినహాయించి ఈ పురస్కారాన్ని 1901 నుంచి ఇప్పటివరకు రెండుసార్లు (1935, 2018లో) మాత్రమే ప్రకటించలేదు.







## దంపతులకు నోబెల్

- ఇప్పటి వరకు ఆరుగురు దంపతులకు నోబెల్ బహుమతి లభించింది. మొదటిసారిగా 1903లో పియర్ క్యూరీ, మేరీ క్యూరీ దంపతులకు నోబెల్ లభించింది. వీరు రేడియో ధార్మిక శక్తిని కనుగొనడంతోపాటు యురేనియం, థోరియం మూలకాలపై పరిశోధన చేశారు.



- రేడియో ధార్మిక మూలతత్వాల కృత్రిమ నిర్మాణం గురించి కనుగొన్నందుకు ఫ్రెడరిక్ జోలియట్, ఇరీన్ జోలియట్ క్యూరీ దంపతులకు 1935లో ఈ పురస్కారం లభించింది.
- గ్లైకోజెన్, గ్లూకోజ్ మెటబాలిజమ్‌లతోపాటు కెటాలిక్ కన్వర్షన్ ఆఫ్ గ్లైకోజిన్‌పై పరిశోధనలకు 1947లో వైద్యశాస్త్రంలో గెర్టీ, కార్ల్ కోరి దంపతులు నోబెల్ అందుకున్నారు.
- మెదడులో కణాలకు ఒక స్థానవ్యవస్థ ఉంటుందని కనుగొన్న ఎడ్వర్డ్ ఐ మోసర్, మే బ్రిట్ దంపతులకు 2014లో నోబెల్ లభించింది.
- ప్రపంచ పేదరికంపై చేసిన పరిశోదనలకు గాను అభిజిత్ బెనర్జీ, ఎస్తర్ డఫ్లో 2019లో నోబెల్ అందుకున్నారు.
- దంపతులైన గున్నార్ మిర్డాల్, అల్వా మిర్డాల్‌కు వేర్వేరు రంగాల్లో నోబెల్ లభించింది. 1974లో గున్నార్ మిర్డాల్ (ఆర్థికం), 1984లో అల్వా మిర్డాల్ (శాంతి) ఈ అత్యున్నత పురస్కారం అందుకున్నారు.

## అర్థశాస్త్రం

- ఈ ఏడాది ఆర్థిక నోబెల్ ప్రవాస భారతీయుడు అభిజిత్ బెనర్జీ, ఫ్రెంచ్ అమెరికన్ ఎస్తర్ డఫ్లో, అమెరికన్ ఆర్థికవేత్త మైకేల్ క్రెమెర్‌లకు సంయుక్తంగా లభించింది. ప్రపంచవ్యాప్తంగా పేదరికాన్ని నిర్మూలించడానికి పరిశోధనలు చేసి ఆర్థికరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినందుకుగాను వారు నోబెల్‌కు ఎంపికయ్యారు. క్షేత్రస్థాయిలో పేదల స్థితిగతులు ఎలా ఉన్నాయి, వారికి కనీస జీవన ప్రమాణాలు ఎందుకు అందడంలేదనే ప్రశ్నలు వేసుకుని, వాటికి పరిష్కారమార్గాలు అన్వేషించాలనే సిద్ధాంతం ఆధారంగా వీరు తమ పరిశోధనలు కొనసాగించారు. భార్యాభర్తలైన బెనర్జీ, ఎస్తర్ డఫ్లోలు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో, క్రెమెర్ హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు.
- అర్థశాస్త్రంలో ఇప్పటివరకు నోబెల్ అందుకున్న వారిలో డఫ్లో అత్యంత పిన్నవయస్కురాలు, రెండో మహిళగా రికార్డుల్లోకెక్కారు. మొదటిసారిగా నోబెల్ బహుమతిని ఎలినార్ ఓస్ట్రమ్ 2009లో అందుకున్నారు.
- గతేడాది విలియమ్ డీ నోర్డాస్, పాల్ ఎం రోమర్ (అమెరికా)లు అందుకున్నారు.
- ఈ ఏడాదితో అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతికి 50 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ పురస్కారాన్ని మొదటి సారిగా రగ్నార్ ఫ్రిష్, జాన్ టిన్‌బర్జెన్ 1969లో అందుకున్నారు.
- అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతలకు పురస్కారంతోపాటు 9 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల (రూ.65,38,914) నగదు బహుమతి అందిస్తారు.

## అభిజిత్ బెనర్జీ

- 1961, ఫిబ్రవరి 21న ముంబైలో పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రొఫెసర్ నిర్మల, దీపక్ బెనర్జీ దంపతులకు జన్మించారు. ఆయన పూర్తిపేరు అభిజిత్ వినాయక్ బెనర్జీ. కోల్‌కతా ప్రెసిడెన్సీ కాలేజీలో బీఎస్సీ చేసిన ఆయన ఢిల్లీలోని జేఎన్‌యూలో ఎంఏ పూర్తిచేశారు. హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి 1988లో పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రస్తుతం ఆయన మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో ఆర్థిక శాస్త్రం విభాగంలో ఫోర్డ్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.
- తన భార్య ఎస్తర్ డుఫ్లో, సెంధిల్ ములియనాథన్‌తో కలిసి ఎంఐటీలో అబ్దుల్ లతీఫ్ జమీల్ పావర్టీ యాక్షన్ ల్యాబ్ (జే-పాల్)ను నెలకొల్పారు. ప్రస్తుతం ఒక డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆయన ఎకనామిక్ అనాలిసిస్ ఆఫ్ డెవలప్‌మెంట్‌లోని రిసెర్చ్ బ్యూరోకి ప్రెసిడెంట్‌గా పనిచేశారు. అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ సభ్యుడిగా ఎన్నికయ్యారు.
- '2015 తర్వాత అభివృద్ధి ఎజెండా' అనే అంశంలో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన హైలెవల్ ప్యానెల్ ఆఫ్ ఎమినెంట్ పర్సన్స్‌లో అభిజిత్ పనిచేశారు.
- వివిధ పత్రికలకు ఆర్టికల్స్ రాయడంతోపాటు, రెండు డాక్యుమెంటరీలకు దర్శకత్వం వహించిన బెనర్జీ.. వలాటిలిటీ అండ్ గ్రోత్, అండర్‌స్టాండింగ్ పావర్టీ, మేకింగ్ ఎయిడ్ వర్క్ (2007), వాట్ ద ఎకానమీ నీడ్స్ నౌ (2019) అనే పుస్తకాలు, తన భార్య డఫ్లోతో కలిసి పూర్ ఎకనామిక్స్ (2011), గుడ్ ఎకనామిక్స్ ఫర్ హార్డ్ టైమ్స్-బెటర్ ఆన్సర్స్ టు అవర్ బిగ్గెస్ట్ ప్రాబ్లమ్స్ అనే పుస్తకాలు రాశారు.
- విశేష ఆధారణ పొందిన 'పూర్ ఎకనామిక్స్' పుస్తకం 17 భాషల్లోకి అనువాదం అయ్యింది. 2011లో గోల్డ్‌మ్యాన్ సాచ్స్ బిజినెస్ బుక్ ఆఫ్ ది ఇయర్, ఫైనాన్షియల్ టైమ్స్ అవార్డులను గెలుచుకుంది.
- 2009లో సోషల్ సైన్సెస్ విభాగంలో అర్థశాస్త్రంలో ఇన్ఫోసిస్ బహుమతి, 2014లో కైల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద వరల్డ్ ఎకానమీ నుంచి బెర్నార్డ్ హార్మ్స్ ప్రైజ్ అందుకున్నారు.

## శాంతి

- శాంతిస్థాపనకు, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించేందుకు కృషిచేసిన ఇథియోపియా ప్రధాని అబే అహ్మద్‌కు నోబెల్ శాంతి బహుమతి దక్కింది. ఇథియోపియా, ఎరిత్రియా దేశాల మధ్య 20 ఏండ్లుగా నలుగుతున్న సరిహద్దు సమస్యకు 2018లో ఆయన ముగింపు పలికారు. ఇరు దేశాల మధ్య సమస్యగా మారిన బాడ్మే పట్టణం కోసం ఇరు దేశాలు 1998 నుంచి రెండేండ్లపాటు యుద్ధానికి దిగాయి. అయితే 2018, ఏప్రిల్‌లో ఇథియోపియా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అబే అహ్మద్ ఎలాంటి షరతులు లేకుండా ఎరిత్రియాతో శాంతి ఒప్పందం చేసుకున్నారు. ప్రస్తుతం 43 ఏండ్ల వయస్సులో ఉన్న ఆయన 1976, ఆగస్టు 15న అగరోలో జన్మించారు. ఆఫ్రికాలో అత్యంత పిన్నయస్సు ఉన్న దేశాధినేతగా రికార్డుల్లోకెక్కారు.
- టెక్నాలజీపై మక్కువతో టీనేజ్‌లోనే మిలిటరీలో రేడియో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించిన ఆయన లెఫ్టినెంట్ కల్నల్ స్థాయికి ఎదిగారు.
- ఈ పురస్కారం కింద ఆయనకు నోబెల్ మెడల్‌తోపాటు నోబెల్ డిప్లొమా, 90 లక్షల క్రోనార్ల (సుమారు రూ. 6.48 కోట్లు) నగదు బహుమతి లభిస్తాయి. ఈ ఏడాది శాంతి పురస్కారానికి 223 మందితోపాటు 78 సంస్థలు ఎంపికయ్యాయి.
- గతేడాది డెనిస్ ముక్వేజ్ (డెమొక్రటిక్ కాంగో), నదియా మురాద్ (ఇరాన్)లు శాంతి బహుమతి అందుకున్నారు.
- 1901 నుంచి ఇప్పటివరకు 100 నోబెల్ శాంతి పురస్కారాలను ప్రకటించారు. ఇందులో 24 సంస్థలు పురస్కారానికి ఎంపికయ్యాయి. ఒక్కరు మాత్రమే దీన్ని తిరస్కరించారు.
- ఇప్పటివరకు నోబెల్ శాంతి బహుమతి అందుకున్నవారిలో మదర్ థెరిస్సాతోపాటు 17 మంది మహిళలు ఉన్నారు. 1973లో ఈ అవార్డుకు ఎంపికైన వియాత్నాంకు చెందిన లె డ్యుక్ థో తిరస్కరించారు.
- మొత్తంగా నోబెల్ శాంతి అవార్డులను ఆరుగురు నిరాకరించగా, 54 మంది మహిళలకు ఈ అత్యున్న పురస్కారం లభించింది.

## నోబెల్‌తో కోల్‌కతాకు అనుబంధం!

- నోబెల్ అందుకున్న భారతీయులు, భారత సంతతికి చెందినవారిలో ఆరుగురు కోల్‌కతాతో ఏదో విధంగా సంబంధం ఉన్నవారే.
- తొలి నోబెల్ అందుకున్న రవీంద్రనాథ్ ఠాగూర్ బెంగాలీ సాహిత్యానికి పునర్‌నిర్వచనం చేశారు. కోల్‌కతాలో శాంతినికేతన్‌ను స్థాపించారు.
- భౌతిక శాస్త్రంలో నోబెల్ అందుకున్న సీవీ రామన్ మద్రాస్‌లో జన్మించినప్పటకీ కలకత్తా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు.
- 1979లో శాంతి బహుమతి అందుకున్న మదర్ థెరిసా కోల్‌కతాలో చారిటీ మిషనరీలను నెలకొల్పారు.
- సంక్షేమ అర్థశాస్త్రంతో నోబెల్ అందుకున్న ఆర్థికవేత్త అమర్త్యసేన్ శాంతినికేతన్‌లో జన్మించారు. ప్రెసిడెన్సీ కాలేజీలో విద్యనభ్యసించారు.
- ఈ ఏడాది నోబెల్ పొందిన అభిజిత్ బెనర్జీ కూడా ప్రెసిడెన్సీ కాలేజీలో డిగ్రీ చదడంతోపాటు కోల్‌కతా ప్రధాన కేంద్రంగా నడుస్తున్న బంధన్ బ్యాంక్‌తో కలిసి పనిచేశారు.
- భారతీయుడు కానప్పటికీ మలేరియాపై జరిపిన పరిశోధనలకుగాను రోనాల్డ్ రాస్ 1902లో మెడిసిన్‌లో నోబెల్ అందుకున్నారు. ఆయన కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జనరల్ దవాఖానలో పనిచేశారు.

## మహిళలకు నోబెల్

- ఇప్పటివరకు మొత్తం 54 మంది మహిళలకు నోబెల్ అవార్డులు లభించాయి. ఇందులో శాంతి బహుమతి అత్యధికంగా 17 మంది అందుకోగా, సాహిత్యంలో 15 మందికి లభించింది. భౌతిక, రసాయన శాస్త్రం విభాగాల్లో మేడం క్యూరీ రెండుసార్లు ఈ అత్యున్నత అవార్డు అందుకున్నారు. 2009లో నాలుగు విభాగాల్లో అత్యధికంగా ఐదుగురు మహిళలు నోబెల్ అవార్డు అందుకున్నారు.

**వైద్యం**

- మొత్తం 12 మంది మహిళలకు ఈ పురస్కారం లభించింది. గెర్టీ థెరిసా కోరి (1947), రోసాలిన్ యాలో (1977), బార్బరా మెక్‌క్లింటాక్ (1983), రీటా లెవి మోంటాల్కిని (1986), జెర్ట్రూడ్ బీ ఇలియన్ (1988), క్రిస్టియానే నుస్లీన్‌వోల్హార్డ్ (1995), లిండా బక్ (2004), ఫ్రాంకోయిస్ సినౌస్సీ (2008), ఎలిజబెత్ బ్లాక్‌బర్న్, కరోల్ గ్రైడర్ (2009), మే బ్రిట్ మోసర్ (2014), టు యూయూ (2015).

**భౌతిక శాస్త్రం**

- ఈ అవార్డును మొత్తం ముగ్గురు అందుకున్నారు. 1903లో మేరీ క్యూరీ, 1963లో మరియా మేయర్, 2018లో డోనా స్ట్రిక్ లాండ్.

**రసాయన శాస్త్రం**

- ఇప్పటివరకు మొత్తం ఐదుగురు మహిళలు ఈ అవార్డును అందుకున్నారు. వారు.. మేరీ క్యూరీ (1911), ఇరీన్ జోలియట్ క్యూరీ (1935), డొరోథీ క్రౌఫుట్ హాడ్కిన్ (1964), అదా యోనత్ (2009), ఫ్రాన్సిస్ హెచ్ ఆర్నాల్డ్ (2018).

**సాహిత్యం**

- ఇప్పటి వరకు మొత్తం 15 మంది ఈ అవార్డును అందుకున్నారు. సెల్మా లాగర్‌లోఫ్ (1909), గ్రాజియా దెలెద్దా (1926), సిగ్రిడ్ అండ్సెట్ (1928), పెర్ల్ బక్ (1938), గాబ్రియేలా మిస్ట్రల్ (1945), నెల్లి సాచ్స్ (1966), నడిన్ గోర్డిమెర్ (1991), టోనీ మోరిసన్ (1993), విస్లావా జింబోర్‌స్కా (1996), ఎల్ఫ్రిడే జెలినెక్ (2004), డోరిస్ లెస్సింగ్ (2007), హెర్టా ముల్లర్ (2009), అలైస్ మన్రో (2013), స్వెట్లానా అలెక్సీవిచ్ (2015), ఓల్గా టొకర్జుక్ (2018).

**శాంతి**

- మొత్తం 17 మంది ఈ అవార్డు అందుకున్నారు. బెర్తా వాన్ సట్నెర్ (1905), జాన్ ఆడమ్స్ (1931), ఎమిలీ గ్రీని బాల్చ్ (1946), బెట్టి విలియమ్స్, మైరిడ్ మగ్వైర్ (1976), మదర్ థెరిసా (1979), ఆల్వా మిర్డల్ (1982), ఆంగ్‌సాన్ సూకీ (1991), రిగోబెర్టా మెంచూ (1992), జోడి విలియమ్స్ (1997), షిరిన్ ఎబాది (2003), వాంగారి మథాయ్ (2004), ఎలెన్ జాన్సన్ సిర్లీఫ్, లిమా బొవీ, తవక్కెల్ కార్మన్ (2011), మలాలా యూసఫ్‌జాయ్ (2014), నదియా మురాద్(2018).

## జే-పాల్

- శాస్త్రీయ పద్ధతుల ద్వారా పేదరికాన్ని నిర్మూలించడానికి అవసరమైన పాలసీలను రూపొందించడం ఎలా అనే అంశాలపై అబ్దుల్ లతీఫ్ జమీల్ పావర్టీ యక్షన్ ల్యాబ్ (జే-పాల్) పనిచేస్తుంది. 2003లో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో ప్రారంభమైన ఈ పావర్టీ యాక్షన్ ల్యాబ్‌కు 2005లో అబ్దుల్ లతీఫ్ జెమీల్ పావర్టీ యాక్షన్ ల్యాబ్ అని పేరు పెట్టారు. ఇది పేదరిక నిర్మూలనలో భాగంగా ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానాలను కనుగొనడంతోపాటు, ఇందులో ప్రభుత్వాల భాగస్వామ్యం పెంపొందించడం, ఎన్‌జీవోలను ఇందులో భాగం చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతుంది. జే-పాల్‌కు చెందిన 170 మంది ప్రొఫెసర్లు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 81 కేంద్రాల్లో 948కిపైగా విశ్లేషణలు అందించారు. 1500 మందికి శిక్షణ ఇచ్చారు.
- ఇది ఓపెన్ ఎన్‌రోల్‌మెంట్ కోర్సులు (ఎవాల్యుంగ్ సోషల్ ప్రోగ్రామ్స్, మెజర్‌మెంట్ అండ్ సర్వే డిజైన్), కస్టమ్స్ కోర్సులు (ఎవాల్యుయేటింగ్ సోషల్ ప్రోగ్రామ్స్, మెజర్‌మెంట్ అండ్ సర్వే డిజైన్, అడ్వాన్డ్ ఇంపాక్ట్ ఎవాల్యుయేషన్), ఆన్‌లైన్ కోర్సులు (ఎవాల్యుయేటింగ్ సోషల్ ప్రోగ్రామ్స్, మెజరింగ్ హెల్త్ ఔట్‌కమ్స్ ఇన్ ఫీల్డ్ సర్వేస్, అడ్రసింగ్ హెల్త్ చాలెంజెస్ ఇన్ ఆఫ్రికా, డాటా, ఎకనామిక్స్ అండ్ డెవలప్‌మెంట్ పాలసీ) అందిస్తున్నది. ఇవి ఆయా ప్రాంతాలను బట్టి ఉంటాయి.

J-PAL
ABDUL LATIF JAMEEL POVERTY ACTION LAB

**ఆర్థికం**

- ఇప్పటివరకు ఈ అవార్డును ఇద్దరు మహిళలు.. ఎలినార్ ఓస్ట్రమ్ (2009), ఎస్తార్ డఫ్లో (2019) మాత్రమే అందుకున్నారు.

...✍ **గణేష్ సుంకరి**

# మోదీ టర్కీ పర్యటన రద్దు!

- కశ్మీర్‌పై ఆ దేశ అధ్యక్షుడి వ్యాఖ్యలే కారణమని సమాచారం
- ఈ నెలాఖరులో టర్కీలో పర్యటించాల్సిన మోదీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** ప్రధాని నరేంద్ర మోదీ టర్కీ పర్యటన రద్దయింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో కశ్మీర్‌లో ఆర్టికల్ 370 ఎత్తివేత అంశాన్ని లేవనెత్తడంతోపాటు పారిస్‌లో జరిగిన ఎఫ్ఏటీఎఫ్ సమావేశంలో పాకిస్థాన్‌కు అనుకూలంగా టర్కీ దేశాధ్యక్షుడు రెసిప్ తయ్యిప్ ఎర్డోగాన్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మోదీ పర్యటన రద్దయినట్టు తెలుస్తున్నది. గత ఏడాది జూన్‌లో ఒసాకాలో భేటీ సందర్భంగా ప్రధాని మోదీని టర్కీలో పర్యటించాల్సిందిగా ఎర్డోగాన్ ఆహ్వానించారు. ఈ నెల 27, 28 తేదీల్లో సౌదీ అరేబియాలో జరుగనున్న మెగా ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో పాల్గొననున్న మోదీ అక్కడి నుంచి టర్కీ రాజధాని అంకారా వెళ్లాల్సిఉంది. ఐక్యరాజ్యసమితి సమావేశంలో ప్రసంగించిన ఎర్డోగాన్.. దూకుడు నిర్ణయాలు తీసుకోకూడదంటూ భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్‌లో స్వయం ప్రతిపత్తిని ఎత్తివేయడం వల్ల అక్కడ దాదాపు ఎనభై లక్షల మంది జీవనం స్తంభించిపోయిందని, అక్కడ మానవ హక్కులకు తీవ్రంగా విఘాతం కలుగుతున్నా అంతర్జాతీయ సమాజం మాట్లాడకపోవడం విచారకరమంటూ ఎర్డోగాన్ మాట్లాడారు. ఈ వ్యాఖ్యలను భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రవీశ్‌కుమార్ అప్పుడే ఖండించారు. కశ్మీర్‌లో వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా మాట్లాడవొద్దంటూ ఆయన టర్కీకి సూచించారు. ఇలాఉండగా, ప్రధాని మోదీ టర్కీ పర్యటన రద్దు వార్తలపై భారత విదేశాంగశాఖ స్పందించింది. అసలు మోదీ పర్యటనే ఖరారు కానప్పుడు ఇక రద్దు అనేది ఎలా ఉత్పన్నమవుతుందని ప్రశ్నించింది.



# పురీషనాళంలో బంగారం పేస్ట్

- 832 గ్రాముల బంగారం పేస్ట్‌ను పట్టుకున్న డీఆర్ఐ
- శంషాబాద్ విమానాశ్రయంలో ఒకరి అరెస్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బంగారం స్మగ్లర్లు ఎన్ని అడ్డదారులు తొక్కినా డీఆర్ఐ అధికారులు కనిపెట్టేస్తున్నారు. ప్రాణాలకు తెగించి ఓ దొంగ బంగారాన్ని పేస్ట్‌లా మార్చి దాన్ని క్యాప్సుల్స్‌లాచేసి ఏకంగా పురీషనాళంలో దాచుకొని తెచ్చిన ఘటన శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వెలుగుచూసింది. అతన్ని అరెస్టు చేయడంతోపాటు రూ.27,87,400 విలువైన పేస్ట్ బంగారాన్ని డీఆర్ఐ హైదరాబాద్ యూనిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముంబై నుంచి హైదరాబాద్‌కు ఎయిర్ ఇండియా విమానం నంబర్ ఏ1-50లో ఓ ప్రయాణికుడు శుక్రవారం బంగారంతో వస్తున్నట్టు సమాచారం అందింది. అధికారులు అనుమానాస్పదంగా ఉన్న ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా పురీషనాళంలో పేస్ట్ బంగారాన్ని పెట్టుకొని తరలిస్తున్నట్టు అంగీకరించాడు. బంగారాన్ని పేస్ట్‌లా మార్చి నలుపు రంగు టేప్‌లో చుట్టి చిన్నచిన్న బాల్స్‌లా తయారుచేసి పురీషనాళంలో చొప్పించుకొన్నట్టు గుర్తించి అధికారులు వెలికితీయించారు. మొత్తం 832 గ్రాముల పేస్ట్‌ను కరిగించగా 724 గ్రాముల బంగారం బయటపడింది. ముంబైలో తనకు తెలిసిన ఓ స్నేహితుడు ఇచ్చిన పేస్ట్ బంగారాన్ని తాను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టు సదరు ప్రయాణికుడు అంగీకరించినట్టు డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అడిషనల్ డీజీ డీపీ నాయుడు తెలిపారు.



పట్టుబడ్డ బంగారం



అభివృద్ధి నిరోధకులకు వ్యతిరేకంగా

# ప్రజా ఉద్యమం రావాలి

కేంద్రమంత్రి గోయల్ పిలుపు

**పనాజీ, అక్టోబర్ 20:** అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటున్న వారికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపట్టాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. శనివారం గోవాలో జరిగిన వైబ్రంట్ గోవా బిజినెస్ కాన్‌క్లేవ్ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గోవాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడానికి కొందరు (ఎన్జీవోలు) కోర్టులకు ఎక్కుతున్నారు. వీరి చర్యల వల్ల పేదవారికి న్యాయం జరుగడం లేదు. ఇలాంటి వారికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం రావాలి' అని పేర్కొన్నారు. రోడ్లు నిర్మించడాన్ని, హోటళ్లు ఏర్పాటుచేయడాన్ని, విమానాశ్రయాలను నెలకొల్పడాన్ని, పోర్టులను విస్తరించడాన్ని కొందరు అడ్డుకుంటున్నారు. దీంతో గోవాలో అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? అని పీయూష్ అన్నారు. గోవాలో నిర్మించతలపెట్టిన అంతర్జాతీయ విమానాశ్రయంపై సుప్రీంకోర్టు స్టే విధించడాన్ని, మార్మగోవా పోర్టు విస్తరణను జాతీయ హరిత ట్రిబ్యునల్ అడ్డుకుంది. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని వీటికి న్యాయస్థానాలు అడ్డుకట్ట వేశాయి. పీయూష్ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖండించింది. గోవా కాంగ్రెస్ అధ్యక్షుడు గిరిశ్ ఛోదాంకర్ మాట్లాడుతూ 'ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానిక ఎన్జీవోలు కోరుతున్నారు. ఇలా వారు కోరడం రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం కాదు. అలాంటి వారిపై మంత్రి వ్యాఖ్యలు సరికావు' అని పేర్కొన్నారు.



## నీటితొట్టిలో పడి చిన్నారి మృతి

**చెన్నారావుపేట:** ఆడుకుంటూ నీటితొట్టిలో పడి రెండేండ్ల బాలుడు మృతి చెందిన ఘటన ఆదివారం వరంగల్ రూరల్ జిల్లాలో జరిగింది. చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామ శివారు కట్టయ్యపల్లెలో జిడ్డి శ్రీను, భవాని దంపతుల కుమారుడు జాను ఆడుకుంటూ ఇంటి సమీపంలో ఉన్న నీటితొట్టిలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాలుడి తల్లి భవాని ప్రస్తుతం నిండు గర్భిణి. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి బాలుడి తల్లిదండ్రులను పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

# గతిలేకే మోదీని ఎన్నుకున్నారు!

- ఆయన తీసుకున్న ప్రతి నిర్ణయానికీ ప్రజలు ఓట్లేయలేదు
- ఎన్నికల విజయాన్ని ప్రభుత్వ విధానాలకు ఆమోదం తెలిపినట్లుగా భావించకూడదు
- దేశంలో బలమైన ప్రతిపక్షం అవసరం
- నోబెల్ విజేత అభిజిత్ బెనర్జీ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** ప్రధాని నరేంద్రమోదీ నిజంగా ప్రజాదరణ కలిగినవారు అని, అయితే ప్రతిపక్షంలో సరైన నాయకుడు కనిపించకపోవడంతోనే ప్రజలు మోదీకి ఓట్లేశారని నోబెల్ పురస్కార విజేత అభిజిత్ బెనర్జీ అభిప్రాయపడ్డారు. శనివారం ఓ జాతీయ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజలు 'ఏకమొత్తంగా' మోదీకి ఆమోదం తెలిపారని, ఎన్నికల విజయాన్ని ప్రభుత్వ విధానాలకు ఆమోదం తెలిపినట్లుగా భావించకూడదని చెప్పారు. అభిజిత్ వామపక్షవాది అని, ఆయన ప్రతిపాదించిన 'న్యాయ్' పథకం ఎన్నికల్లో తిరస్కరణకు గురైందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలపై అభిజిత్ స్పందిస్తూ.. 'మోదీకి ప్రజలు ఓట్లేశారు.. కానీ ఆయన తీసుకున్న ప్రతి నిర్ణయానికీ కాదు' అని పేర్కొన్నారు. 'ఏ ప్రభుత్వమైనా ఓ వంద పనులు చేస్తుంది. వాటిన్నింటిపైనా ప్రజలు ఓట్లేయాలి. వారు చాలా వరకు మోదీకి ఓటేశారు. ప్రతిపక్షంలో ఓట్లేయదగ్గ నాయకుడు లేడని ప్రజలు భావించారు. మోదీకి నిజంగానే ప్రజాదరణ ఉందని నేను భావిస్తున్నా. అయితే ఆయన తీసుకున్న ప్రతి నిర్ణయానికీ ప్రజలు ఓట్లేశారని నేను అనుకోవడం లేదు. ఈ పథకానికి మోదీకి నేను ఓటేయాలి.. ఆ పథకానికి వేయకూడదు అన్న చాయిస్ ప్రజలకు లేదు. వారికి ఉన్నది ఒక్కటే చాయిస్.. మోదీనా.. కాదా?' అని అభిజిత్ పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనకు విశిష్ఠ పరిశోధనలు జరిపిన అభిజిత్‌కు ఈ ఏడాది ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారం వరించిన విషయం తెలిసిందే. అభిజిత్‌తో పాటు ఆయన భార్య డ్యుఫ్లో, మైఖెల్ క్రేమర్ కూడా నోబెల్‌కు ఎంపికయ్యారు.

**న్యాయ్‌కు బాధ్యత నాది కాదు..**

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి తాను సూచించిన న్యాయ్ పథకంపై వస్తున్న విమర్శల మీద ఆయన స్పందిస్తూ.. ఆ పథకాన్ని సరిగా రూపొందించలేదని అంగీకరించారు. 'న్యాయ్ పథకాన్ని వాస్తవానికి సరిగా రూపొందించలేదు. దాన్ని ఎలా రూపొందించాలి అని నన్ను ఎవరూ అడుగలేదు. కాబట్టి దానికి నాది బాధ్యత కాదు. న్యాయ్ ఒక ఐడియా. దానికి రాజకీయంగా మద్దతు లభించినా.. అది మంచిగా రూపొందించిన పథకం కాకపోవచ్చు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉన్నా.. రాజకీయ ఒత్తిళ్లు.. ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా వారు అందులో మార్పులు చేయాల్సి వచ్చేది. ఇందులో పథకం రూపొందించడం నా పాత్ర కాదు. నిర్ణయాలు తీసుకునేందుకు సమాచారం ఇవ్వడమే నా పని' అని ఆయన పేర్కొన్నారు.

**కాంగ్రెస్ సిద్ధంగా లేదు..**

దేశంలో బలమైన ప్రతిపక్షం ఉండాల్సిన అవసరం ఉందని అభిజిత్ అభిప్రాయపడ్డారు. 'ప్రస్తుతం దేశానికి బలమైన ప్రతిపక్షం అవసరం. ప్రజాస్వామ్యానికి ఇది మేలు చేస్తుంది. అయితే ప్రస్తుతం ఆ బాధ్యతను తీసుకునేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ప్రజలు భావిస్తున్నట్లు నేను అనుకోవడం లేదు. ఆ పార్టీకి ప్రస్తుతం అధ్యక్షుడు లేడు. అధ్యక్షుడు ఎవరైనా, అతడికి బలమైన అధికారాలు ఇవ్వాలి. వారు కోరుకున్నట్లుగా పార్టీని నడిపించే స్వేచ్ఛనివ్వాలి' అని సూచించారు.

**నిర్మలాసీతారామన్ నాకు స్నేహితురాలు**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తనకు స్నేహితురాలు అని, ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో (జేఎన్‌యూ) తాము కలిసి చదువుకున్నామని అభిజిత్ బెనర్జీ తెలిపారు. 1983లో అభిజిత్ జేఎన్‌యూలో ఆర్థికశాస్త్రంలో మాస్టర్స్ పూర్తిచేయగా, నిర్మలాసీతారామన్ కూడా ఎకనమిక్స్‌లో మాస్టర్స్‌తోపాటు 1984లో ఎంఫిల్ పూర్తిచేశారు. దేశం గురించి జేఎన్‌యూలో తాను ఎంతో నేర్చుకున్నానని అభిజిత్ తెలిపారు. నిర్మల తనకు స్నేహితురాలని, ఆమె చాలా తెలివైనవారని చెప్పారు. అప్పట్లో తమ రాజకీయ భావనలు కూడా నాటకీయంగా భిన్నంగా ఉండేవి కాదన్నారు. బీజేపీ ప్రభుత్వం పట్ల తాను విమర్శలు చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై ఆయన స్పందిస్తూ.. 'గతంలో నేను చేసిన వ్యాఖ్యలను వారు పరిశీలించాలి. యూపీఏ పాలనపైనా నేను తీవ్ర విమర్శలు చేశాను' అని పేర్కొన్నారు.

## అభిజిత్‌ను చూసి భారతీయులు గర్విస్తున్నారు: రాహుల్



అభిజిత్ బెనర్జీపై కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్ విమర్శలు చేయడంపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ స్పందించారు. అభిజిత్ ప్రొఫెషనలిజంపై గోయల్ ప్రశ్నలు లేవనెత్తడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అభిజిత్‌కు అండగా నిలిచారు. 'డియర్ బెనర్జీ.. ఈ దురభిమానులకు ద్వేషంతో కళ్లు మూసుకుపోయాయి. వారికి ప్రొఫెషనల్ అంటే ఏంటో తెలీదు. మీరు దాని గురించి వారికి వివరించలేరు. దశాబ్దాల పాటు ప్రయత్నించినా అది వృథా ప్రయాసే అవుతుంది. మీ కృషి పట్ల లక్షలాది మంది భారతీయులు గర్విస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోండి' అని రాహుల్ ట్వీట్‌చేశారు.

# దేశ రక్షణలో 292 మంది ప్రాణత్యాగం

- 2018 సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు పోలీసు అమరుల సంఖ్యను వెల్లడించిన అధికారగణం
- స్వాతంత్య్రం వచ్చినప్పటినుంచి అసువులు బాసిన సిబ్బంది 35వేలకుపైగానే..

**నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం**

**నాగ్‌పూర్, అక్టోబర్ 20:** దేశ రక్షణ కోసం ఏడాదిలో 292 మంది పోలీసులు అసువులు బాసారు. దేశవ్యాప్తంగా 2018 సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు ఉగ్రవాద, ఇతర కార్యకలాపాల్లో పోలీసులతోపాటు సీఆర్పీఎఫ్, బీఎస్‌ఎఫ్ వంటి పారామిలిటరీ దళాలకు చెందిన సైనికులు మొత్తం 292 మంది ప్రాణత్యాగాలు చేశారని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు దేశవ్యాప్తంగా 35,136 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఏడాది వ్యవధిలో 292 మంది బలికాగా, వారిలో ఉగ్రవాదులు, తీవ్రవాదులతో పోరులో అత్యధికంగా సీఆర్పీఎఫ్‌కు చెందిన 67 మంది ప్రాణత్యాగాలు చేశారు. ఇందులోనూ ఈ ఏడాది ఫిబ్రవరిలో కశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో ఏకంగా 40 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది చనిపోయారని దేశంలోని వివిధ భద్రతాదళాలు, సంస్థలు అందజేసిన లెక్కలు చెప్తున్నాయి.

**ఉగ్ర, మావోయిస్టు దాడులు.. ఇసుక మాఫియా**

ఏడాది వ్యవధిలో 41 మంది సరిహద్దు భద్రతాదళాలు (బీఎస్‌ఎఫ్), 23 మంది ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), 24 మంది జమ్ముకశ్మీర్ పోలీసులు ప్రాణాలు విడిచారు. 20 మంది మహారాష్ట్ర పోలీసు సిబ్బంది చనిపోగా, వీరిలో ఈ ఏడాది మే నెలలో గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టులు జరిపిన పేలుడులో అత్యధికంగా 15 మంది బలయ్యారు. ఈ ఏడాది విధి నిర్వహణలో కన్నుమూసిన వారిలో 14 మంది ఛత్తీస్‌గఢ్ పోలీసులు, 12 మంది కర్ణాటక పోలీసులు, 11 మంది రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, ఢిల్లీ, రాజస్థాన్ పోలీసులు 10 మంది చొప్పున, బీహార్ పోలీసులు ఏడుగురు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్‌ఎఫ్)కు చెందిన ఆరుగురు పోలీసులు ఉన్నారు. చనిపోయిన పోలీసుల్లో జార్ఖండ్, ఉత్తరాఖండ్, అరుణాచల్‌ప్రదేశ్, హర్యానా, మణిపూర్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, సిక్కిం, హిమాచల్‌ప్రదేశ్, త్రిపురకు చెందినవారితోపాటు సశస్త్ర సీమాబల్, నేషనల్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, అసోం రైఫిల్స్‌కు చెందిన సిబ్బంది ఉన్నట్టు లెక్కలు చెప్తున్నాయి. దేశ సరిహద్దులో ఉగ్రదాడుల్లో, దేశంలో లోపల మావోయిస్టుల దాడుల్లో అత్యధిక మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మావోయిస్టులు, ఉగ్రవాదులు, మద్యం, ఇసుక మాఫియా దాడుల్లో శాంతిభద్రతల విధి నిర్వహణలో ఎక్కువమంది రాష్ట్ర పోలీసులు అసువులు బాసారు. ప్రాణాలు కోల్పోయిన 292 మంది పోలీసుల పేర్లను సోమవారం జరిగే పోలీసు సంస్మరణ దినోత్సవంలో చదివి వినిపించనున్నారు.



# మహిళా సమాఖ్య పనితీరు భేష్

జార్ఖండ్ బృందం కితాబు



జార్ఖండ్ బృందంతో సమావేశమైన మూసాపేట మహిళా సమాఖ్య సభ్యులు

**మూసాపేట:** మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండల మహిళా సమాఖ్య పనితీరు బాగుందని జార్ఖండ్ రాష్ట్ర బ్లాక్ ప్రాజెక్టు మేనేజర్లు కుమార్, అరుణ్, దీపక్‌కుమార్‌సింగ్, దీపక్‌సింగ్, ధీరేందర్‌సింగ్, గణేశ్ మహటో, లాల్‌బీహారి గుప్తా, ముఖేశ్‌కుమార్ కొనియాడారు. మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి గ్రామ మహిళా సంఘాల పనితీరుపై అధ్యయనం చేయడానికి వచ్చిన వారు ఆదివారం సభ్యులతో భేటీ అయ్యారు. మండల మహిళా సమాఖ్య ఎప్పుడు ఏర్పడింది? మండలంలో ఎన్ని గ్రామ సంఘాలు ఉన్నాయి? ఏ విధంగా ఏర్పాటుచేసుకున్నారు? వాటితో మండల సమాఖ్య ఏ విధంగా నిర్వహిస్తున్నారు?.. ఎంత మంది సభ్యులు ఉన్నారు? వారిలో ఎంత మంది సభ్యత్వం చెల్లిస్తున్నారు? ఎన్ని సంఘాలు వాడుకలో ఉన్నాయి? వాటికి రుణాలు ఎంతవరకు అందించారు? ఎంతమంది లబ్ధి పొందుతున్నారు? అని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ.. మహిళా సమాఖ్య పనితీరు ఎంతో బాగుందని కితాబిచ్చారు. కార్యక్రమంలో జాతీయ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ కోఆర్డినేటర్ ముశ్రఫా, డీపీఎం నాగమల్లిక, ఏపీఎం విష్ణుచారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే బోర్డులో కీలక సంస్కరణలు!

అధికారుల సంఖ్యను 200 నుంచి 150కు కుదించేందుకు చర్యలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 20:** రైల్వే బోర్డులో కీలక సంస్కరణలకు రైల్వే మంత్రిత్వ శాఖ సిద్ధమైంది. బోర్డులోని అధికారుల సంఖ్యను 25 శాతానికి తగ్గించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం బోర్డులో ఉన్న 200 మంది అధికారులను 150కి కుదించనున్నది. 50 మంది డైరెక్టర్, పైస్థాయి అధికారులను రైల్వే జోన్లకు బదిలీ చేయనున్నది. తద్వారా బోర్డులో అధికంగా ఉన్న అధికారుల సంఖ్యను అవసరం మేరకు సరిచేయాలని భావిస్తున్నది. అదనంగా భావిస్తున్న 50 మంది ఉన్నతాధికారుల సేవలను జోన్ల బలోపేతానికి వినియోగించుకోనున్నట్లు ఓ అధికారి ఆదివారం తెలిపారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనను సాధ్యమైనంత తర్వలో అమలు చేయాలని రైల్వేమంత్రిత్వశాఖ నిర్ణయించిందని చెప్పారు. రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ వంద రోజుల ఎజెండాతోపాటు రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్‌కు అత్యంత ప్రాధాన్యత అంశం కూడా ఇదేనని తెలిపారు. రైల్వే బోర్డులో సంస్కరణల ప్రతిపాదనను తొలుత 2000లో నాటి వాజపేయి ప్రభుత్వం చేసింది. అనంతరం 2015లో రైల్వే బోర్డును పునర్నిర్మించాలని బిబేక్ డెబ్రాయ్ కమిటీ సిఫార్సు చేసింది. రైల్వే శాఖలోని కేంద్రీకృత విధానం, శాఖల విస్తరణ వల్ల పని సంస్కృతిపై ప్రభావం చూపడంతోపాటు ఆయా శాఖల లక్ష్యాలను దెబ్బతీస్తున్నదని నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో రైల్వే బోర్డులో అధికారుల సంఖ్యను కుదించాలని ఇటీవల జరిగిన సమావేశంలో రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ నిర్ణయించారు. బోర్డుతోపాటు అన్ని విభాగాల్లో అధికారులు, సిబ్బంది సంఖ్యను సమీక్షించి అధికంగా ఉన్నవారిని అవసరమైనచోట వినియోగించేలా చర్యలు చేపట్టాలని రైల్వేబోర్డు చైర్మన్‌తోపాటు సభ్యులు, జోన్ల జనరల్ మేనేజర్లకు ఆయన సూచించినట్లు తెలుస్తున్నది.

## రైల్వే లోకో పైలట్లకు ట్యాబ్‌లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డిజిటలైజేషన్ దిశగా దక్షిణ మధ్య రైల్వే వేగంగా అడుగులు వేస్తున్నది. ఇప్పటికే ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్న రైల్వే.. తాజాగా జోన్‌లో పనిచేస్తున్న లోకో పైలట్లకు ట్యాబ్‌లను పంపిణీ చేసింది. దీంతోపాటు పనిభారాన్ని తగ్గించేందుకు కామన్ లైన్ బాక్స్ పద్ధతిని అమలుచేస్తున్నది. సమస్యలు ఎదురైనపుడు వేగంగా నిర్ణయాలు తీసుకోవటం, సమాచారాన్ని తెలుసుకోవటం ట్యాబ్‌లతో సులభం కానున్నది. ఇక కామన్ లైన్ బాక్సుల్లో టూల్ కిట్, రక్షణ పరికరాలు, ఇతర సమాచార సామగ్రి ఉంటుంది. ఈ రెండు కిట్లను జీఎం గజానన్ మాల్యా ఆదివారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో లోకో పైలట్లకు పంపిణీ చేశారు.

# క్యాన్సర్‌పై సమరం

- వ్యాధి నిర్ధారణ, చికిత్సా సేవల విస్తరణ
- బోధన, జిల్లా ప్రభుత్వ దవాఖానల్లో పరీక్షలు
- ప్రాథమిక దశలోనే గుర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిపై రాష్ట్ర ప్రభుత్వం సమరం ప్రకటిస్తున్నది. రాష్ట్రంలోని బోధన దవాఖానలతోపాటు జిల్లా దవాఖానల్లో వ్యాధి నిర్ధారణ, చికిత్స కేంద్రాలను విస్తరింపజేసేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సిద్ధమవుతున్నది. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలను గుర్తిస్తే, ప్రాణాలను కాపాడవచ్చన్న ఉద్దేశంతో.. ప్రాథమిక, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, ఏరియా దవాఖానల పరిధిలో అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నది. ఇందుకు హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనున్నది.

**ప్రాథమిక దశలోనే గుర్తించేలా చర్యలు**

ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి, ప్రాణాలను కాపాడేందుకు వీలుగా మూడు క్యాటగిరీల్లో వ్యాధినిర్ధారణ, చికిత్సా కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు. నోడల్ ఏజెన్సీగా వ్యవహరించే (ఎల్-1క్యాటగిరీ) ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తారు. స్క్రీనింగ్, వ్యాధి నిర్ధారణ, గుర్తింపు, అడ్వాన్స్‌డ్ ఇమేజింగ్/స్టాగింగ్, ఎండోస్కోపి, క్లినికల్ పాథాలజీ, హిస్టోపాథాలజీ, కిమోథెరఫీ, ఇమ్యునోథెరఫీ, రేడియేషన్‌థెరఫీ, బ్రాచిథెరఫీ, జనరల్ సర్జరీ, ఆంకో సర్జరీ, క్లినికల్ కేర్, టెలిమెడిసిన్, క్లినికల్ రీసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, క్యాన్సర్ రేడియాలజీ వంటి 18రకాల సేవలను అందించనున్నారు. ఎల్-2 క్యాటగిరిలో భాగంగా మహబూబ్‌నగర్, నిజామాబాద్ ప్రభుత్వ వైద్యకళాశాలలు, ఆదిలాబాద్ రిమ్స్ దవాఖాన, వరంగల్ కాకతీయ వైద్యకళాశాల పరిధిలో ఇమ్యునోథెరఫీ, క్లినికల్ రీసెర్చ్ మినహా ఎల్-1 క్యాటగిరీలోని మిగిలిన 16 రకాల సేవలు అందిస్తారు. ఎల్-3 క్యాటగిరీలో భాగంగా ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్ జిల్లా దవాఖానల్లో.. ఇమ్యునోథెరఫీ, ఆంకో సర్జరీ, క్లినికల్ రీసెర్చ్ మినహా మిగిలిన సేవలు అందిస్తారు. కొత్తగా ఏర్పాటుచేయనున్న క్యాన్సర్‌నిర్ధారణ, చికిత్సాకేంద్రాల్లో వైద్యపరికరాలు, వసతుల కల్పనపై వైద్యారోగ్యశాఖ దృష్టిసారించింది. కాగా, ప్రాథమిక, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, ఉపకేంద్రాలు (సబ్‌సెంటర్లు), ఏరియా దవాఖానల పరిధిలో క్యాన్సర్‌పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు నిర్ధారణ పరీక్షలు చేయించుకునేలా జిల్లా కేంద్ర దవాఖానలకు రిఫర్‌చేస్తారు.

## క్యాన్సర్ నుంచి కాపాడేందుకే



క్యాన్సర్ బారినుంచి ప్రజలను కాపాడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కృషిచేస్తున్నది. ప్రాథమికదశలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉన్నది. క్యాన్సర్‌ని ప్రాథమికంగా గుర్తించడంపై పీహెచ్‌సీ, యూహెచ్‌సీల పరిధిలోని వైద్యశాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా బోధన దవాఖానలు, జిల్లా దవాఖానల పరిధిలో క్యాన్సర్‌నిర్ధారణ, చికిత్సా కేంద్రాల నిర్వహణకు ఎంఎన్‌జే దవాఖాన నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్నది.

-డాక్టర్ జయలత, ఎంఎన్‌జే డైరెక్టర్

## భారతరత్న శివకుమార్ స్వామిజీకి ఇవ్వాలి

గాంధీజీ హత్య కేసులో సావర్కర్ నిందితుడు

: సిద్ధరామయ్య

**బెంగళూరు, అక్టోబర్ 20:** భారత అత్యున్నత పురస్కారం భారతరత్నను హిందుత్వవాది సావర్కర్‌కు బదులుగా ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శివకుమార్ స్వామిజీకి ఇవ్వాలని కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య సూచించారు. నడిచే దేవుడిగా ప్రసిద్ధిగాంచిన శివకుమార్ స్వామిజీ ఈ ఏడాది జనవరిలో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన మైసూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ మహాత్మా గాంధీ హత్య కేసులో నిందితుడైన సావర్కర్‌కు ఇప్పుడు భారతరత్న ఇవ్వాల్సిన అవసరం లేదని, ఆయనకు బదులు ఎన్నో ప్రజా కార్యక్రమాలను చేపట్టిన శివకుమార్ స్వామిజీకి భారతరత్న పురస్కారాన్ని ప్రకటిస్తే బాగుంటుందని చెప్పారు. సావర్కర్ పచ్చి హిందుత్వవాది అని తెలిపారు. 2018లో తాను సీఎంగా ఉన్నప్పుడు శివకుమార్ స్వామిజీకి భారతరత్న ఇవ్వాలంటూ ప్రధాని మోదీకి లేఖ కూడా రాశానని గుర్తుచేశారు. సావర్కర్ విషయంలో తాను నిజం మాట్లాడుతున్నానని, అందుకే చాలా మంది (బీజేపీ కార్యకర్తలు) తనకు వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నారని పేర్కొన్నారు.

# క్రీడల్లోనూ గురుకుల విద్యార్థుల సత్తా

- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహం
- జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొంటే నగదు బహుమతి
- పతకాల సాధనలో బాలికలదే పైచేయి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని గురుకుల విద్యార్థులు చదువులో రాణిస్తూనే.. క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో ఎస్సీ, ఎస్టీ గురుకులాల విద్యార్థులు పతకాలు సాధించి రాష్ట్రానికి వన్నెతెస్తున్నారు. పతకాలు సాధించిన వారికి రాష్ట్రప్రభుత్వం నగదు ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించడంతో విద్యార్థులు ఉత్సాహంగా క్రీడాపోటీల్లో పాల్గొంటున్నారు. క్రీడాపోటీల్లో విద్యార్థినులు అధికసంఖ్యలో పాల్గొనడం విశేషం.

**విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు**

గురుకుల విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారికి నగదు ప్రోత్సాహకం అందిస్తున్నది. నగదు ప్రోత్సాహకం అందించేందుకు 38 క్రీడాంశాలను ఎంపిక చేశారు. అందులో పుట్‌బాల్, హాకీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, బ్యాడ్మింటన్, కబడ్డీ, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, సైక్లింగ్, రోయింగ్, షూటింగ్, ఫెన్సింగ్, రోలర్‌స్కేటింగ్, సెయిలింగ్ యాచింగ్, ఆర్చరీ, క్రికెట్, చెస్, ఖోఖో, జూడో, తైక్వాండో, సాఫ్ట్‌బాల్, బాడీబిల్డింగ్, బాల్‌బ్యాడ్మింటన్, కరాటే, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, నెట్‌బాల్, త్రోబాల్, సెపక్‌తక్రా, టెన్నికాయిట్, యోగా ఉన్నాయి.

**తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక క్రీడాపోటీల్లో పతకాలు సాధించిన ఎస్సీ, ఎస్టీ గురుకులాల విద్యార్థుల సంఖ్య**

| పతకం | అంతర్జాతీయ స్థాయి | | జాతీయస్థాయి | | రాష్ట్రస్థాయి | |
|---|---|---|---|---|---|---|
| క్యాటగిరీ | బాలికలు | బాలురు | బాలికలు | బాలురు | బాలికలు | బాలురు |
| బంగారు పతకం | 3 | 0 | 16 | 8 | 74 | 48 |
| రజత పతకం | 1 | 0 | 19 | 4 | 83 | 48 |
| కాంస్య పతకం | 0 | 1 | 18 | 6 | 23 | 40 |
| మొత్తం | 4 | 1 | 53 | 18 | 180 | 136 |

**రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పతకాలు సాధించిన, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు**

**సాధించిన పతకాలకు అందించే ప్రోత్సాహకం రూపాయల్లో**

| క్రీడాపోటీలస్థాయి | బంగారు | రజత | కాంస్యం | పాల్గొన్నవారికి |
|---|---|---|---|---|
| అంతర్జాతీయస్థాయి | 25,000 | 20,000 | 15,000 | 10,000 |
| జాతీయస్థాయి | 15,000 | 10,000 | 5,000 | 2,000 |
| రాష్ట్రస్థాయి | 5,000 | 3,000 | 2,000 | - - |

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
సోమవారం 21 అక్టోబర్ 2019



'అల వైకుంఠపురములో' అల్లు అర్జున్, పూజాహెగ్డే

# రాములో రాములా..

'సామజవరగమన....నీ కాళ్లను పట్టుకు వదలనన్నవి చూడే నా కళ్లు...ఆ చూపులనలా తొక్కుకు వెళ్లకు దయలేదా అసలు..' అంటూ 'అల వైకుంఠపురములో' సినిమా కోసం సిరివెన్నెల కలం నుంచి జాలువారిన ప్రణయగీతం సంగీతప్రియుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తున్నది. మదిలోని ప్రేమానుభూతులకు దర్పణంలా ఈ పాట అందరిని మెప్పిస్తున్నది. విడుదలైన 24గంటల్లోనే ఆరు మిలియన్ల వ్యూస్ లభించాయి. 'ఇప్పటివరకు ఈ పాటకు 40మిలియన్స్ వ్యూస్, ఏడు లక్షల లైక్స్ వచ్చాయి. తెలుగులో ఫస్ట్‌సింగల్‌కు ఈ స్థాయిలో స్పందన రావడం ఓ రికార్డు' అని చిత్ర బృందం తెలిపింది. తమన్ స్వరపరచిన ఈ గీతాన్ని సిద్‌శ్రీరామ్ ఆలపించారు. ఇదిలావుండగా ఈ సినిమాలోని 'రాములో రాములా..' సాంగ్‌ప్రోమోను నేడు విడుదల చేయబోతున్నారు. పూర్తి పాటను దీపావళి కానుకగా విడుదల చేయబోతున్నారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూజాహెగ్డే కథానాయిక. టబు, రాజేంద్రప్రసాద్, సచిన్‌ఖేడ్‌కర్, తనికెళ్లభరణి, మురళీశర్మ, సముద్రఖని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: పీఎస్ వినోద్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: పీడీవీ ప్రసాద్.

# 'నూటొక్క జిల్లాల అందగాడు' ప్రారంభం



రాజీవ్‌రెడ్డి, దిల్‌రాజు, సాయిబాబు, క్రిష్, అవసరాల శ్రీనివాస్, రుహాని శర్మ, తదితరులు

అవసరాల శ్రీనివాస్ కథానాయకుడిగా రూపొందిస్తున్న 'నూటొక్క జిల్లాల అందగాడు' చిత్రం శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రుహాని శర్మ కథానాయిక. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు తెరకెక్కిస్తున్నాయి. దిల్‌రాజు, క్రిష్ సమర్పణలో రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాచకొండ విద్యాసాగర్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. 'వైవిధ్యమైన కథాంశమిది. ఆద్యంతం వినోదప్రధానంగా అలరిస్తుంది. అవసరాల శ్రీనివాస్ పాత్ర చిత్రణ నవ్యపంథాలో సాగుతుంది' అని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రామ్, ఆర్ట్: ఏ.రామాంజనేయులు, ఎడిటర్: కిరణ్ గంటి, సంగీతం: స్వీకార్ అగస్తి, డిజైనర్: ఐశ్వర్య రాజీవ్, రచన: అవసరాల శ్రీనివాస్, సమర్పణ: దిల్‌రాజు, జాగర్లమూడి క్రిష్.

# నిజమైన ఖైదీలను కలిశాను!

**తమిళ చిత్రసీమలో కొత్తదనానికి చిరునామాగా నిలుస్తుంటారు కథానాయకుడు కార్తి. వాణిజ్య సూత్రాలు, ఇమేజ్ లెక్కలతో సంబంధం లేకుండా వైవిధ్యతను నమ్మి సినిమాలు చేస్తుంటారాయన. ప్రయోగాలకు ప్రాధాన్యతనిచ్చే ఆలోచన విధానమే ఆయనకు తమిళంతో పాటు తెలుగులో చక్కటి అభిమానగణాన్ని తెచ్చిపెట్టింది. కార్తి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఖైదీ' లోకేష్ కనకరాజ్ దర్శకుడు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదలకానుంది. ఆదివారం హైదరాబాద్‌లో కార్తి పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..**



కార్తి

**'ఖైదీ'లో మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలేవి?**

దర్శకుడు లోకేష్ కనకరాజ్ కథ చెప్పిన విధానం కొత్తగా అనిపించింది. నవ్యమైన ఆలోచనతో కూడిన చిన్న సినిమా ఇది.. నచ్చితే కలిసి చేద్దాం అంటూ నా దగ్గరకొచ్చారు. ఈ కథ నన్ను అమితంగా ఆకట్టుకున్నది. హాలీవుడ్ చిత్రం 'డైహార్డ్' తరహాలో వినూత్నంగా ఉంటుంది. కథ విన్న తర్వాత ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగ్గర్ లాంటి నటుడు కూడా ఈ సినిమా చేయొచ్చనిపించింది.

**ఈ సినిమా నేపథ్యమేమిటి?**

మాస్ హంగులతో సాగే పూర్తిస్థాయి యాక్షన్ చిత్రమిది. ఒక రాత్రిలో నాలుగు గంటల వ్యవధిలో జరిగే సంఘటనల సమాహారమే ఈ చిత్ర ఇతివృత్తం. ఓ ప్రయాణం కొందరి జీవితాల్ని ఎలాంటి మలుపులు తిప్పిందన్నది తెరపై ఆసక్తిని పంచుతుంది.

**టీజర్‌లో మీరు డీగ్లామర్ లుక్‌లో కనిపిస్తున్నారు. మీ పాత్ర ఎలా ఉంటుంది?**

పదేళ్లు శిక్షను పూర్తిచేసుకొని విడుదలకు సిద్ధమైన ఖైదీగా కనిపిస్తాను. అతడికి ఓ కూతురు ఉంటుంది. పుట్టినప్పటినుంచి తన కూతురిని ఆ ఖైదీ చూడలేని పరిస్థితులు తలెత్తుతాయి. అలా ఎందుకు జరిగింది? తన కూతురిని ఆ ఖైదీ ఎలా కలుసుకున్నాడనేది భావోద్వేగభరితంగా ఉంటుంది. యాక్షన్, అభినయం కలబోతగా నా పాత్ర సాగుతుంది.

**తండ్రి పాత్రలో నటించడం ఛాలెంజింగ్‌గా అనిపించిందా?**

నిజజీవితంలో నాకు ఓ కూతురు ఉంది. తండ్రీకూతుళ్ల బంధం విలువ ఏమిటో అనుభవపూర్వకమే కాబట్టి సవాల్‌గా ఎప్పుడూ అనిపించలేదు.'విక్రమార్కుడు' రీమేక్‌ను నా పెళ్లికి ముందు చేశాను. ఆ సినిమాలో నాకు ఓ కూతురు ఉంటే ఎలా ఉంటుందో ఊహించుకుంటూ నటించాను. కానీ ఈ సినిమాకు అలా ఆలోచించాల్సిన అవసరం రాలేదు.

**చిరంజీవి 'ఖైదీ' టైటిల్‌ను సినిమాకు పెట్టడానికి కారణం ఏమిటి?**

చిరంజీవి సినిమా టైటిల్ పెట్టాలనే ఆలోచన మాకు లేదు. కథానుగుణంగానే ఆ పేరును నిర్ణయించాం.

**కొత్త ప్రయోగాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారా?లేదా? అన్న భయం ఎప్పుడైనా కలిగిందా?**

'అర్జున్‌రెడ్డి' లాంటి సినిమాల్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అడివిశేష్‌లాంటి హీరోలు వినూత్న కథాంశాలతో సినిమాలు చేసి విజయాల్ని అందుకుంటున్నారు. ప్రేక్షకుల అభిరుచుల్లో మార్పులు కనిపిస్తున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌కు ఆదరణ పెరడగంతో అంతర్జాతీయ కథాంశాలు మన ప్రేక్షకులకు చేరువయ్యాయి. నవ్యతతో ప్రయత్నిస్తే ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతోనే ఈ సినిమా చేశాం. కెరీర్‌లో ఎప్పుడో ఒకసారి ఇలాంటి అవకాశం వస్తుంది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసేటప్పుడు పాటలు, రొమాన్స్, కథానాయిక లేని సినిమా చేయాలని అనుకునేవాణ్ణి. ఆ కల ఈ సినిమాతో తీరింది. నటుడిగా నాకు కొత్త అనుభూతిని పంచింది.

**పాటలు, హీరోయిన్ లేకుండా సినిమా చేయడం రిస్క్ అనిపించలేదా?**

కేవలం నాలుగు గంటల్లో జరిగే కథ కావడంతో సినిమాలో పాటలు, రొమాన్స్‌కు చోటు కల్పించే అవకాశం రాలేదు. కామెడీ ట్రాక్‌లు పెట్టమని అడగాల్సిన అవసరమే లేకుండా పోయింది. యాక్షన్, విజువల్స్ కొత్త అనుభూతిని పంచుతాయి. సినిమా మొత్తం చీకట్లోనే సాగుతుంది. 60 రాత్రుళ్లు చిత్రీకరణం జరిపాం.

**ఈ సినిమా కోసం మీరు ఎలాంటి పరిశోధన చేశారు?**

వైవిధ్యత, ఛాలెంజింగ్ నిలిచే ఈ పాత్ర కోసం నిజమైన ఖైదీలను కలిశాను. పదేళ్లు జైలులో ఉండి బయటకువచ్చిన తర్వాత చిన్న చిన్న విషయాల్ని చూసి వారు పొందే అనుభూతిని ఈ సినిమాలో చూపించాం. ఈ పదేళ్లలో వారు ఏం కోల్పోయారు? విడుదల తర్వాత వారి ఉద్వేగాలు ఎలా ఉంటాయో చూపించాం.

**విడుదల తర్వాత ఫలితం గురించి విశ్లేషించుకుంటారా?**

'మీ మనసుకు నచ్చిన సినిమాలు చేయండి. మాకు నచ్చుతాయా? లేదా ఆలోచించొద్దు' అని గతంలో రిక్షాకార్మికుడైన అభిమాని చెప్పిన మాటలు నాలో ఆలోచనను రేకెత్తించాయి. కథ నాకు నచ్చితే అంగీకరిస్తాను. లేదంటే చేయను. విడుదల తర్వాత సినిమా గురించి అస్సలు ఆలోచించను.

**తదుపరి సినిమా విశేషాలేమిటి?**

'దృశ్యం' ఫేమ్ జీతుజోసఫ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాను. ఇందులో నాతో పాటు వదిన జ్యోతిక ఓ కీలక పాత్రను పోషించనున్నారు. ఫ్యామిలీ థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కనున్నది.

# ప్రేమకథ మెప్పిస్తున్నది



శ్వేత, అనురాగ్

'విజయాన్ని సాధించాలనే తపనతో చేసిన సినిమా ఇది. మా ప్రయత్నానికి చక్కటి స్పందన లభిస్తున్నది' అని అన్నారు అనురాగ్ కొణిదెన. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మళ్లీ మళ్లీ చూశా'. హేమంత్ కార్తిక్ దర్శకుడు. కె. కోటేశ్వరరావు నిర్మించారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ 'నాలోని ప్రతిభను గుర్తించి అవకాశమిచ్చిన నిర్మాత కోటేశ్వరరావుకు రుణపడి ఉంటాను. హృద్యమైన ప్రేమకథగా ప్రతి ఒక్కరిని ఈ సినిమా మెప్పిస్తున్నది' అని తెలిపారు. 'తొలి సినిమా హీరోలా కాకుండా అనుభవజ్ఞుడిలా అనురాగ్ అభినయాన్ని కనబరిచాడని ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. కథలోని వినోదం, భావోద్వేగాలు అలరిస్తున్నాయి. వినూత్నమైన పాయింట్‌తో చక్కటి దృశ్యకావ్యంగా హేమంత్ కార్తిక్ ఈ సినిమాను తెరపై ఆవిష్కరించారు. ఈ వారాంతంలో మరిన్ని థియేటర్లు పెంచుతున్నాం' అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సతీష్ పాలకుర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిజవాన్, శ్వేతాఅవస్థి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఉపాసన

# దక్షిణాది తారల్నీ గుర్తించండి!

భారత సినీరంగానికి చెందిన పలువురు ప్రముఖులతో ప్రధాని మోదీ శనివారం ఢిల్లీలోని తన నివాసంలో భేటీ అయ్యారు. మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని వినోదరంగానికి చెందిన వివిధ విభాగాలు తయారుచేసిన సాంస్కృతిక వీడియోలను మోదీ విడుదల చేశారు. అయితే ఈ వేడుకలో హిందీ సినీ, టీవీ రంగానికి చెందిన తారలు మాత్రమే కనిపించారు. ఈ విషయమై అగ్రహీరో రామ్‌చరణ్ సతీమణి ఉపాసన ట్విట్టర్ ద్వారా తన అసంతృప్తిని వ్యక్తం చేసింది. 'ప్రధానిగారు..దక్షిణాది తారలను కూడా గుర్తించండి' అంటూ ఓ పోస్ట్ చేశారు. 'గౌరవ ప్రధాని నరేంద్రమోదీగారికి...మీరు ప్రధాని అయినందుకు మాకు గర్వంగా ఉంది. దక్షిణ భారత ప్రజలకు కూడా మీరంటే గౌరవం. సినీ ప్రముఖులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కేవలం బాలీవుడ్ తారల్ని మాత్రమే ఆహ్వానించారు. సౌత్ ఇండియా నటీనటుల్ని విస్మరించారు. దక్షిణాది తారల్ని కూడా గుర్తించాలని కోరుకుంటున్నా. బాధతో మీకు ఈ విషయాన్ని తెలియజేస్తున్నా. ఈ అంశాన్ని మీరు అర్థం చేసుకుంటారనే విశ్వాసం ఉంది' అని ఉపాసన ట్విట్టర్‌లో పేర్కొంది. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.




# అందుకే విడిపోయాం!

కెరీర్ తొలినాళ్లలో కన్నడ హీరో రక్షిత్‌శెట్టితో ప్రేమ వ్యవహారాన్ని నడిపింది అగ్రనాయిక రష్మిక మందన్న. నిశ్చితార్థం జరుపుకున్న ఈ జంట ఆ తర్వాత రద్దు చేసుకున్నారు. తన విఫల ప్రేమ గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించింది రష్మిక మందన్న. 'నా తొలి చిత్రం 'కిరిక్‌పార్టీ' టైమ్‌లో రక్షిత్‌శెట్టితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. అయితే నా ప్రేమకథకు నిశ్చితార్థంతోనే ఫుల్‌స్టాప్ పడింది. అంతా సవ్యంగా జరుగుతుందనే విశ్వాసం ఉన్నప్పుడే ఏ బంధాన్నైనా ముందుకు తీసుకెళ్లొచ్చు. అభిప్రాయ భేదాలు తలెత్తితే మధ్యలో వదిలేయడం మంచిది. లేకపోతే భవిష్యత్తులో కష్టాలు వస్తాయి. అయితే బ్రేక్‌అప్ వల్ల ప్రేమపై నా నమ్మకాలేవి మారిపోలేదు. ప్రేమ ఎప్పటికీ ఉన్నతమైనదే' అని చెప్పింది.



రష్మిక మందన్న

# ప్రేమ పయనంలో..



సోనాక్షివర్మ

ఎస్.ఎస్.ఆర్ట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'ప్రేమ పిపాసి'. జీపీఎస్, కపిలాక్షి మల్హోత్రా, సోనాక్షివర్మ నాయకానాయికలుగా నటిస్తున్నారు. మురళీరామస్వామి (ఎమ్‌ఆర్) దర్శకుడు. పి.ఎస్.రామకృష్ణ నిర్మాత. ఈ చిత్ర టీజర్‌ను శనివారం విడుదల చేశారు. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'నిర్మాతగా తొలి చిత్రమిది. ప్రేమ ప్రయాణంలోని అందమైన అనుభూతులకు అద్దం పడుతుంది. త్వరలో ఆడియో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. 'ప్రతి మనిషిలో మరో కోణం ఉంటుంది. అదే మా సినిమా కథ. వాస్తవికతకు దగ్గరగా ఉంటుంది. లవ్, రొమాన్స్, యాక్షన్, కామెడీ కలబోతగా మెప్పిస్తుంది' అని దర్శకుడు చెప్పారు. విభిన్న కథా చిత్రంలో భాగమవడం ఆనందంగా ఉందని నాయకానాయికలు పేర్కొన్నారు. జ్యోతిరాజ్‌పుత్, మమతశ్రీచౌదరి, అంకిత, సంజనచౌదరి, సుమన్, భార్గవ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: తిరుమల రోడ్రిగ్జ్, సంగీతం: ఆర్స్, పాటలు: సురేష్ ఉపాధ్యాయ, అలరాజు, రచన-దర్శకత్వం: మురళీరామస్వామి (ఎమ్.ఆర్).

epaper.ntnews.com